తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 29.07.2025 | సంపుటి : 12 సంచిక : 10 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




42శాతం రిజర్వేషన్ కోసం

# ఢిల్లీకి అఖిలపక్షం

## 30న రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేద్దాం



- ఈడబ్ల్యూఎస్ 10%తో రిజర్వేషన్ 50 శాతం దాటింది
- బీసీల బాగు కోరేవాళ్లంతా మాతో కలిసి ఢిల్లీకి రావాలి
- రిజర్వేషన్లకు భాజపా నేతలు శాసనసభలో ఆమోదం తెలిపి.. ఢిల్లీలో అడ్డుకుంటున్నారు
- ఈ అంశంలో విజయం సాధించే వరకు అన్ని రకాలుగా పోరాడుతాం
- సీఎం రేవంత్ అధ్యక్షతన మంత్రివర్గసమావేశంలో పలు నిర్ణయాలు
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్(జనంసాక్షి):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు భాజపా నేతలు శాసనసభలో ఆమోదం తెలిపి.. ఢిల్లీలో అడ్డుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో రాష్ట్రపతి అపాయింట్ కోరామని చెప్పారు. వరసగా మూడురోజులపాటు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించామని పొన్నం తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోరేవారంతా తమతో కలిసి దిల్లీకి రావాలని పిలుపునిచ్చారు. "గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. గత ప్రభుత్వం వాటిని తగ్గించింది. రిజర్వేషన్ల పెంపు బిల్లును మేం మార్చి 30న రాష్ట్రపతికి పంపించాం. 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50శాతం కోటా దాటిపోయింది. ఈడబ్ల్యూఎస్‌కు అడ్డురాని 50శాతం కోటా బీసీల విషయంలో మాత్రమే ఎందుకు అడ్డువస్తుంది? బీసీ రిజర్వేషన్ల సాధనలో అన్ని



పార్టీలు కలిసి రావాలని కోరుతున్నాం. సామదానభేదదండోపాయాలు అన్నట్లుగా అన్ని రకాలుగా పోరాడుతాం"అని మంత్రి పొన్నం తెలిపారు. అంతకుముందు సచివాలయంలో మంత్రివర్గ సమావేశం సుమారు 5 గంటల పాటు జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రధానంగా చర్చించారు. గవర్నర్ వద్దకు పంపిన ఆర్డినెన్స్ అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. మిగతా 2లో..

# కాల్పుల విరమణలో అమెరికా ఒత్తిడి లేదు

## 100కి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాం: రాజ్‌నాథ్ సింగ్



- ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనం మన సైనికసత్తాను ప్రపంచమంతా గుర్తించింది
- ఉగ్రదాడికి ప్రతీకారంగానే సైనిక ఆపరేషన్
- పాక్‌దాడిని ప్రతిదాడితో ఘోరంగా దెబ్బతీసాం
- మన సైన్యం నిర్వహించిన పాత్ర అమోఘం
- లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో కేంద్ర రక్షణ రాజ్‌నాథ్ సింగ్ వివరణ
- 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశాం : జై శంకర్
- భారత్–పాక్‌ల మధ్య కాల్పుల విరమణలో ట్రంప్ ప్రమేయం లేదు : విదేశాంగ మంత్రి

### పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా రాగలిగారు?

- ఆపరేషన్ సిందూర్‌పై అనేక సందేహాలు ఉన్నాయి
- మోదీ ప్రభుత్వం వీటికి సమాధానం చెప్పాలి
- పాకిస్తాన్ పన్నాగాలను సాగనివ్వకూడదు:
- లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనమని, మన వీరజవాన్ల పాత్ర వెలకట్టలేనిదని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారంనాడు ప్రత్యేక చర్చను రాజ్‌నాథ్ సింగ్ మిగతా 2లో..

# చదరంగంలో యువరాణి



ఫిడే ప్రపంచ మహిళలచెస్ ఛాంపియన్ షిప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్

ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా దివ్య దేశ్‌ముఖ్ (19) నిలిచారు. ఆమె తన ప్రత్యర్థి కోనేరు హంపీపై విజయం సాధించారు. ఫైనల్స్‌లో వీరిద్దరి మధ్య జరిగిన తొలి ర్యాపిడ్ టై బ్రేకర్ డ్రాగా ముగియగా.. రెండో గేమ్‌లో మొత్తం 75 ఎత్తుల్లో దివ్య విజయం సాధించారు. చివరి టైబ్రేకర్‌లో దివ్య తెల్లపావులతో బరిలోకి దిగారు. 2025 ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చేరిన తొలి క్రీడాకారిణిగా ఆమె నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే టోర్నీలో విజేతగా ఆవిర్భవించిన తొలి క్రీడాకారిణి కూడా ఆమే. ఫైనల్స్‌లో దివ్య 1.5 పాయింట్లు.. కోనేరు హంపి 0.5 సాధించారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో కోనేరు హంపీ తీవ్రమైన పోటీ ఇచ్చారు. దీంతో ఫలితం నేడు టైబ్రేకర్‌కు చేరింది. నిన్న జరిగిన మ్యాచ్‌లో దివ్య కూడా దూకుడుగానే ఆడింది. ఓ దశలో హంపీని ఒత్తిడికి గురి చేసింది. తాజా విజయంతో దివ్య గ్రాండ్ మాస్టర్ హెూదాను అందుకొన్నారు. దీంతో భారత్‌లో ఈ హెూదా అందుకొన్న 88వ వ్యక్తిగా నిలిచారు.

నేను జోక్యం చేసుకోకపోతే

# భారత్-పాక్ ఇప్పటికీ యుద్ధంలో ఉండేవి



పార్లమెంట్‌లో ఆపరేషన్ సిందూర్ చర్చల వేళ ట్రంప్ మళ్లీ అదే పాత పాట

**వాషింగ్టన్(జనంసాక్షి):** భారత పార్లమెంటులో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ జరుగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదే పాత పాట పాడారు. తానే గనుక సకాలంలో జోక్యం చేసుకోకపోతే.. భారత్– పాకిస్థాన్‌లు ఈపాటికి మిగతా 2లో..

# పహల్గాం దాడికి ప్రతీకారం

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ • ముగ్గురు 'పహల్గాం' ఉగ్రవాదులు మృతి





**శ్రీనగర్(జనంసాక్షి):** జమ్మూకశ్మీర్‌లో సోమవారం జరిగిన 'ఆపరేషన్ మహాదేవ్'లో పహల్గాం దాడితో సంబంధం ఉన్న ముగ్గురు ఉగ్రవాదులను సైనిక దళాలు మట్టుబెట్టినట్లు సమాచారం. ఈ విషయాన్ని సైన్యం ధ్రువీకరించినట్లు ఆల్–ఇండియా రేడియో తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. మరోవైపు హతమైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడు గతేడాది సోనామార్గ్ టన్నెల్‌లో జరిగిన ఉగ్రదాడికి కారకుడు కాగా, మరొకడు పహల్గాం ఉగ్రదాడిలో అనుమానితుడిగా పీటీఐ కథనంలో పేర్కొంది. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల సమాచారంతో నెల రోజులుగా సైన్యం, పోలీసు బలగాలు గాలింపు మిగతా 2లో..

# మహిళా రైతు తలపగిలితే కేసెందుకు పెట్టలేదు?



### కంపెనీ పిటిషన్ ఆధారంగా ఆగమేఘాలపై రైతులపై కేసులు

- దాడి జరిగిన బాధితులు పిటిషన్ ఇస్తే పోలీసులు పట్టించుకోలేదు
- ఎన్‌హెచ్‌ఆర్‌సీ ముందు వాదనలు వినిపించిన అడ్వొకేట్ రామారావు
- కాలుష్య పరిశ్రమలు జీవించే హక్కును కాలరాస్తున్నాయి
- పర్యావరణానికి ప్రమాదకర పరిశ్రమల ఏర్పాటు మానవ హక్కుల ఉల్లంఘనే..
- వాదనలు వినిపించిన ప్రముఖ శాస్త్రవేత్త బాబురావు

వార్త 12 లో

## మరి అప్పుడు కమిటీ ముందు ఎందుకు హాజరయ్యారు?

### జస్టిస్ వర్మను ప్రశ్నించిన సుప్రీం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. త్రిసభ్య విచారణ కమిటీ ఇచ్చిన దర్యాప్తు నివేదికను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. ఈ క్రమంలో సుప్రీం ధర్మాసనం మిగతా 2లో..

# గిరిజనుల సంక్షేమం లక్ష్యంగా నిర్ణయాలు



- అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి సలహాలు
- గిరిజన సలహా మండలి సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- కేసీఆర్ పాలనలో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సీతక్క వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** గిరిజన సలహా మండలి గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి సలహాలిస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ సమావేశం ద్వారా ఆయా లక్ష్యాలను సాధించడం ద్వారా గిరిజనులకు న్యాయం చేసే అవకాశం దక్కిందని అన్నారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ గిరిజన సంక్షేమ శాఖలో సోమవారం 7వ గిరిజన సలహా మండలి సమావేశం జరిగింది. రాజ్యాంగబద్ధమైన ఈ సలహా మండలిలో 16 అజెండా అంశాలతో పాటు– పలు అదనపు అజెండా అంశాల మీద చర్చ జరిగింది. ఎస్సీ ఎస్టీ మైనారిటీ వికలాంగుల శాఖామాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని అందరు గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, –ట్రైకార్, జేసీసీ ఛైర్మన్లు పాల్గొన్నారు. ఈసమావేశంలో అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మిగతా 2లో..

## చౌకగా వచ్చే ముడిచమురును కొనొద్దంటారా?

- మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా?
- రష్యా చమురు కొనుగోలుపై భారత్ వివరణ



**లండన్(జనంసాక్షి):** ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాపై పశ్చిమదేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. దీనిపై న్యూదిల్లీ ఎప్పటికప్పుడు స్పష్టతనిస్తూనే ఉంది. తాజాగా యూకేలోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి దీనిపై మిగతా 2లో..



## ఈయూతో ట్రంప్ భారీ వాణిజ్య ఒప్పందం

### దిగుమతులపై 15శాతం సుంకాలు ప్రకటన

**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూరోపియన్ యూనియన్‌తో భారీ వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. ఇకపై ఈయూ దిగుమతులపై అమెరికా 15 శాతం సుంకాలను విధించనున్నదని వెల్లడించారు. యునైటెడ్ స్టేట్స్ దీనిని మునుపెన్నడూ మిగతా 2లో..

# థాయ్ -కంబోడియా కాల్పుల విరమణ

## ఫలించిన ట్రంప్ దౌత్యం



**బ్యాంకాక్(జనంసాక్షి):** ఆసియా దేశాలు థాయ్–కంబోడియా తాజా సరిహద్దు ఘర్షణలకు ఎట్టకేలకు ముగింపు పడింది. ఇరు దేశాలు ఎలాంటి షరతులు లేకుండా తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ విషయాన్ని చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన మలేషియా ప్రధాని అన్వర్ అబ్రహీం సోమవారం ప్రకటించారు. ఈ ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదం దశాబ్దాలుగా కొనసాగుతున్నదే. అయితే.. ఈ ఏడాది మే చివరి వారంలో కంబోడియన్ సైనికుడి కాల్చివేత ఘటన నుంచి 817 కిలోమీటర్ల సరిహద్దు వెంట ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరు దేశాల పరస్పర ఆరోపలతో దాడులను మొదలై.. తీవ్రతరం అవుతూ వచ్చాయి. ఈ క్రమంలో..గత నాలుగైదు రోజుల ఘర్షణల్లో ఇరు దేశాలకు చెందిన 34 మంది మరణించగా, లక్షా 68వేల మంది నిర్వాసితులు అయ్యారు. దీంతో యుద్ధం ఆపేందుకు మిగతా 3లో..



## ఆకలి చావులను ఆపండి

### గాజా పరిస్థితులపై ఒబామా ఆవేదన

**గాజా(జనంసాక్షి):** గాజా స్ట్రిప్‌లో అంతకంతకూ పెరుగుతున్న మానవతా సంక్షోభం మధ్య అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కీలక వ్యాఖ్యలు చేశారు. గాజాలో మిగతా 9లో..



# 'శ్రీశైలం'కు వరద

## జలాశయం రెండు గేట్లు ఎత్తి నీటి విడుదల

**కర్నూలు(జనంసాక్షి):** శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతుండటంతో మరో గేటును ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రెండు గేట్ల ద్వారా నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 1,27,392 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి ఔట్ ఫ్లో 1,40,009 క్యూసెక్కులు. రెండు స్పిల్‌వే గేట్ల ద్వారా 53,764 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,930 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.40 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 201.12 టీఎంసీలుగా నమోదైంది.

**నిండుకుండలా సాగర్ జలాశయం**

ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో సోమవారం నాగార్జున సాగర్ డ్యాం నిండుకుండను తలపిస్తుంది. శ్రీశైల ప్రాజెక్టు నుంచి 93,127 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతున్నది. ఇప్పటికే పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతోపాటు– ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుండటంతో క్రస్టు గేట్లను ఎత్తడానికి అధికారులు మిగతా 2లో..

# 42శాతం రిజర్వేషన్ కోసం ఢిల్లీకి అఖిలపక్షం

దీంతో పాటు ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌కు సంబంధించిన స్థానికత అంశంపై కూడా కేబినెట్‌లో చర్చించారు.స్థానికత అంశంపై స్పష్టత కోసం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సమావేశం స్పష్టత కోసం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సమావేశం మధ్యలోనే ఏజీ సుదర్శన్‌రెడ్డిని కలిసేం దుకు వెళ్లారు. రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాలు కాపాడాలని ఏజీకి మంత్రి విజ్ఞప్తి చేశారు. సుప్రీం కోర్టులో ఈ మేరకు వాదనలు వినిపించాలని సూచించారు. అవసరమైతే సీనియర్ న్యాయవాదుల సహకారం తీసుకోవాలని స్థానికులకే మెడికల్ సీట్లు దక్కేలా ప్రభుత్వం గతేడాది జీవో 33ను తీసుకొచ్చింది. అయితే స్థానిక కోటా సీట్లు తమకూ ఇవ్వాలని ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో స్థానికత అంశంపై సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. వచ్చేనెల 5న సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాల మేరకు మంత్రి, ఏజీని కలిసి, స్థానిక విద్యార్థుల ప్రయోజనాలు కాపాడాలని కోరారు.

## నేను జోక్యం చేసుకోకపోతే భారత్-పాక్ ఇప్పటికీ యుద్ధంలో ఉండేవి..:

**ఆపరేషన్ సిందూర్ చర్చల వేళ ట్రంప్ మళ్లీ అదే పాత పాట**

యుద్ధంలో ఉండేవని వ్యాఖ్యానించారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి ఆయన స్కాట్లాండ్‌లో మీడియాతో ఈ మేరకు మాట్లాడారు. ఇటీవల కాలంలో తాను ప్రపంచవ్యాప్తంగా ఆరు ప్రధాన యుద్ధాలను నివారించినట్లు చెప్పుకోవడం గమనార్హం."ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల కాల్పుల విరమణలు కొనసాగుతున్నాయి. నేనే లేకుంటే.. ఆరు పెద్ద యుద్ధాలు జరగుతుండేవి. ఇందులో భారత్- పాకిస్థాన్ ఘర్షణ అతిపెద్దది. ఎందుకంటే.. ఇవి రెండూ అణ్వస్త్ర దేశాలు. ఒకవేళ అణ్వాయుధాలు ప్రయోగించుకుంటే.. యుద్ధం విస్తరించడం, అణుధూళి వ్యాప్తి వంటి దారుణ పరిస్థితులు నెలకొనేవి. ఇరుదేశాల నేతలు నాకు చాలా బాగా తెలుసు. యుద్ధం చేసుకోవాలనుకుంటే.. వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోనని చెప్పాను" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. భారత్- పాక్‌ల మధ్య తానే యుద్ధం ఆపానంటూ ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, ఈ వ్యవహారంలో అమెరికా పాత్ర లేదని భారత్ ఖండిస్తూ వస్తోంది. పార్లమెంటులో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ సందర్భంగా విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకు ప్రధాని మోదీ, ట్రంప్‌ల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని తెలిపారు.

## పహల్గాం దాడికి ప్రతీకారం

కొనసాగించాయి. ఈ ఆపరేషన్ కోసం గత కొన్ని రోజులుగా దళాలు పకడ్బందీగా ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దాచిగామ్ అడవుల్లో రెండ్రోజుల క్రితం అనుమానాస్పద కమ్యునికేషన్లను భద్రతా దళాలు పసిగట్టాయి. దీనికి తోడు.. స్థానిక సంచార జాతుల వారు కూడా ఉగ్రవాదుల కదలిలపై భద్రతా దళాలకు సమాచారం అందించారు. సోమవారం చాలా బృందాలను సైన్యం ఆ ప్రదేశాలకు తరలించింది. ఉదయం 11.30 గంటల సమయంలో 24 రాష్ట్రీయ రైఫిల్స్, 4 పారా కమాండోల బృందం ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించింది. ముష్కర మూక షాక్ నుంచి కోలుకొనేలోపే శరవేగంగా ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ స్థావరంలో మొత్తం ఐదు నుంచి ఏడుగురు ఉగ్రవాదులున్నట్లు సమాచారం. చిక్కటి అరణ్యంలో ఓ గొయ్యి తవ్వి దానిపై టెంట్ వేసుకొని వీరు నక్కారు. ఈ క్రమంలో గాలింపు చేపట్టిన భద్రతా దళాలకు లిడ్వాస్ ప్రాంతంలో తొలిసారి ఉగ్రవాదులు భద్రతా దళాలకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ విషయాన్ని చినార్ కోర్ కూడా 'ఎక్స్'లో ధ్రువీకరించింది. ఇప్పటికే పహల్గాం ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చిన పర్వీజ్ అహ్మద్ జోథార్, బషీర్ అహ్మద్‌లను గత నెల అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

ఆపరేషన్‌కు ఈ పేరు ఎందుకు..?

దాచిగామ్ సమీపంలోని మహాదేవ్ పర్వతం ఆధారంగా ఈ ఆపరేషన్‌కు పేరు పెట్టారు. ఎన్‌కౌంటర్ జరుగుతున్న ప్రదేశం జబర్వన్-మహదేవ్ పర్వతాల మధ్య జరుగుతోంది. అందుకే ఈ పేరు పెట్టారు. ఈ ఆపరేషన్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా చేపట్టాయి. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది.మృతిచెందిన ముగ్గురూ విదేశీ ఉగ్రవాదులే.. వీరు లష్కరే తయిబాకు చెందినవారు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ చేపట్టారు. ఘటనాస్థలంలో ఏకే-47 రైఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా దళాలను నార్తర్న్ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ అభినందించారు. దళాలు వేగంగా స్పందించి చర్యలు తీసుకొన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడినుంచి పరారయ్యారు. అప్పటినుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. వీరిలో ఒక్కొక్కరి తలపై రూ.20లక్షల వరకు రివార్డును ఇప్పటికే ప్రకటించారు. ఇటు పార్లమెటులో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతుండటం, అటు ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో దీని గురించి గూగుల్‌లో వార్తలు ట్రెండ్ అవుతున్నాయి.



# కాల్పుల విరమణలో అమెరికా ఒత్తిడి లేదు

ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టింది. దీనిపై ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటూ, కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశామని చెప్పారు. పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని రాజ్‌నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఇందుకు ప్రతిగా పాక్ ఉగ్రవాద స్థావరాలపై వ్యూహాత్మకం గా దాడి చేశామని, 9 ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని, 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టు-బెట్టిందని సభకు తెలిపారు. పాక్‌లో సామాన్యులకు ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. సిందూర్ అనేది వీరత్వం, శౌర్యానికి ప్రతీక అని అభివర్ణించారు. ఉగ్రవాద శిబిరాలు, వారి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని వారిని మట్టు-బెట్టడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టామని అన్నారు. ఆత్మరక్షణ కోసమే సైనిక చర్య తీసుకున్నామని, రెచ్చగొట్టడానికో, విస్తరణవాదంతోనే కాదన్నారు.మే 10వ తేదీన సుమారు 1.30 గంటలకు కూడా ఇండియాపై క్షిపణలు, డ్రోన్లు, రాకెట్లు-, ఇతర సుదీర్ఘ శ్రేణి ఆయుధాలపై దాడులకు పాక్ తెగబడిందని చెప్పారు ఎస్-400, ఆకాశ్ మిజైల్ సిస్టమ్ పూర్తిగా పాక్ దాడులను విఫలం చేశాయని అన్నారు. పాకిస్థాన్‌లోని పలు వైమానిక కేంద్రాలపై భారత వాయిసేన భీకరంగా విరుచుకు పడటంతో పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చేందుకు కేవియట్‌తో ఆమోదించామని తెలిపారు. భవిష్యత్తులో పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా ఆపరేషన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

ముందుగా నిర్ణయించిన రాజకీయ, మిలటరీ లక్ష్యాలు నెరవేరడంతో ఆపరేషన్ సింధూర్‌కు విరామం ఇచ్చిందని, ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామనేదే పూర్తిగా తప్పని వివరించారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పకుండా ఉండేందుకే తాను ప్రయత్నించానని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు కూలిపోయాయంటూ కొందరు విపక్ష సభ్యులు ప్రశ్నించారని, అయితే ఆ ప్రశ్న మన జాతీయ భావోద్వేగాలకు ప్రతిబింబించేదిగా లేదని తాను భావిస్తున్నానని రాజ్‌నాథ్ చెప్పారు. ఎన్ని శత్రు విమానాలను కూల్చేశారని మాత్రం విపక్షాలు ప్రశ్నించ లేదన్నారు. ఉగ్రవాద శిబిరాలను కూల్చేశారా అని తప్పనిసరిగా వాళ్లు ప్రశ్నించి ఉంటే దానికి అవునన్నదే తన సమాధానమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా అని అడగవచ్చుని, అందుకు అవునన్నదే తన సమధానమని అన్నారు. మన సాహస జవాన్లు ఎవరైనా మరణించారా అని అడిగితే లేదన్నదే తన సమాధానమని అన్నారు. మన సైనికులెవ్వరికీ ఎలాంటి హాని జరగలేదని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. రాజ్‌నాథ్ ప్రసంగిస్తున్న సేపు అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు. పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నాం.

ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా.. ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ వినలేదు. ఇలాంటి విషయాల్లో ఆచితూచి, ఆలోచించి ప్రశ్నలు అడగాలన్నారు. 1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు విపక్షాలు ఎలాంటి ప్రశ్నలు వేశాయో తెలుసుకోవాలి. ఆనాడు విపక్షాలు భారత భూభాగం, మన సైనికుల పరిస్థితి గురించి ప్రశ్నించాయి. మన సైనికుల చర్యను వాజ్‌పేయి ప్రశంసించారు. 1999లో శాంతియుత పరిస్థితిని కోరుతూ వాజ్‌పేయి లాహోర్ యాత్ర చేపట్టారు. పాకిస్థాన్‌తో భారత్ స్నేహం కోరుకుంటోందని ఆనాడు వాజ్‌పేయి చెప్పారు. స్నేహ హస్తం చాచడమే భారత్ గొప్పతనం. ఆనాడు వాజ్‌పేయి తీవ్ర నిర్ణయం తీసుకుంటే పాక్ మర్నాడు సూర్యోదయం చూసేది కాదు. శాంతి కోరడం భారత్ రక్తంలోనే ఉంది. యుద్ధాలు కోరుకోం. ప్రతి విషయాన్ని మానవత్వ కోణంలో ఆలోచిస్తాం. తుపాకులు పేలితే ఎవరూ మిగలరని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ అధికారులు పాల్గొన్నారు. దీనిని బట్టి వారిని ఆ దేశం ఎలా పెంచి పోషిస్తుందో స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటివరకు మనం ఎవరిపైనా దాడి చేయలేదు. పాకిస్థాన్ చరిత్ర, అక్కడి ఉగ్రవాదం గురించి తెలుసుకొని మాట్లాడాలి. మనిషి.. నీతి, నిజాయతీతో బతకాలని తులసీదాస్ దోహాలో చెప్పారు. భారత స్నేహహస్తాన్ని పాక్ అందుకోలేకపోయింది. మనదేశ ప్రజలను చంపుతుంటే సైన్యం చూస్తూ ఊరుకోదు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం.. ఆ దేశానికే ఇబ్బందిగా మారుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

**'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశాం: జై శంకర్**

'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశామని విదేశాంగశాఖ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. ఉగ్రవాదాన్ని సహించేది లేదని ప్రపంచమంతా ముక్తకంఠంతో నినదించిన విషయాన్ని గుర్తు చేశారు. 'ఆపరేషన్ సిందూర్'పై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఆయన మాట్లాడారు. భారత్-పాక్‌ల మధ్య కాల్పుల విరమణను కుదర్చడంలో ట్రంప్ ప్రమేయాన్ని కొట్టిపారేశారు. ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకు ప్రధాని మోదీ, ట్రంప్‌ల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని స్పష్టం చేశారు."ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌లోని బహావల్‌పుర్, మురిద్కేలోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేస్తామని ఎవరైనా ఊహించారా?పాక్ ఎదురుదాడులను సమర్థంగా అడ్డుకున్న తర్వాత.. ఆ దేశం దాడులను నిలిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు మాకు ఫోన్లు వచ్చాయి. కానీ.. డీజీఎంవో నుంచి ఈ మేరకు విజ్ఞప్తి రావాలని స్పష్టం చేశాం.

**పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా రాగలిగారు?**
**- కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్**

పాక్ కుట్రలను సాగనివ్వకూడదని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై అనేక సందేహాలు ఉన్నాయని అయితే ప్రభుత్వం వీటికి సమాధానం చెప్పాలని కోరారు.ఆపరేషన్ సిందూర్‌పై రాజ్‌నాథ్ అనేక విషయాలు చెప్పారన్న ఆయన.. పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా రాగలిగారో చెప్పలేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా గౌరవ్ గొగోయ్ మాట్లాడారు. " పహల్గాంకు ఉగ్రవాదులు వచ్చి ఎలా దాడి చేయగలిగారో రాజ్‌నాథ్ చెప్పలేదు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు మేం తప్పకుండా కొన్ని ప్రశ్నలు అడుగుతాం. ప్రభుత్వం వాటికి కచ్చితంగా సమాధానం చెప్పాలి. భారతీయులు ఏకతాటిపై ఉండి పాకిస్థాన్ దురుద్దేశాలను సాగనివ్వకూడదు. ఉగ్రవాదులు పారిపోయేలా మనం చేశామా? లేదా? అన్నది చెప్పాలి. ఉగ్రదాడిలో చనిపోయిన వ్యక్తి భార్య తన ఆవేదన వెళ్లగక్కారు. తన భర్త మృతదేహంపై రాజకీయాలు కోరుకోవట్లేదని ఆమె చెప్పారు. మన సమాజం విభేదాలతో విచ్ఛిన్నం కావాలని పాక్ కోరుకుంటోంది. ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని రాహుల్ గాంధీ కూడా చెప్పారు. పాకిస్థాన్‌కు మాత్రం భారత్ తరఫున గట్టిగా బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోయి 100 రోజులు గడిచింది. ఇప్పటివరకు దాడికి కారకులను ప్రభుత్వం పట్టుకోలేకపోయింది.

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
**ఫారం-6**
**(ప్రాథమిక ప్రకటన)**
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని ఛాప్టర్ IIIఎ లోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం.45/2025 తేది:25-07-2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి తేది:15-07-2025
ఫైల్ నెం.జి/4630/2023
ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే), తేది:15-07-2025
యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.సి/1767/1/2017

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామములో విస్తీర్ణం ఎ.0.13½ గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం JCRDLIS-Phase-III Package-VII Main Canal of Distributory System of Nawabpet Reservoir నిర్మాణములో దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీ చేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం.63 I&CAD (LA.R&R/A2) శాఖ, తేది: 29.07.2017 ద్వారా JCRDLIS-Phase-III Package-VII Main Canal of Distributory System of Nawabpet Reservoir కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరావాస కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

కావున, పైన తెలిపిన భాగముగా JCRDLIS-Phase-III Package-VII Main Canal of Distributory System of Nawabpet Reservoir నిర్మాణ నిమిత్తం యాదాద్రి యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలం వెల్మజాల గ్రామములో విస్తీర్ణం ఎ. 0.13½ గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యూల్
గ్రామం: వెల్మజాల మండలం: గుండాల
జిల్లా:యాదాద్రి భువనగిరి

| సర్వే నెం. విస్తీర్ణం | భూమి రకం (ఖుష్కీ/ తరి) (పట్టా/ ప్రభుత్వ/ ఇనాం) | పట్టాదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | భూసేకరణ చేయు విస్తీర్ణం | చెట్ల రకం/ నిర్మాణం రకం |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 316/ 0.11½ | ఖుష్కీ/ పట్టా | చెట్టిపల్లి రామయ్య తండ్రి ఇస్తారి | చెట్టిపల్లి రామయ్య తండ్రి ఇస్తారి | 0.11½ | - |
| 331/ 0.02 | ఖుష్కీ/ పట్టా | చెట్టిపల్లి నాగయ్య తండ్రి ఐలయ్య | చెట్టిపల్లి నాగయ్య తండ్రి ఐలయ్య | 0.02 | - |
| | | | మొత్తం : | 0.13½ | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పనివేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి నోటిఫికేషన్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తాకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలు గానీ, ఆక్షేపణలు గానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీ చేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు / అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయ వచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO.No.423/LA/PP/Advt/Pub/2025-26

## 'శ్రీశైలం'కు వరద

సిద్ధమవుతున్నారు. మంగళవారం ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తే అవకాశం ఉన్నట్లు- తెలుస్తుంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 583.8 అడుగులుగా ఉంది. ప్రాజెక్టులో గరిష్ఠంగా 312.05 టీ-ఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ఇప్పుడు 293.97 టీ-ఎంసీల నీరు ఉన్నది. మరో 18 టీ-ఎంసీల నీరు వస్తే నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యానికి చేరుతుంది. ఇక శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతున్నది. ప్రస్తుతం రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## ఈయూతో ట్రంప్ భారీ వాణిజ్య ఒప్పందం

లేని భారీ వాణిజ్య ఒప్పందంగా అభివర్ణించింది.యూరోపియన్ వస్తువులపై 30శాతం అమెరికా సుంకాలను నివారించేందుకు ఆగస్టు ఒకటితో గడువు సమీపిస్తున్న తరుణంలో ఈ ఒప్పందం కుదిరింది. స్కాట్లాండ్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌ల మధ్య జరిగిన సమావేశంలో ఈ ఒప్పందం కుదిరింది. ఈయూతో తాము ఒక ఒప్పందం కుదుర్చుకున్నామని, ఇది ఇరు దేశాలకు లబ్ధి చేకూర్చే ఒప్పందం అని, బహుశా ఇది ఆ దేశంతో కుదిరిన పెద్ద ఒప్పందం అని ట్రంప్ వార్తాసంస్థ ఎఎఫ్‌పీకి తెలిపారు. ఈ 15శాతం సుంకాలు యూరప్‌లోని కీలకమైన ఆటోమొబైల్ రంగం, ఫార్మాస్యూటికల్స్, సెమీకండక్టర్లతో సహా అన్ని రంగాలకు వర్తిస్తాయని ట్రంప్ తెలిపారు. ఈ ఒప్పందం కారణంగా 27 దేశాల ఈయూ కూటమి యునైటెడ్ స్టేట్స్ నుండి 750 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనశక్తిని కొనుగోలు చేస్తుందని, ఈయూ 600 బిలియన్ డాలర్ల అదనపు పెట్టుబడులను అందిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుండి ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగా, రాబోయే మూడు సంవత్సరాలలో యూరోపియన్ యూనియన్ అమెరికా నుంచి ద్రవీకృత సహజ వాయువు, చమురు అణు ఇంధనాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుందని వాన్ డెర్ లేయన్ తెలిపారు. విమానాలు, కొన్ని రసాయనాలు, పలు వ్యవసాయ వస్తువులు, కీలక ముడి పదార్థాలు తరహా ఉత్పత్తులపై సుంకాలను తొలగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని ఆమె పేర్కొన్నారు. జనవరిలో ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఈయూ పలు సుంకాల కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంది. కార్లపై 25శాతం పన్ను, ఉక్కు, అల్యూమినియంపై 50శాతం సుంకాన్ని ఎదుర్కొంటోంది. అయితే ఇప్పుడు ఒప్పందం కుదరకపోతే ఈ 10శాతం సుంకాల రేటు 30శాతం వరకు పెరుగుతుందని అమెరికా హెచ్చరించింది.

## సిట్ ఎదుట హాజరైన ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్(జనంసాక్షి):**ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మాజీ ఐపిఎస్, బిఆర్ఎస్ నేత యూటర్న్ తీసుకున్నారు. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్‌పై ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌ను బీఆర్ఎస్ రాజకీయంగా వాడుకోలేదని ఇప్పుడు మాట మార్చారు. బీఆర్ఎస్‌కి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇచ్చారు. అప్పటి ఫిర్యాదుపై వాంగ్మూలం ఇవ్వమంటే , సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, తన ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నట్లు- సిట్‌కి ఫిర్యాదు చేశారు. డార్క్ వెబ్‌సైట్‌లో టూల్స్ ఉపయోగించి ప్రైవేటు- వ్యక్తులతో ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నట్లు- ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌ను పావుగా వాడుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రవీణ్ కుమార్ విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో (చారణకు మాజీ పోలీస్ ఉన్నతాధికారి, బీఆర్ఎస్ కీలక నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సోమవారం హాజరయ్యారు. విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని ప్రవీణ్ కుమార్‌కి సిట్ అధికారులు రెండు సార్లు నోటీ-సులు ఇచ్చిన విషయం తెలిసిందే. తన ఫోన్ బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాక్ చేస్తోందని, ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడుతోందని గతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో ప్రవీణ్ కుమార్ ఈసీ, డీజీపీకి ఫిర్యాదు చేశారు.

# గిరిజనుల సంక్షేమం లక్ష్యంగా నిర్ణయాలు

మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఏర్పాటైన సలహా మండలి సభ్యులు చర్చించి సలహాలిచ్చిన అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్నామని, అందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. సభ్యులు ఇంకా కొత్త అజెండాలు ఇస్తే వాటిని తర్వాత వచ్చే గిరిజన సలహా మండలి అజెండా అంశాలుగా చేరుస్తామన్నారు. ఈ రోజు చర్చించిన అంశాలు కొన్నింటిని పరిష్కరించుకోవడానికి ప్రధానమంత్రి సమయం తీసుకొని కలుస్తామన్నారు. సమావేశంలో పాల్గొన్న పంచాయితీరాజ్ శాఖామాత్యులు డా. దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో గిరిజనులందరికీ అవసరాన్నిబట్టి కేటాయింపులు జరగాలని, ప్రత్యేకించి ఆదిమవాసులకు ప్రత్యేక వెసులుబాట్లు కల్పించాలని, ఐటీడీఏలను బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉప సభాపతి రామచంద్రు నాయక్, ఎంపీలు గొడం నగేశ్, బలరాం నాయక్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. ఎ. శరత్, అదనపు సంచాలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకులు డా. వి. సముజ్వల తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కేసీఆర్ పాలనలో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దుర్వినియోగం: మంత్రి సీతక్క**

గిరిజన సంక్షేమం విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని ధ్వజమెత్తారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిలు అవసరమని.. కానీ గతంలో నిధులు పక్కదారి పట్టించడంతో గర్భిణుల ప్రసవవేదన వంటి వార్తలు వస్తున్నాయని చెప్పు కొచ్చారు. హైదరాబాద్‌లో ఇవా(సోమవారం) మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. ఏ ప్రభుత్వమైనా నిధులను పక్కదారి పట్టించవద్దని మంత్రి సీతక్క సూచించారు. ఎస్టీలకు కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని కోరారు. కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో సర్దుబాటు- చేయాలి.. తప్ప మైదాన ప్రాంతాలకు తరలించవద్దని ఆకాంక్షించారు. సబ్ ఎ÷-లాన్ నిధులను పక్కదారి పట్టిస్తే ఏజెన్సీ ఏరియా వెనకబాటులోనే మగ్గిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు.అందుకే ఎస్టీలకు కేటాయించిన ప్రతి పైసా వారికి ఖర్చు చేయాలని సూచించారు. ఎస్టీల్లో ఎక్కువమందికి ఉండటానికి ఇండ్లు లేవని తెలిపారు. కాబట్టి ఎస్టీల ఇండ్ల నిర్మాణం కోసం బడ్జెట్ నిధులను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఎస్టీలకు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కనీస స్థల అర్హతను సడలించాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## చౌకగా వచ్చే ముడిచమురును కొనొద్దంటారా?

స్పందిస్తూ.. పశ్చిమ దేశాల అభ్యంతరాలను మరోసారి తోసిపుచ్చారు. ఏ దేశం కూడా తమ సొంత ఆర్థిక వ్యవస్థకు ఆటంకం కలిగించుకోదని వెల్లడించారు.బ్రిటన్ రేడియో స్టేషన్ 'టైమ్స్ రేడియో'కు విక్రమ్ దొరైస్వామి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈసందర్భంగా రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులపై వస్తోన్న విమర్శలపై ఆయన స్పందించారు. "ప్రపంచంలోనే మేం మూడో అతిపెద్ద చమురు వినియోగదారులుగా ఉన్నాం. మా అవసరాల్లో 80శాతం వరకు దిగుమతుల మీదే ఆధారపడుతున్నాం. అప్పుడు మేంరష్యా నుంచి డిస్కౌంట్‌పై వస్తోన్న చమురును కొనుగోలు చేయకుండా ఎలా ఉంటాం? మేం ఏం చేయాలని మీరు (పశ్చిమ దేశాలు) కోరుకుంటున్నారు. మా ఆర్థిక వ్యవస్థ ను స్విచ్చాఫ్ చేసుకోవాలా?" అని దొరైస్వామి ప్రశ్నించారు. రష్యాతో భారత్ స్నేహం ఈనాటిది కాదని హైకమిషనర్ తెలిపారు. గతంలో కొన్ని పశ్చిమదేశాలు భారత్‌కు ఆయుధాలు విక్రయించకుండా.. న్యూఢిల్లీపై దాడి చేసే పొరుగుదేశాలకు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేశారు. అలాంటి సమయాల్లోనూ మాస్కో మాతో సత్సంబంధాలు కొనసాగించిందని తెలిపారు. "కొన్ని దేశాల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయవద్దని మాకు సూచనలు చేస్తున్నారు. అలా చెప్పినవారే ఆయా దేశాలతో తమ సొంత ప్రయోజనాల కోసం అరుదైన ఖనిజాలు, చమురు ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. వారి నిజాయతీని ప్రశ్నించమంటారా?" అని విక్రమ్ దొరైస్వామి దుయ్యబట్టారు.

## 'దయ చూపండి.. మా అమ్మ ఉరిశిక్షను ఆపండి'

**నిమిష ప్రియను కాపాడేందుకు యెమెన్ అధికారులకు కుటుంబ సభ్యులు వేడుకోలు**

**సనా(జనంసాక్షి):**యెమెన్ దేశంలో ఓ హత్య కేసులో ఇరుక్కుని జీవన్మరణ పోరాటం చేస్తున్న కేరళకు చెందిన నర్సు నిమిష ప్రియను కాపాడేందుకు కుటుంబ సభ్యులు తమ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కొన్ని రోజులు క్రితం ఆమెకు పడాల్సిన ఉరిశిక్ష చివరి నిమిషంలో రద్దు కావడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు నిమిష.బ్లడ్‌మనీ(క్షమాధనం లేక నష్టపరిహారం) ఇచ్చేందుకు కూడా సిద్ధమైన తరుణంలో ఆమె ఉరిశిక్ష వాయిదా పడింది. అయితే బాధిత తలాల్ అబ్దో మెహదీ కుటుంబం మాత్రం తమకు బ్లడ్‌మనీ వద్దని ఇప్పటికే తెగేసి చెప్పింది. ఆమెకు శిక్ష పడాల్సిందేనని డిమాండ్ చేస్తోంది. దాంతో నిమిష ఉరిశిక్ష రద్దు అనేది పక్కకు పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీనిలో భాగంగా నిమిష కూతరు 13 ఏళ్ల మిషెల్ తన తల్లియందు దయ చూపించాలని యెమెన్ అధికారుల్ని వేడుకోంటుంది. ఈ మేరకు మలయాళం, ఇంగ్లిష్ భాషల్లో తల్లిని రక్షించాలంటూ ప్రాధేయపడుతోంది.'ఐ లవ్ యూ మమ్మీ. ఐ మిస్ యూ. మా అమ్మను తిరిగి వెనక్కి పంపడానికి సాయం చేయండి. మా అమ్మ పట్ల దయ చూపండి. తలాల్ కుటుంబానికి థాంక్స్ చెప్పేందుకు మిషెల్ ఇక్కడ ఉంది. మీరు మా అమ్మపై కరుణ చూపి అక్కడ నుంచి విడుదలకు మార్గం చూపండి.రేపు, రేపు మరుసటి రోజు మీ పట్ల మేము చాలా కృతజ్ఞులమై ఉంటాము. దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు' అని వేడుకుంటోంది. ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్‌తో కలిసి నిమిష ప్రియ కుటుంబ సభ్యులు యెమెన్‌లో తమ తమ ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలోనే కేఏ పాల్‌తో కలిసి నిమిష కూతురు మిషెల్ మీడియాతో మాట్లాడింది.



## మరి అప్పుడు కమిటీ ముందు ఎందుకు హాజరయ్యారు?

కీలక వ్యాఖ్యలు చేసింది. "మీరు ఈవిధంగా పిటిషన్ దాఖలు చేయకుండా ఉండాల్సింది. త్రిసభ్య విచారణ కమిటీ ఇచ్చిన దర్యాప్తును మీరు సవాల్ చేశారు కాబట్టి ఇక్కడ తొలి ప్రతివాది సుప్రీంకోర్టే అవుతుంది. అలాగే కమిటీ నియామకం జరిగినప్పుడే మీరు సుప్రీంకు ఎందుకు రాలేదు..? ఎందుకు వేచి చూశారు..? గతంలో ఈ విచారణలకు న్యాయమూర్తులు హాజరుకాలేదు. మీరు ఎందుకు హాజరయ్యారు..?" అని ధర్మాసనం ప్రశ్నించింది. నగదు ఎవరిదో కనుక్కోవచ్చని భావించినందున ఆయన విచారణకు హాజరయ్యారని జస్టిస్ వర్మ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. జస్టిస్ వర్మ అవుట్‌హౌస్‌లో దొరికిన నగదు ఆయనదే అని ఎలా చెప్తారని సిబల్ ప్రశ్నించారు. "పోలీసులు, సిబ్బంది, అంతా అక్కడ ఉండగా నగదు దొరికింది" అని ధర్మాసనం పేర్కొనగా.. హైకోర్టు న్యాయమూర్తి సిబ్బంది అక్కడ లేరని సిబల్ అన్నారు. దాంతో విచారణ కమిటీ నివేదిక సరైంది కాదని అంటున్నారా..? అని కోర్టు ప్రశ్నించింది. తన ఉద్దేశం అది కాదని సిబల్ బదులిచ్చారు. ఇక దీనిపై తదుపరి విచారణ వచ్చే బుధవారానికి వాయిదా పడింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలను ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు

# మోడీ కాదు...రాహుల్ కన్వర్టెడ్

- కులగణన అంతా తప్పల తడక
- రాబోయే ఎన్నికల్లో బిసిలకు పెద్దపీట వేస్తాం
- మీడియా సమావేశంలో బిజెపి అధ్యక్షుడు రామ్



**హైదరాబాద్, జులై28 (జనంసాక్షి) :** మోడీని న్వర్టెడ్ బీసీ అని సఎం రేవంత్ విమర్శలు చేయడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం ఆయన మిడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ కన్వర్ట్ అయ్యారు.. మోడీ కాదు అని ఆయన విమర్శించారు. కేసీఆర్ గతంలో ఎంబీసీ చైర్మన్ పెట్టి రూ.1000 కోట్లు- కేటాయిస్తామన్నారు.. కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కేసీఆర్.. సమగ్ర కుల సర్వే చేశాడు.. కానీ నివేదిక బయటపెట్టలేదన్నారు. తెలంగాణలో బీసీలు 52 శాతానికి పైగా ఉన్నారని, కులగణన కొన్ని మండలాల్లో జరగనే లేదు.. ఎలా పూర్తిచేశారన్నారు. నిజంగానే రాష్ట్ర ప్రభుత్వం చేస్తే నిజాలు ఎందుకు బయపెట్టడంలేదని, అందుకే కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు- కుల గణన కూడా చేపట్టనుందన్నారు. అందులో వాస్తవాలు చెప్పి దాని ప్రకారం సంక్షేమ పథకాలు ఇంప్లిమెంట్ చేస్తామని, రాజ్యాంగం మారుస్తారని, ఎస్సీలకు రిజర్వేషన్లు ఎత్తేస్తారని అమిత్ షా మాట్లాడినట్లు- కాంగ్రెస్ సృష్టించిందన్నారు రాంచందర్ రావు. ఈ కేసు సీఎంపైనే ఉందని, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఇచ్చినా ఇవ్వకున్నా.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని, 42 శాతం పక్కాగా ఓన్లీ బీసీలకే ఇస్తామన్నారు. కాంగ్రెస్ చెబుతున్నట్లుగా వాటిలో కూడా 10 శాతం ముస్లింలకు ఇవ్వబోమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, బీసీలకు లబ్ధి చేకూర్చేలా కేంద్రం ముందుకు వెళ్తుంటే తమకు నష్టమని భావించి కాంగ్రెస్ దుష్ప్రచారాలకు దిగుతోందని ఆయన మండిపడ్డారు. ఎలక్షన్స్ ముందు సీఎం రేవంత్ ఇచ్చిన స్టేట్ మెంట్లు బయటపెడతాం.. ఆయన ఏం మాట్లాడాడో బయటపెడతామని ఆయన వ్యాఖ్యానించారు. బీసీల సంక్షేమంపై కాంగ్రెస్ చేసేదంతా యాక్టింగే అని, వచ్చేనెల 2వ తేదీన ధర్నా చౌక్ వద్ద బీసీ రిజర్వేషన్లపై మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. బీసీల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ బీజేపీ మాత్రమే అని, కాంగ్రెస్ కేవలం ఓట్ల కోసమే ఆలోచిస్తుంది.. కానీ బీజేపీ ప్రజా సంక్షేమం గురించి ఆలోచిస్తుందన్నారు రాంచందర్ రావు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడంలో బీసీల పాత్ర కీలకం.. వారికి అంతేస్థాయిలో ప్రయారిటీ ఉంటుందని వ్యాఖ్యానించారు.

# ప్రభుత్వ అనుమతుల్లేని ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్స్

- సరోగసీ, సంతానోత్పత్తి కేంద్రాలపై చర్యలు తీసుకోవాలి
- సరోగసీ పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్ కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సంతానోత్పత్తి కేంద్రాలను తనిఖీలు నిర్వహించాలి
- ఏఐవైఎఫ్ బృందం వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ కు వినతి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న సరోగసీ, సంతానోత్పత్తి (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని, సరోగసీ పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్ కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సంతానోత్పత్తి కేంద్రాలను తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కోఠి లోని రాష్ట్ర ప్రజా ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ ఆర్. పుష్ప కు ఏఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సరోగసీ,సంతానోత్పత్తి (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) కేంద్రాలు ప్రభుత్వ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా నడుస్తున్నాయన్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ లో సరోగసీ పేరుతో అనధికారికంగా పిల్లలు లేని దంపతులకు సరోగసీ ద్వారా సంతానోత్పత్తి చేస్తామని చెప్పి 30-50 లక్షలు వసూళ్లు చేసి దంపతులను మోసం చేయడం సిగ్గు చేటు అన్నారు. రాష్ట్రంలో వీర్య కణాల సేకరణ కేంద్రాల్లో ఈ అక్రమ దందాలు జరుగుతున్నా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.అండ పిండ అరాచకానికి హైదరాబాద్ లోని కొన్ని ప్రైవేట్ సంతానోత్పత్తి కేంద్రాలు దందాలకు తెరలేపడం సరికాదన్నారు. అక్రమ సరోగసీ, స్పెర్మ్,చిన్నారుల ట్రాఫికింగ్ రాకెట్ పై పోలీసులు ఉక్కుపాదం మోపి, దుర్మార్గులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత అరెస్టు అనంతరం బాగోతాలు ఒక్కొక్కటిగా బయట పడటం చూస్తే... సృష్టి ఆసుపత్రి వెనుక పలు పెద్ద ఆసుపత్రులు కూడా ఈ నీచ దందాకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. 2023లోనే సృష్టి ఫర్టిలిటీ సెంటర్కు లైసెన్సు ముగిసినప్పటికీ, వైద్య శాఖ అధికారులు తెరవెనుక వెన్నుదన్నుగా అక్రమ కార్యకలాపాలకు వత్తాసు పలుకుతున్నారనే అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. సరోగసీ పై చట్టబద్ధత ప్రకారం ప్రక్రియ చేయకుండా, డబ్బులే పరమావధిగా తప్పులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అదేవిధంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ గుర్తింపు ఉన్న సంతానోత్పత్తి కేంద్రాల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వినతి కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, శివకుమార్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, కళ్యాణ్,రాజేందర్, మధుకర్, విష్ణు పాల్గొన్నారు.

## బాటసింగారం వద్ద భారీగా గంజాయి పట్టివేత

**రంగారెడ్డి, జులై28 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా బాటసింగారం వద్ద భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఖమ్మం ఈగల్ టీ-మ్, రాచకొండ పోలీసులు తనిఖీలు చేపట్టి.. 935 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు- చెప్పారు. ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని 455 ప్యాకెట్లుగా చేసి పండ్ల ట్రేలల్లో ఉంచి డీసీఎంలో తరలిస్తున్నట్లు- వెల్లడించారు. ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసినట్లు- చెప్పారు.

## బనకచర్ల పనులు చేపట్టలేదు

### రాజ్యసభలో కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ, జులై28 (జనంసాక్షి) :** పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు పనులు ఇంకా చేపట్టలేదని ఏపీ ప్రభుత్వం తెలిపిందని కేంద్రం పార్లమెంటుకు వెల్లడించింది. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ప్రశ్నకు కేంద్ర జల్‌శక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ఏపీ ప్రభుత్వం ప్రీ ఫీజిబిలిటీ- రిపోర్టును కేంద్ర జలసంఘానికి అందించినట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ లేఖ రాసిందని చెప్పింది. ప్రాజెక్టుపై సంబంధిత అధికారులు, పరివాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు- పేర్కొంది. ఈ మేరకు రాజ్యసభలో జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## బాలాపూర్‌లోని ప్లాస్టిక్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం



**హైదరాబాద్, జులై28 (జనంసాక్షి) :** బాలాపూర్ లోని ప్లాస్టిక్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం జరిగిం ది. సోమవారం తెల్లవా రుజామున అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ప్రమాదం జరిగినప్పుడు ఘటనా స్థలంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. భారీగా ఆస్తినష్టం జరిగినట్టు- సమాచారం. షార్ట్ సర్క్యూట్ తోనే ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. ప్లాస్టిక్ పరిశ్రమకావడంతో త్వరగా మంటలు అంటుకున్నాయి.

# గోల్కొండ పరిధిలో చిరుత

### సిసి కెమరాకు చిక్కిన దృశ్యాలు



**హైదరాబాద్, జులై28 (జనంసాక్షి) :** నగర శివార్లలోని గండిపేట్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు గతవారం రోజులుగా చుక్కలు చూపిస్తున్న చిరుత గోల్కొండ ఆర్మీ పరిధిలోని ఇబ్రహీంబాగ్‌లో ప్రత్యక్షమయ్యింది. లంగర్‌హౌజ్-నార్సింగి ప్రధాన రహదారిలో ఆర్మీ సెంటర్ సమీపంలో ఆదివారం రాత్రి చిరుతపులి రోడ్డు దాటుతుండగా గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించగా, సిసి కెమెరాలను పరిశీలించి నిర్ధారణ చేసుకున్న పోలీసులు పరిసర ప్రాంతాలప్రజలను అప్రమత్తం చేశారు. గతవారం రోజులక్రితం మంచిరేవులలో ఓ కొండపై చిరుతపులి కూర్చోగా,సమీపంలోని ఓ విల్లా వాసులు గమనించి ఫోటోలు తీసి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రంగంలోకి దిగిన అటవీశాఖ అధికారులు గ్రేహౌండ్స్ సమీపంలో 4 బోన్‌లు, సిసి కెమెరాలను ఏర్పాటు-చేశారు. వారంరోజులుగా పరిసర ప్రాంతాల్లో వెదికినా చిరుతపులి ఆచూకి లభించలేదు. అయితే, ఆదివారం రాత్రి ఇబ్రహీంబాగ్ సమీపంలో ప్రధాన రోడ్డు దాటుతుండగా ప్రయాణికుల కంటబడింది. దీంతో స్థానికప్రజలు ఆందోళన చెందుతున్నారు. మంచిరేవుల, బైరాగిగూడ, నార్సింగి,ఇబ్రహీంబాగ్ పరిసర ప్రాంతాల్లోనే చిరుతపులి సంచరిస్తున్నట్లు-గా అటవీశాఖ అధికారులు వలవేసి పట్టు-కునేందుకు మరిన్ని బోన్‌లు ఏర్పాటు-చేస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు,అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. చిరుతపులి సంచారం మంచిరేవుల,నార్సింగి వాసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. మంచిరేవుల సమీపంలో ఉన్న పార్కుసైతం తాళం వేశారు. ఔటర్ సర్వీసు రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## ఎంబీబీఎస్ సీట్ల స్థానికతపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు



**హైదరాబాద్, జులై28 (జనంసాక్షి) :** ఎంబీబీఎస్ సీట్ల స్థానికతపై తెలంగాణ హైకోర్టు కీలక తాత్కాలిక తీర్పును ఇచ్చింది. కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్ కౌన్సెలింగ్ దరఖాస్తుదారులను స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ఆదేశించింది. తుది తీర్పు వచ్చే వరకు రిజిస్ట్రేషన్‌లో చేర్చాలని ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు తీర్పుతో సుమారు 100 మంది అభ్యర్థులకు తాత్కాలిక ఊరట లభించింది. జూలై 30వ తేదీతో రిజిస్ట్రేషన్ ముగియనుండటంతో హైకోర్టు ఈ కీలక తీర్పు నిచ్చింది. శాశ్వత నివాసంతోనూ స్థానికత మంజూరు చేయాలని కోర్టు అభిప్రాయపడింది. గత ఏడాది ఇచ్చిన హైకోర్టు ఆర్డర్స్ ఫాలో కావాలని ఆదేశించింది. కాగా, జూలై 15వ తేదీన విడుదలైన ప్రాస్పెక్టస్, నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.




# ఆదర్శనీయుడు జైపాల్ రెడ్డి

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 28 (జనంసాక్షి) :** కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్ రెడ్డి నేటి తరానికి ఆదర్శనీయుడని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు మార్గ్ లోని జైపాల్ రెడ్డి ఘాట్ వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డితో కలిసి పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డి వివిధ హోదాల్లో పని చేసి ప్రజలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. రాజకీయాల్లో విలువలు, నిబద్ధత, సేవాతత్వం కలిగిన నేత జైపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుకుగా పాల్గొని, రాష్ట్ర సాధన కోసం పోరాడరన్నారు. అప్పటి నేతలకు ఆయనే మార్గ నిర్దేశకులుగా ఉన్నట్లు చెప్పారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించగలం అనే పదానికి నిదర్శనం స్వర్గీయ జైపాల్ రెడ్డి అని ఆయన పేర్కొన్నారు.

# టీబీని పారద్రోలాలి

### న్యూట్రిషన్ కిట్.. మంచి పోషకాహారం

### క్షయ వ్యాధి గ్రస్థులకు ఉచిత న్యూట్రిషియాన్ కిట్ల పంపిణి చేసిన కలెక్టర్




**జనగామ ప్రతినిధి,జూలై 28(జనంసాక్షి):** టీబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా సోమవారం ఐ ఎం ఏ సహకారంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ క్షయ వ్యాధి రోగులకు ఉచిత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ హాజరై 50 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం ప్రకారం ప్రతి లక్ష మంది జనాభా కి 204 మందికి క్షయ వ్యాధి సోకే అవకాశం ఉంటుందని...మన జిల్లాలో క్రిందట సంవత్సరం 1051 మందిని క్షయ వ్యాధిగ్రస్తులుగా నమోదు అయ్యారన్నారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 361 మందికి క్షయ వ్యాధిగ్రస్తులుగా గుర్తించారని..2025 సంవత్సరం నాటికి క్షయ వ్యాధి రహిత భారతదేశాన్ని చేయుటకు లక్ష్యంలో భాగంగా.. టీబి ముక్త్ భారత్ అభియాన్ క్రింద టీబి సోకే అవకాశం ఉన్న 1,20,000 మందికి గాను 64,261 మందికి క్షయ వ్యాధి పరీక్షలు, ఎక్స్‌రే, నాట్ టీబీ పరీక్షలు ద్వారా స్క్రీనింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. అందులో 43 మందిని టీబీ వ్యాధిగ్రస్తులుగా గుర్తించడం జరిగిందన్నారు. క్షయ వ్యాధి చికిత్సకు మంచి మందులతో పాటు మంచి పోషకాహారం కూడా అవసరమని అన్నారు, ఇట్టి న్యూట్రిషన్ కిట్ ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు మంచి పోషకాహారం లభించి చికిత్సకు ఎంతో సహకారిగా ఉంటుందని తెలిపారు. అలాగే క్షయ వ్యాధిగ్రస్తులు ఆరు నెలలు క్రమం తప్పకుండా చికిత్స తీసుకున్నట్లయితే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు లేని ఎడల చికిత్సకి లొంగని వ్యాధిగా మారుతుందని అప్పుడు ఈ చికిత్స ఇంకా పని చేయక రోగి ప్రాణానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ది ఎం హెచ్ ఓ మల్లిఖార్జున రావు, ఐ ఎం ఏ అధ్యక్షుడు డాక్టర్ బాలాజీ, కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రాజమౌళి, డాక్టర్ లవ కుమార్ రెడ్డి, డాక్టర్ లక్ష్మి నారాయణ, డాక్టర్ శ్రీనివాస్, ప్రోగామ్ అధికారులు డాక్టర్ శ్యామ్, డాక్టర్ కమలహాసన్, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ స్వర్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## థాయ్-కంబోడియా తక్షణ కాల్పుల విరమణ

### ఫలించిన ట్రంప్ దౌత్యం..

థాయ్-కంబోడియా నేతలతో తాను మాట్లాడానని, వారు చర్చలు జరిపేందుకు సంసిద్ధత వ్యక్తంచేశారని జుల్కై 26వ తేదీన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అదే సమయంలో.. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం మధ్యవర్తిత్వం చేసేందుకు ముందుకొచ్చారు. ఆయన ఆహ్వానం మేరకు పుత్రజయ(మలేషియాలో)లోని ఇబ్రహీం నివాసంలో సోమవారం థాయ్ తాత్కాలిక ప్రధాని పుమ్తామ్ వేచాయచాయ్, కంబోడియా ప్రధాని హున్‌మానెట్ సమావేశయ్యారు. ఈ భేటీకి చైనా, అమెరికా రాయబారులు కూడా హాజరయ్యారు. భేటీ తర్వాత మలేషియా ప్రధాని అన్వర్ ఇరు దేశ ప్రధానుల చేతులను చేతిలో ఉంచి సంధి కుదిర్చినట్లు ప్రకటించారు. ట్రంప్ ప్రతిపాదన మేరకు ఇరు దేశాల ప్రధానులం కాల్పుల విరమణకు అంగీకరించాం అని కంబోడియా ప్రధాని హున్‌మానెట్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అయితే సోమవారం చర్చల సమయంలోనూ ఇరు దేశాల సరిహద్దుల్లో ఘర్షణలు కొనసాగినట్లు సమాచారం. ప్రాచీన హిందూ దేవాలయాలు అయిన తా మోయాన్ థామ్, 11వ శతాబ్దపు ప్రేష్ విహార్ ఆలయాలు ఇరు దేశాల సరిహద్దు వివాదాలకు కేంద్రంగా ఉన్నాయి. 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం ప్రేష్ విహార్ ఆలయాన్ని కంబోడియాకే చెందుతుందని తీర్పు ఇచ్చింది. అయితే.. థాయ్‌లాండ్ ఆ తీర్పును ఖండిస్తూ ఇచ్చింది. 2008లో వారసత్వ ప్రదేశంగా నమోదు చేయాలన్న ప్రయత్నం తర్వాత ఇరు దేశాల ఉద్రిక్తతలు పెరిగాయి. 2025 మే నెల చివర్లో నుంచి సరిహద్దు వివాదం ముదరసాగింది. ఈ క్రమంలో ప్రైవేట్‌గా సంధి కోసం ప్రయత్నించిన పేటోంగ్టార్న్ షినవత్రా.. కంబోడియా మాజీ ప్రధాని హున్ సేన్‌కి ఫోన్ కాల్ చేసి 'అంకుల్' అంటూ మాట్లాడిరది. ఆ కాల్ రికార్డ్ బయటకు రావడంతో.. అనూహ్యంగా ఆమె పదవి నుంచి వైదొలగాల్సి(సస్పెండ్) వచ్చింది. ఈ తరుణంలో.. జూన్‌లో కంబోడియా అంతర్జాతీయ న్యాయస్థానాన్ని వివాద పరిష్కారానికి కోరింది. థాయ్‌లాండ్ మాత్రం న్యాయస్థాన అధికారాన్ని అంగీకరించలేదు, ద్వైపాక్షిక చర్చలే సరైన మార్గమని పేర్కొంది.

## పలారం బండి ఊరేగింపులో ఉప్పల



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బోనాల పండుగ సందర్భంగా నాగోల్, సరూర్ నగర్‌లో జరిగిన పలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆ అమ్మవార్ల ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ,లోకేష్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పల్గామ్ దాడి ఉగ్రవాది హతం

### పార్లమెంట్ చర్చలో బిజెపి ఎంపి బైజయంత్

**న్యూఢిల్లీ, జులై28 (జనంసాక్షి) :** జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న యాంటీ- టెర్రర్ అపరేషన్ లో పహల్గాం ఉగ్రదాడితో ప్రమేయం ఉన్న ఒక టెర్రరిస్టును బలగాలు మట్టుబెట్టినట్టు బీజేపీ ఎంపీ బైజయంత్ జే పాండా లోక్‌సభకు తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌పై సోమవారంనాడు ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొంటూ, ఆపరేషన్ సింధూర్‌పై ఒకవైపు సభలో చర్చ జరుగుతుండగా మరోవైపు ఆపరేషన్ మహదేవ్ నడుస్తోందని, ఈ ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. వీరిలో ఒక ఉగ్రవాదికి పహల్గాం ఉగ్రదాడితో ప్రమేయం ఉందని వివరించారు. ఆపరేషన్ సింధూర్ హైలైట్స్‌ను జే పాండా వివరిస్తూ, భారత వాయిసేన పాక్‌లోని 11 వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుందని, 20 శాతం పాక్ వాయిసేన ఆస్తులను ధ్వంసం చేసిందని చెప్పారు. 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టు-బెట్టినట్టు- చెప్పారు. ఈ దాడులను పాకిస్థాన్ తిప్పికొట్టడంలో విఫలమైందన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాక్ వైఫల్యాన్ని విపక్షాలు గుర్తించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. గతంలో జరిగిన ఉగ్ర ఘటనలను జే పాండా గుర్తు చేస్తూ, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలకు దీటు-గా సమాధానం ఇవ్వలేక పోయాయని అన్నారు. ఇంతకుముందు తరచూ పాక్ ప్రేరేపిత దాడులు ఇండియాపై, ప్రజలపై జరిగేవని, 2005లో ఢిల్లీ వరుస పేలుళ్లు, 2006లో వారణాసి బాంబింగ్స్ జరిగినప్పుడు కేవలం మాటలతోనే సరిపుచ్చారని అన్నారు. 2008 ముంబై దాడుల తర్వాత మన సాయుధ బలగాలు ప్రతీకార చర్యలకు ప్లాన్ చేసినప్పటికీ ప్రభుత్వం అనుమతించ లేదని విమర్శించారు. ఆరు నెలల తర్వాత అప్పటి ప్రధానమంత్రి.. పాకిస్థాన్ అధ్యక్షుడిని కలిసి చర్చలు కొనసాగించాలని నిర్ణయించారని గుర్తుచేశారు. ఉగ్రవాదంపై చేష్టలుడిగి చూడటం, బుజ్జగింపు విధానాలకే ప్రభుత్వాలు పరిమితమయ్యాయని విమర్శించారు.

# ప్రజాస్వామ్య ముసుగు కప్పుకొన్న అమెరికా 'ఉగ్రవాదం'




*'ఉగ్రవాదం' అనేది ఈ కాలంలో ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న సమస్యలలో ఒకటి. ప్రత్యేకించి ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) వంటి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా హింస, రక్తపాతాన్ని సృష్టిస్తున్నాయి. కానీ ఈ ఉగ్రవాదా నికి పునాదులు వేసింది ఎవరు? దాన్ని పెంచి, పోషించింది ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకుతున్న సమయంలో అమెరికా ప్రభుత్వం యొక్క రహస్య వ్యూహాలు బట్టబయలు అవుతాయి. "ప్రజాస్వామ్యం", "మానవ హక్కుల" పేరుతో ప్రపంచాన్ని నడిపిస్తున్న అమెరికా, నిజానికి ఉగ్రవాదాన్ని తన రాజకీయ స్వార్థపూరిత లబ్ధికోసం ఉపయోగించుకుంటోంది.*

**ఐసిస్ పుట్టుకకు అమెరికా ఎలా కారణమైంది?**

1990ల దశకంలో ఇరాక్‌పై అమెరికా కల్పించిన యుద్ధ వాతావరణం, అక్కడి శాంతి,సుస్థిరత్వాన్ని ధ్వంసం చేసింది. సద్దాం హుస్సేన్ పరిపాలనను అంతం చేయడానికి అమెరికా "ఇరాక్ లో అణ్వాయుధాలు ఉన్నాయి" అనే అబద్ధాన్ని తన ప్రచారం,ప్రసారం సాధనాలతో విస్తృతంగా విష ప్రచారం చేసింది. ఈ యుద్ధంలో ఇరాక్ సైన్యం విచ్ఛిన్నమై, దేశంలో అరాచకం వ్యాపించింది. ఈ పరిస్థితుల్లోనే "జమాత్ అల్"–"తాహిద్ వల్–జిహాద్ " వంటి ఉగ్రవాద సంస్థలు బలపడ్డాయి. ఈ సంస్థలు కాలక్రమేణా "అల్–కైదా" ఉగ్రవాద సంస్థతో ఐక్యమయ్యాయి. తర్వాత "ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్‌గా మారింది. 2013లో సిరియాలోని "అల్–నుస్రా ఫ్రంట్" తో విలీనం అయింది, అదే చివరకు "ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియాగా తన పేరు మార్చుకుంది.

అమెరికా యుద్ధాలు, దళిత ప్రాంతాల్లో అస్థిరతను సృష్టించి, ఉగ్రవాద సంస్థలకు పుట్టిల్లును కల్పించాయి. ఆఫ్ఘనిస్తాన్ లో "తాలిబాన్", ఇరాక్లో "ఐసిస్" వంటి ఉగ్రవాద సంస్థలు బలపడటానికి అమెరికా కుట్ర పూరితంగా అనుసరించిన విధానమే ప్రధాన కారణం. ఐసిస్‌కు ఆర్థిక, ఆయుధ, రాజకీయ బలం సమకూర్చింది ఎవరు?

ఐసిస్ ప్రపంచంలోనే అత్యంత ధనిక ఉగ్రవాద సంస్థగా మారడానికి కీలక కారణం అక్కడ విస్తారంగా లభించిన చమురు వ్యాపారం. ఇరాక్, సిరియాలోని చమురు బావులను ఆక్రమించి, ఇల్లీగల్‌గా చమురును అమ్మడం ద్వారా రోజుకు 1–3 మిలియన్ డాలర్లు సంపాదిస్తోంది. కొవైట్, సౌదీ అరేబియా, కతార్ వంటి దేశాల నుండి లెక్క లేనంత డబ్బు సహాయం వారికి లభిస్తుంది. అదనంగా, బందిపోటు, కిడ్నాపింగ్ ద్వారా కూడా డబ్బు సంపాదిస్తారు.

రాజకీయంగా, ఐసిస్ అమెరికా వ్యతిరేక శక్తులను బలపరిచింది. ఇరాన్, సిరియా, రష్యా వంటి దేశాలను బలహీనపరిచేందుకు అమెరికా ఐసిస్ కు ఆయుధాలను సప్లై చేస్తుంది. ఐక్యరాజ్యసమితి లో సమస్యలు రాకుండా అమెరికా తన వీటో పవర్ ను ఒక ఆయుధంగా అనేక సార్లు ఉపయోగించింది. కానీ, కొన్ని చోట్ల అమెరికా రూపొందించిన ఈ తప్పుడు వ్యూహం తిరగబడింది. ఇప్పుడు ఐసిస్ "ఏకు మేకు" అయింది. ఏఐస్ ఇప్పుడు తన స్వంత అజెండాతో ప్రపంచాన్ని భీతిల్ల చేస్తోంది.

**సామాజిక మాధ్యమాలు: ఉగ్రవాద ప్రచార శక్తి:**

ఐసిస్ యువతను ఆకర్షించడానికి ట్విట్టర్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రాం, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ లను ఉపయోగిస్తోంది. ఆన్ లైన్ లో శిక్షణ ఇస్తూ, విస్తృతంగా ప్రచారాలు చేసి, యురోప్, అమెరికా నుండి యువ కులను తమ వైపుకు ఆకర్షిస్తారు. ఈ ప్రక్రియలో పేదరికం, నిరాశ, మత పరమైన అత్యాశలు ప్రధాన పాత్ర పోషిస్తాయి.ఇవన్నీ అమెరికా నీడలో, దర్శకత్వంలో కొనసాగాయి. చిన్న పిల్లలకు కూడా హింసను నేర్పిస్తారు. ఐసిస్ బాల సైనికులను "భవిష్యత్ మానవ బాంబులు"గా తయారు చేస్తుంది. 45 రోజుల ప్రాథమిక శిక్షణ తర్వాత, 3 నెలల యుద్ధ శిక్షణ ఇస్తారు. ఈ పిల్లలకు తలకొట్టడం, గొంతు కోయడం వంటి క్రూరమైన పనులు నేర్పిస్తారు.

**మహిళల పాత్ర: బలహీనత కాదు, బలవంతం:**

ప్రారంభంలో ఐసిస్ మహిళలను సభ్యులుగా చేర్చుకోలేదు. కానీ, సిరియా, ఇరాక్ లో మహిళా పోలీసులు అవసరమయ్యాక, వారిని కూడా సైనిక శిక్షణకు గురిచేశారు. జిహాదీలతో పెళ్లి చేసుకోవడానికి "వివాహ కేంద్రాలు" ఏర్పాటు చేశారు. కానీ ఆ తర్వాత ఈ మహిళలు చాలా మంది బానిసలుగా మార్చబడ్డారు. ఐసిస్ యొక్క అత్యాచారాలు, మానవతా విలువల ఉల్లంఘనలు ఇప్పటికీ విమర్శలను ఎదుర్కొంటున్నాయి.

**అమెరికా డబుల్ స్టాండర్డ్ :**

అమెరికా ఒకవైపు ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి పూనుకుంటూ, మరోవైపు తనకు అవసరం అయినప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాద సంస్థలను పెంచి ,పోషించి, ఉపయోగిస్తోంది. ఆఫ్ఘనిస్తాన్ లో తాలిబాన్, ఇరాక్ లో ఐసిస్ వంటి సంస్థలు బలపడటానికి అమెరికా యుద్ధాలే కారణం. ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పేరుతో అమెరికా చేస్తున్నది నిజంగా ఏమిటి? "మానవ మారణ హోమం " మాత్రమే.

**ఇంతకు ఉగ్రవాదానికి పరిష్కారం ఏమిటి?**

ఉగ్రవాదాన్ని అంతం చేయాలంటే, దాని మూలాలను గురించి ముఖ్యంగా యువత తెలుసుకోవాలి. అస్థిరత, యుద్ధాలు, ఆర్థిక అసమానతలు ఉగ్రవాదాన్ని పెంపొందిస్తాయి. అమెరికా వంటి స్వార్థ పూరితమైన దేశాలు తమ రాజకీయ ఆసక్తుల కోసం, ఉగ్రవాదాన్ని ఉపయోగించకుండా నిరోధించగలగాలి. ప్రపంచం మొత్తం శాంతి, సుస్థిరత ,సహజీవనం కోసం కృషి చేయాలి. లేకుంటే, ఐసిస్ వంటి సంస్థలు మళ్లీ, మళ్లీ తలెత్తుతూనే ఉంటాయి.

ఉగ్రవాదాన్ని ఒక వైపు పెంచి, పోషిస్తూ మరో వైపు "ప్రజాస్వామ్యం" మానవ హక్కులు అంటూ అమెరికా ముసుకు కప్పుకుంటుంది, ట్రంప్ రెండో సారి అమెరికా అధ్యక్షుడుగా అయిన తర్వాత గాజా,పాలిస్తీనా, ఇరాన్ , సిరియా మొదలైన దేశాల్లో ఇజ్రాయిల్ నేత నెతన్యాహు తో జత కలిసి, ఆర్థికంగా, ఆయుధాల పరంగా, ఐక్యరాజ్యసమితిలో వీటో పవర్ ను ఉపయోగించి అక్కడి పోసి పిల్లలను, మహిళలను, వృద్ధులను వేల సంఖ్యలో హతమార్తొంది. ఇక ఇప్పుడు అమెరికా ముసుగు తొలిగింది. ప్రపంచ దేశాల పై తన దేశ ఆర్థిక ప్రయోజనాల కోసం విచక్షణా రహితంగా టారిఫ్ లు విధిస్తూ ప్రపంచ దేశాల వాణిజ్య ప్రయోజనాలను దెబ్బ తీయాలని చూస్తున్నారు. ఈ చర్య భవిష్యత్తులో పరోక్షంగా అమెరికాకు తీవ్రంగా నష్ట పరుస్తుంది. మరో వైపు ఉక్రెయిన్‌ను నాటో కూటమిలో చేర్చుకుంటామ ని ఆశలు పెట్టి, రష్యా తో యుద్ధానికి దింపింది మాజీ అమెరికా అధ్యక్షుడు బైడన్. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ ను యుద్ధం మధ్యలో వదిలేశాడు. ఇలా అమెరికా ఇక ఎంతకాలం మానవతను మోసం చేస్తుందో? ఇంకెంత కాలం ప్రపంచ దేశాలపై అమెరికా దౌర్జన్యం కొనసాగుతుందో వేచి చూడాలి. ప్రపంచంలో అనేక దేశాల్లో,చివరకు అమెరికా ప్రజలు కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా, ఇజ్రాయిల్ నేత నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్లకార్డ్స్ ధరించి నిరసన ఊరేగింపులు జరిపుతున్నారు. యువతలో కూడా అమెరికా నిజం స్వరూపం అర్థం అవుతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# మనం మరచిన మహామనిషి

## కీ.శే.ఈటూరి లక్ష్మణరావు

**( 1917 - 1965 )**

*'జీవితం వడ్డించిన విస్తరికాదు. అవకాశం పొంది అందలాలెక్కిన ప్రతివారు గొప్పవారుకాదు.అందలా లెక్కని వాళ్లంతా పనికిమాలినవారూ కాదు'*

– ఆచార్య వెలుదండ నిత్యానంద రావు
సమగ్రసాహిత్యం,సంపుటం.2 పుట 532.

జీవితంలో కొందరు వ్యక్తులు, వారి గొప్పతనం, విశిష్టతలు తెలిసినప్పుడు మనసులో ఒక ఉద్వేగభరిత భావన మొదలవుతుంది. అలాంటి వారి గురించి మరింత తెలుసుకోవాలనే కుతూహలం, ఉబలాటం శోధనగా మారి, అక్షరాల ఒరవడిలో కొట్టుకుపోయే స్థితికి చేరుతుంది. 1942లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ తెలుగులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన మొదటి విద్యార్థి పల్లా దుర్గయ్య, 1947లో రెండవ విద్యార్థిగా దేవరుప్పలకు చెందిన ఈటూరి లక్ష్మణరావు ఉత్తీర్ణత సాధించారని, ఇద్దరూ పూర్వ వరంగల్ జిల్లా వాసులేనని రామచంద్రామృతం పుస్తక పీఠికలో వెలుదండ నిత్యానందరావు తెలిపారు. ఈ విషయంపై శంకరమంచి శ్యాంప్రసాద్ నన్ను ఈటూరి కుటుంబంతో పరిచయం ఉందా అని ఫిబ్రవరి మొదటి వారంలో అడిగారు. సాహితీ పెద్దలు సంశయం వెలిబుచ్చిన వెంటనే స్పందించడం నా అలవాటు, ఇది వారిపై గౌరవంతోనే జరుగుతుంది.

ఈటూరి కుటుంబంలో నా సమకాలికులైన భూపాలరావు, అనంత పద్మనాభరావులను అడిగితే, లక్ష్మణరావు గురించి తమకు తెలియదని తేల్చేశారు. అయినా ఈ విషయం నా మనసు నుండి తొలగలేదు. సమగ్ర సమాచారం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాను. కానీ, పెద్ద తరం వారు లేకపోవడం, వయసు మీరిన వారు చెప్పలేని స్థితిలో ఉండడం విచారకరం. ఈ నెల 5న శంకరమంచి శ్యాంప్రసాద్ నుండి వాట్సాప్‌లో వచ్చిన సమాచారం పరిశీలిస్తే, శ్రీలేఖ సాహితి సంస్థ వ్యవస్థాపకులు శ్రీరంగస్వామి రచించిన పలుకు జెలి పుస్తకంలోని 98వ పేజీలో ఈటూరి లక్ష్మణరావు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, హిందీ భాషల్లో ప్రావీణ్యం గలవారని, ఏకసంథాగ్రాహి అని, హన్మకొండ రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలోని పుస్తకాలన్నీ చదివిన గొప్ప విద్వాంసుడని తెలిసింది. వారి మహోన్నత వ్యక్తిత్వాన్ని కొనియాడుతూ, వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం రెండవ సంపుటంలో 532 నుండి 537 పేజీలలో వివరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇది చదివాక నాలో ఆసక్తి రెట్టింపై, లక్ష్మణరావు వివరాలు తెలుసుకోవాలనే కోరిక బలపడింది.

రెండు దారులు నా ముందున్నాయి: ఒకటి బంధుత్వ పరంగా వారి కుటుంబ వివరాలు తెలుసుకోవడం, మరొకటి వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం రెండవ సంపుటంలోని 532–537 పేజీల సమాచారం సేకరించడం. సాహిత్యాభిలాషిగా ఈ వివరాలను బంధువులకు, సాహితీ అభిమానులకు అందించాలనే ప్రయత్నంలో మొదట బంధువుల నుండి సమాచారం సేకరణ మొదలుపెట్టాను. ఈటూరి వంశీయులైన భూపాలరావు, అనంత పద్మనాభరావులతో మళ్లీ అన్వేషణ ప్రారంభించాను. తర్వాత మా కొండమ్మ చిన్నమ్మ, ఈటూరి ఆడబిడ్డ, సీతారామరావు ద్వారా కొంత సమాచారం లభించినా, అది సమగ్రత ఇవ్వలేదు. చేపూరి లక్ష్మీనరసింహారావు, లక్ష్మణరావు మేనల్లుడిని సంప్రదించే ప్రయత్నం విఫలమైంది. లక్ష్మణరావు భార్య బోయినపల్లి లలితమ్మ, మామిడాల గ్రామస్తుల ఆడబిడ్డ. వారి చెల్లెలు సుజాత ద్వారా



సమాచారం కోసం బోయినపల్లి జగన్మోహనరావు, గోపాలకిషనరావు, యాదగిరిరావులను సంప్రదించాను. యాదగిరిరావు, లక్ష్మణరావు–లలితమ్మ దత్తపుత్రుడైన లక్ష్మీప్రసాదరావు ఫోన్ నంబర్ ఇచ్చారు. లక్ష్మీప్రసాదరావుతో మాట్లాడి, లక్ష్మణరావు వివరాలపై స్పష్టత వచ్చింది.

సమగ్ర సాహిత్యం రెండవ సంపుటం సమాచారం కోసం వెలుదండ నిత్యానందరావు, కొప్పారపు నారాయణమూర్తి, లింగంపల్లి రామచంద్రం, యల్లంభట్ల నాగయ్య, శ్రీరంగస్వామి, శంకరమంచి శ్యాంప్రసాద్, పోరెడ్డి రంగయ్య, జయశ్రీ పాలడుగు, పానుగంటి రామమూర్తి, కె.వి.జి.కె ఆచార్యులను సంప్రదించాను. శ్రీరంగస్వామి, నిత్యానందరావు సమగ్ర సాహిత్యం రెండవ సంపుటంలోని 532–537 పేజీలను వాట్సాప్‌లో అందించారు. వీరికి కృతజ్ఞతలు. లక్ష్మీప్రసాదరావు, 2017లో ప్రచురితమైన తెలంగాణ తేజోమూర్తులు సంపుటిలో లక్ష్మణరావు గురించి నిత్యానందరావు రాసిన వ్యాసం పిడిఎఫ్‌ను అందించారు. వీరికి కూడా కృతజ్ఞతలు.

దేవరుప్పుల వాగు చెలిమ నీళ్లు తాగి మేధావులైన వారిలో ఈటూరి లక్ష్మణరావు 1917లో లక్ష్మీనారాయణరావు, వెంకట్రామ నర్సమ్మలకు జన్మించారు. ప్రాథమిక విద్య ఊళ్లో, ఎఫ్.ఏ హన్మకొండలో, డిగ్రీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదివారు. 1944లో మామిడాల బోయినపల్లి లక్ష్మీనరసింహారావు కూతురు లలితమ్మతో వివాహం జరిగింది. 1947లో ఎం.ఏ పూర్తి చేసి, నిజాం ప్రభుత్వ అనువాద శాఖలో అనువాదకులుగా చేరి, సహాయ సంచాలకులుగా ఎదిగారు. సంతానం లేకపోవడంతో 1963లో లలితమ్మ చెల్లెల సంతానాన్ని దత్తత తీసుకుని, లక్ష్మీప్రసాదరావుగా నామకరణం చేశారు. 1965లో మలక్‌పేటలోని ప్రభుత్వ క్వార్టర్‌లో సర్వీసులో ఉండగా లక్ష్మణరావు దివంగతులయ్యారు. లక్ష్మీప్రసాదరావు, రాష్ట్ర గనుల భూగర్భ శాఖలో అధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. వీరి భార్య సునీత, కుమార్తెలు అభిజ్ఞ, అర్చిత.

లక్ష్మణరావు చనిపోయి ఆరు దశాబ్దాలైనా, వారి ప్రభావశీలత విస్మరించలేనిది. వారి ప్రజ్ఞాపాటవాలను తెలుసుకోవడం విషయ సంపన్నతను సాక్షాత్కరిస్తుంది. కాస్త అన్వేషణ, కొంత ఓపికతో ఈ మహామనిషి గురించి తెలుసుకుంటే, భావితరాలకు దిక్సూచిగా నిలుస్తుంది.



పాలడుగు రత్నాకరరావు

**కొత్త మాట**

**మీకు కావలసిన గొప్ప విషయాలన్నీ నేర్పించే**
**అద్భుతమైన శక్తులు**
**తల్లిదండ్రులు గురువులు మాత్రమే**
**అడగకుండా అన్నీ ఇచ్చే**
**వారిని మీరు అమితంగా ప్రేమించండి**
**ఇష్టంగా.. క్షుణ్ణంగా పరిశీలించండి.**
**ఎన్నో పుస్తకాలు చదివినంత**
**విజ్ఞానం మీకు లభిస్తుంది.**

కొత్త అనిల్ కుమార్

# డిజిటల్ విద్యతో విప్లవాత్మక మార్పులు

## డిజిటల్ విద్యా సాధ్యమేనా..?



కాలం మారుతుంది,కాలానికి అనుకూలంగా విద్యలో కూడా అనేక మార్పులు వస్తున్నాయి. రోజు రోజుకు విద్యార్థుల్లో కూడా కాంపెటీషన్ పెరుగుతుంది. దాన్ని అధిగమించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు అధ్యాపకులు. ఇలా పట్టణ ప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి పాఠశాలలకు కూడా డిజిటల్ తరగతులతో బోధన చేపట్టి, విద్యార్థుల్లో నైపుణ్యాలను అలవరుస్తున్నారు. కరోనా సమయంలో కూడా ఈ డిజిటల్ తరగతుల కీలకంగా పని చేశాయి. గూగుల్, జూమ్ యాప్ ద్వారా ఇంటిదగ్గర ఉన్నటువంటి పిల్లలకు సైతం పాఠాలు బోధించారు.ఈ విధంగా ఆన్లైన్ క్లాసులకు ఆజ్యం పోయడం జరిగింది.ఇలా పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇంట్లోనే పాటలు వినేటువంటి పరిస్థితి కలిగింది.ప్రైవేటు పాఠశాలలే కాకుండా ప్రభుత్వ,ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలో కూడా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధనలు అందించడానికి పలు రకాలుగా పాఠాలను బోధిస్తున్నారు. అందులో సులభతరంగా విద్యా బోధన చేయడానికి ఇంటరాక్టివ్ ప్లాట్ ప్యానెల్ బోర్డులు ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల్లో డిజిటల్ విప్లవము వచ్చింది అనడంలో అతిశయోక్తి లేదు.విద్యార్థులకు సులభతరంగా పాఠ్యాంశాలు బోధించడానికి ఎంతగానో ఉపయోగ పడుతుంది. విద్యలో సాంకేతిక పురోగతి కోసం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఐక్యంగా నిలబడి, అధ్యాపకులు సైతం అండగా ఉన్నప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. అందు కోసం అధ్యాపకులకు నూతన టెక్నాలజీని కూడా బోధిస్తున్నారు. సాంకేతిక విప్లవం ఇంకా వెనుకబడి ఉన్న అనేక పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ప్రధాన సవాళ్లు ఉన్నాయి. ఉపాధ్యాయులు తరగతి గదిలో ఆధునిక విద్యా సాధనాలను ఉపయోగించడానికి వెనుకాడతారు. అలా వెనకాడకుండా ఉండడానికి , సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించడానికి, వారికి సరైన శిక్షణ ఇస్తున్నారు. గతంలో వనరులు, మౌలిక సదుపాయాలు మరియు కనెక్టివిటీ లేకపోవడం వల్ల తరగతి గదులకు ఇంత సుసంపన్నమైన సాంకేతికత అందుబాటులో లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం అలాంటి ఇబ్బంది ఏమీ లేదు.భారతదేశం డిజిటల్ మయమైంది.వేగవంతమైన సాంకేతిక పురోగతి యుగంలో మన పట్టణ కేంద్రాలు అభివృద్ధి చెందుతున్నందున,మన నగరాలు మరియు గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న విస్తారమైన విద్యా అంతరాన్ని తగ్గించడంపై మనం దృష్టి పెట్టవలసిన సమయం ఆసన్నమైంది.ప్రపంచీకరణ ద్వారా గుర్తించబడిన యుగంలో, ఏ బిడ్డ అయినా, వారి భౌగోళిక అక్షాంశాలతో సంబంధం లేకుండా, నాణ్యమైన విద్యకు దూరంగా ఉండకూడదనే ఉద్దేశం తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య పై ఎక్కువ నిధులు కేటాయిస్తూ, అందులో చదువుతున్నటువంటి విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడినటువంటి విద్యను అందుబాటులోకి తెచ్చింది.ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతి గదుల పరిచయం ఆశాకిరణంగా ఉద్భవించింది.ఈ వినూత్న సెటప్‌లు మన దేశంలోని మారుమూల ప్రాంతాలలోని విద్యార్థులకు సాధికారతను కల్పిస్తాయి.దృశ్య, అభ్యాస అనుభవాలు మరియు ఇంటరాక్టివ్ వాతావరణాల ద్వారా మెరుగైన అవగాహనను అందిస్తాయి. గ్రామీణ విద్యలో సాంకేతికతను సమగ్రపరిచే మార్గంలో సవాళ్లు లేకుండా లేవు.పరిమిత మౌలిక సదుపాయాలు మరియు నిరంతర విద్యుత్ సరఫరా నుండి డిజిటల్ అక్షరాస్యత యొక్క అడ్డంకులు వరకు,అడ్డంకులు అనేకం ఉన్నాయి.అన్నింటిని అధిగమిస్తూ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు,బ్యాగులు ఇలా అన్ని సమకూర్చుతూ మరోపక్క బోధన పద్ధతుల్లో కూడా వినూత్న పద్ధతులు పాటించేలా అనేక విద్యా ప్రమాణాలను పాటిస్తూ, గురుకులాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుతుంది.కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడం జరిగింది. కంప్యూటర్ ల్యాబ్ తో పాటు,ట్యాబు ద్వారా,బై జ్యూస్ కంటెంట్ విద్యార్థులకు బోధించేందుకు ప్రతి తరగతి గదిలో ఐ ఎఫ్ ప్యానల్, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేసి విద్యను అందిస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారా లైవ్ క్లాస్‌లను కూడా అందుబాటులోకి తేవడం జరిగింది. విద్యార్థికి ఏదైనా అర్థం కానప్పుడు అడిగే విధంగా కూడా ఉండి, వారికి వచ్చిన డౌటును క్లారిఫై చేసుకోవడం జరుగుతుంది. విద్యార్థుల యొక్క ఆదరణ సైతం డిజిటల్ పద్ధతుల ద్వారానే తీసుకోవడం జరుగుతుంది. ఈ విధంగా పాఠశాల విద్యార్థుల్లో మెరుగైన ర్యాంకులు రావడం,కళాశాల విద్యార్థులు నీట్,ఐఐటి వంటి పోటీ పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించడం,విశ్వవిద్యాలయాలలో చదువుకునేటువంటి డిగ్రీ, పిజి,పిహెచ్ డి విద్యార్థులు సైతం వారికి తెలియని విషయాలను సైతం తెలుసుకుంటూ వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటున్నారు.ఈ విధంగా కరోనా సమయంలో ఇంట్లోనే ఉండి విద్యను నేర్చుకోవడం జరిగింది. ఇప్పుడు విశ్వవిద్యాలయాల్లో సైతం ఆన్లైన్ ఎడ్యుకేషన్ ద్వారా విద్యార్థులకు ఆన్లైన్ పాఠాలు బోధిస్తున్నారు.20వ శతాబ్దపు 3వ పారిశ్రామిక విప్లవం ఇంటర్నెట్ మరియు ఆటోమేషన్ టెక్నాలజీ లను తీసుకువచ్చింది. డిజిటల్ టెక్నాలజీల విస్తృత వినియోగం కారణంగా, దీనిని డిజిటల్ విప్లవం అని కూడా పిలుస్తారు. కొత్త డిజిటల్ టెక్నాలజీల సహాయంతో ప్రస్తుత వ్యాపార ప్రక్రియలను మెరుగుపరిచే ప్రక్రియను డిజిటలైజేషన్ అంటారు. 20వ శతాబ్దంలో కంప్యూటర్లు విస్తృతంగా వాడుకలోకి వచ్చిన తర్వాత ఇది ప్రారంభమైంది. ఇంతకు ముందు భారత్‌లో ఎంతోమంది విద్యార్థులు పలు రకాల కారణాలతో అర్ధాంతరంగా చదువుకు దూరం అయ్యే వారు. వారికోసం వారు చదువు కొనసాగించడానికి విశ్వవిద్యాల యంలో ఈ డిజిటల్ ఆన్లైన్ తరగతులు ఎంతగానో తోడ్పడుతుంది. ఇవే కాకుండా సీట్లు పొందినటువంటి విద్యార్థులు డిజిటల్ ద్వారా తమకు నచ్చిన విశ్వవిద్యాలయంలో గాని, విద్యాలయాలలో గాని, సంక్షేమ గురుకులాల్లో సీట్లు పొందుతున్నారు. ఈ విధంగా విద్యార్థులకు ఆన్లైన్ కోర్సులు విస్తృతంగా అందుబాటులోకి రావడం, ఆన్లైన్ కోర్సులను అందించడానికి కేంద్రం ఆధ్వర్యంలో 2016లో మాసీవ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సెస్ వేదిక ఏర్పాటు చేశారు.రాబోయే రోజులలో అంతర్జాతీయ విద్యా సంస్థలతో డిజిటల్ పాఠాలను అందించినట్లయితే ఎంతగానో ఉపయోగపడుతుంది.అటువంటి పరిస్థితిని కరోనా సమయంలో చూసాం. ఇప్పుడు మళ్లీ వాడడం జరుగు తుంది. ఏది ఏమైనాప్పటికీ డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇలా ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉండి, విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తున్న టువంటి గురుకులాలు, పాఠశాలలు ఉన్నత ప్రమాణాలు పాటించడమే కాకుండా వారిని సమాజంలో ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతున్నారు అధ్యాపకులు.వివిధ రంగాలలో ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే కాకుండా,అణగారిన వర్గాలను ఉన్నతీకరించడానికి మరియు వివిధ సామాజిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై దృష్టి సారించాయి.ఈ విధంగా విద్యార్థులు,అధ్యాపకులు,డిజిటల్ వ్యవస్థలను ఉపయో గించి ,వాటితో బోధించి, ఎంతో మంది విద్యార్థులకు ఆదర్శప్రాయులుగా నిలుస్తున్నారు.



డాక్టర్ మోటె చిరంజీవి
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327

# సినారె

1931, జూలై 29న కరీంనగర్ జిల్లా హనుమాజి పేటలో శ్రీమతి బుచ్చమ్మ, మల్లారెడ్డి దంపతులకు జన్మించిన తెలుగు తేజం.. 2017 జూన్ 12 న ఈ లోకం విడిచి వెళ్ళినా.. ఈ సాహితీ జగత్ ఎప్పటికీ మరువలేదు. కీ.శే: సింగిరెడ్డి నారాయణ రెడ్డి. అలా పేర్కొనడం సబబుకాదు.. ఎందుకంటే ఆయన సరస్వతీ పుత్రుడు.. ఆయన కావ్యాలు, పాటలు, ఆయన కృతులన్నీ మన మధ్యే ఉన్నాయి..

**ఆయన విశ్వంభరుడు..**
**అంటే విశ్వాన్ని అంబరంగా ధరించినవాడు..**
**ఆయన సాహితీ వల్లభుడు..**
**సాహిత్యం బ్రతికి ఉన్నంత వరకు..ఆయన**
**చిరంజీవే..**
**అందుకే మహా మహోపాధ్యాయ**
**శ్రీ సింగిరెడ్డి నారాయణ రెడ్డి గారు అనడమే**
**సబబు...**

**తెలుగు పద సిరి సంపదలకు**
**ఆయన కీర్తి కిరీటం..**
**ఆయన కవితా కుసుమాలు**
**తెలుగు పదాల సోయగాలు.**

**ఆయన కలం నుండి జాలువారిన**
**పాటల వయలు పదాల జల్లు**
**హృదయాంతరాల హరివిల్లు.**
**కృష్ణమ్మ గోదారమ్మలకు**
**నడకలు నేర్పే నాట్య మయూరాలు..**

**ఆయన బెనుకులు చెణుకులు**
**జావళీలు గజల్స్**
**సమాజ దర్పణాలు..**

**కవిత, కావ్యం ఆయన చిరునామా**
**ఆరోహణ ఆయన దృక్పథం**
**కాలం అంచు మీద ఆయన ప్రయాణం..**
**ఆయన మట్టి మనిషి గట్టి మనీషి.**

**ఆకాశమే ఆయనకు సరిహద్దు**
**విశ్వంభర ఆయన మానవతకు మనోజ్ఞ**
**రూపం..**

**ఆయన కావ్యాలన్నీ జీవ నదులే**
**ఆయన గేయాలన్నీ ఉషోదయపు లేత కిరణాలే**
**ఆయన తెలుగు ఉర్దూ గజళ్ళు**
**నింగికెగిరిన ప్రపంచ పదులు..**

**ఛందో బద్ధ కవి..**
**చరణాలను ఆభరణాలుగా**
**అలవోకగా అలంకరించిన ఆశు కవి**
**అంగారాన్ని శృంగారాన్ని**
**సమపాళ్ళలో రంగరించిన స్వప్నికుడు..**

**కన్నీటి కావ్యాల ఆలాపన**
**వియోగ గీతాల విరహవేదన**
**వివేకంతో వినిపించిన విరించి.**

**విప్లవ గీతాల జ్వాలాజ్యోతి**
**అగ్నినీ, అమృతాన్ని**
**కురిపించిన సవ్యసాచి..**
**ఆయన సాహితీ కృషీవలుడు..**

**ఆయన సినీ గీతాల ప్రస్థానం**
**కోట్లాది రస రమ్య ప్రేక్షకులకు కమనీయ**
**కావ్యాలు...**
**ముత్యాల ముగ్గులో గోగులు పూయించినా..**
**తూర్పు పడమరల ఏకం చేసిన**
**శివరంజని నవరాగిని అన్నా..**
**జోరుమీద ఉన్నావు తుమ్మెదా నీ జోరేవారికోసమే**
**అన్నా..**
**మంగమ్మ గారి మనవడిలో శ్రీ సూర్య**
**నారాయణా అన్నా**
**ఆయన**
**స్వాతి ముత్యంలో లాలి లాలి.. వట పాత్ర**
**శాయి వరహాల లాలి అన్నా..**
**సూత్రధారుల్లో జోలాజో లమ్మ జోలా, నీలాల**
**కన్నులకు నిత్యమల్లె పూల జోల అద్భుతమైన**
**లాలి పాట..**
**ఆ పాటల్లోని మాధుర్యం, మహత్తు**
**మహోన్నతం..**
**(మా మనుమరాలు లిమిహిరలి రోజుకు పది**
**సార్లు వింటుంది..)**
**మారాం చేసే పిల్లలను జోకొట్టి**
**పడుకోపెట్టడానికి ఇంతకన్న అద్భుత కమనీయ**
**గీతాలు ఏవీ..**

**ఆయన విశ్వంభర**
**విశ్వ మానవ రహస్యం**
**తెలుగు జాతికి నీరాజనం**
**ఆయన ఏక వీర చిత్రం**
**విశ్వనాథ సత్యనారాయణ**
**ఏకవీర నవలకు దృశ్య రూపం..**
**ఆయన కర్పూర వసంత రాయలు**
**కొండవీటి ప్రేమ గాథ..**

**ఆయన ఆహార్యం,**
**ఆయన గాంభీర్యం**
**ఆయన హావ భావాలు.**
**ఆయన ఉచ్చారణ సరళి**
**ఆయన పంచెకట్టు**
**తెలుగుదనానికే తేజస్సు..**

**ఉర్దూ, ఆంగ్లంలో ఆయన రచనలు**
**ఆయన అనువాద గ్రంథాలు**
**తెలుగు నుడికారాన్ని జగద్వితం చేశాయి..**
**ఆయనకు అవార్డ్ ఇవ్వడమంటే**
**ఆ అవార్డుల ఖ్యాతిని పెంచడమే..**
**డాక్టరేట్లు, సాహిత్య అకాడమీ**
**దేశ, విదేశ పురస్కారాలు**
**పద్మశ్రీ, పద్మ భూషణ్**
**జ్ఞాన్ పీఠ్ అవార్డులు వరించడం**
**తెలుగు జాతికే కీర్తి ప్రతీకలు..**

**సినారె సాహితీ స్రష్ట**
**తెలుగు సాహితీ జగత్ లో బాహుబలి**
**ఆయన కీర్తి ఆచంద్ర తారార్కం..**

**ఆయన 1989 లో తెలుగు విశ్వ విద్యాలయ**
**కులపతి గా ఉన్నపుడు..నాకు ఆయన్ని కలిసే,**
**ఇంటర్వ్యూ చేసే మహాభాగ్యం లభించింది..**
**మళ్ళీ 2011లో ఆయన చేతుల మీదుగా స్వామి**
**వివేకానంద విశిష్ట పురస్కారం తీసుకునే భాగ్యం**
**లభించింది.**
**ఆయన విగ్రహం**
**నా హృదిలో నిరంతరం**
**కవితాగ్ని రగిలిస్తూనే ఉంటుంది..**

**ఆయనకు ఇదే**
**నా అక్షర నీరాజనం.**

శిరందాస్ శ్రీనివాస్
ప్రధానాచార్యులు
వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల
నిజాం వైద్య విజ్ఞాన సంస్థ
హైదరాబాద్.

# మధ్యాహ్న భోజన బియ్యంలో పురుగులు

- తాగునీటి కుండల్లో కలుషిత నీళ్లు
- నవాబ్ పేట్ మోడల్ స్కూల్లో ఘటన
- పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి రేణుకాదేవి
- మండల విద్యాధికారికి ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 28 (జనం సాక్షి) :** అందరికీ సన్న బియ్యం అందజేస్తున్నామని సర్కార్ సంక లేగేస్తుంది. సన్న బియ్యం దేవుడెరుగు. కానీ బియ్యం లో మాత్రం పుట్టెడు పురుగులు లో స్తున్నాయి. హాస్టల్ విద్యార్థులతో పాటు పాఠశాలల విద్యార్థుల కు అవే సరఫరా జరుగుతున్నాయి. సన్న బియ్యం పై సర్కారుకున్న చిత్తశుద్ధి అధికారులకు పట్టినట్లు లేదు. వాళ్ల నిర్లక్ష్యం కారణంగా పురుగుల బియ్యం సరఫరా కాగా వాటితోనే మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈ విషయం ఆ నోట ఈ నోట బయటికి రావడంతో స్థానిక నాయకులు అధికారుల నిలదీయడంతో ఉన్నత అధికారుల తనిఖీలు శర మామూలైపోయింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా నవాబ్ పెట్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో జరిగింది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ మధ్యాహ్న భోజనం బియ్యం లో పుట్టెడు పురుగులు ఉన్నాయి. అవే బియ్యంతో సిబ్బంది మోడల్ స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. సన్న బియ్యం లో పురుగులు వస్తున్న విషయాన్ని వంటవారు గమనించి స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసిన వారు పట్టించుకోలేదు. అవే బియ్యాన్ని పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంగా వడ్డించడంతో ఈ విషయం ఆ నోట ఈ నోట విద్యార్థుల తల్లిదండ్రులకు స్థానిక నాయకులకు చేరింది. దీంతో స్థానిక బిజెపి నాయకులు మోడల్ స్కూల్ పాఠశాలకు వెళ్లి బియ్యాన్ని పరిశీలించగా అందులో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాకుండా విద్యార్థులకు అందించి మంచినీటి కుండల్లో కలుషితమైన నీళ్లల్లో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా పురుగులు ఉన్న కలుషితమైన నీటిని విద్యార్థులు తాగితే వారు అనారోగ్యానికి గురవుతారని బిజెపి నాయకులు మండల విద్యాధికారికి ఎంపీడీవోకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పాఠశాలకు వెళ్లి బియ్యాన్ని తాగునీరు నిల్వచేసే కుండలను పరిశీలిస్తే విషయం బయటకు వచ్చిందని స్థానిక ఉపాధ్యాయులు బిజెపి నాయకుల పై మండిపడ్డారు. ఈ విషయమై వికారాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవికి సమాచారం అందడంతో ఆమె ఉటాహుటిన మోడల్ పాఠశాలకు వెళ్లి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం బియ్యం లో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే విద్యార్థులకు అందించే తాగునీటి కుండల్లో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులకు అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యంతో పాటు కూరగాయలను పరిశీలించారు. వెంటనే బియ్యాన్ని మార్చేసి నాణ్యమైన బియ్యంతో విద్యార్థులకు భోజనం అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. వంటశాలలో విద్యుత్ సౌకర్యం లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

## లిటిల్‌స్టార్ చిల్డ్రన్స్ ఆసుపత్రి ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్, జూలై 28 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పైప్ లైన్ రోడ్ లో డాక్టర్ వికాస్, డాక్టర్ శివాని ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన లిటిల్ స్టార్ చిల్డ్రన్ ఆసుపత్రిని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపార దృష్టితో కాకుండా సామాజిక సేవ దృక్పథంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. అత్యంత నూతన టెక్నాలజీతో ఆసుపత్రిని ఏర్పాటు చేసిన యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వేణు యాదవ్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే నాగేష్, ఎల్ల గౌడ్, పులి మహేష్, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారస్తులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

- సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- వ్యాపారస్తుల సమావేశంలో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి



**మర్పల్లి, జూలై 28 (జనంసాక్షి) :** నేరాలు జరిగినప్పుడు సీసీ కెమెరా ఫుటేజ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని నిందితులను పట్టు కొనడానికి సులభతరం అవుతుందని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మర్పల్లి పోలీస్ స్టేషన్ సందర్శించి, వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ దుకాణముల యజమానులు ప్రతి ఒక్కరూ ప్రతి షాపునకు నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నేరాలు జరిగినప్పుడు సిసి ఫుటేజ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ను ధరించాలని అన్నారు. ప్రజలంతా సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి ఓటీపీలు షేర్ చేయడం కానీ చేయరాదని అన్నారు. 17 సంవత్సరాల లోపు పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని, వాహనాలు నడుపే ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఏటీఎం కార్డు ఓటిపి వంటి నెంబర్లను వారికి తెలుపరాదని అన్నారు. ఎవరైనా సైబర్ క్రైమ్ గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ వెంకట్, ఎస్సై రవూఫ్ వ్యాపారస్తులు ప్రభాకర్ గుప్తా, జగదీశ్వర్, గౌస్, గఫార్, ఆగమయ్య, వడ్ల నరహరి తదితరులు పాల్గొన్నారు.

## సిగాసి కంపెనీ యజమాన్యంపై కేసులు నమోదు చేయరా..?

- కోటి పరిహారం ఎప్పుడు ఇస్తారు..?
- బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ
- మాజీ మంత్రి హరీశ్ రావు



**సంగారెడ్డి టౌన్, జూలై 28 (జనం సాక్షి) :** సిగాచి ఘటన జరిగి నెల రోజులు కావొస్తున్న పరిశ్ర యాజమాన్యంపై కేసు ఎందుకు పెట్టడం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో, మన రాష్ట్రంలో ఇంత దారుణమైన ప్రమాద ఘటన ఇప్పటివరకు జరగలేదన్నారు. 54 మంది చనిపోతే ప్రభుత్వ స్పందన అత్యంత దయనీయంగా, బాధ్యతారాహిత్యంగా ఉందన్నారు. ఎక్స్‌గ్రేషియా, డెత్ సర్టిఫికేట్ ఎప్పుడు ఇస్తారు అని బాధితులు అడిగితే, ఎస్ ఎల్ బీ సీ ఘటనలో శవాలు కూడా రాలేదు, మీకు బూడిదైనా దొరికింది అని అత్యంత అమానవీయంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ, బిహార్, జార?ండ్, యూపీ నుంచి రావాలంటే రూ. 20, 30 వేలు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు బాధపడుతున్నారని ఆయన అన్నారు. సీఎం కోటి ఇస్తామన్నరు, ఎప్పుడు ఇస్తారు, ఎవరు ఇస్తారు అని అడిగితే ఎవరూ చెప్పడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారని అన్నారు. తీవ్రంగా గాయపడ్డవారికి సీఎం పది లక్షలు ఇస్తామని చెబితే, రూ. 50వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నరు. ఎస్ ఎల్ బీ సీలో ఆరు శవాలు, సిగాచిలో 8 మంది శవాలు మొత్తం 14 శవాలు ఏమయ్యాయని, మిస్సింగ్ అని ఎలా తప్పించుకుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే బిఆర్ఎస్ తరుపున పోరాటం తీయడం చేస్తాంమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే సున్నిత లక్ష్మారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, బి ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ జిల్లా 17వ మహాసభను విజయవంతం చేయాలి

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభు లింగం



**చేవెళ్ల, జూలై 28 (జనంసాక్షి) :** సిపిఐ జిల్లా 17వ మహాసభను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యం ప్రభు లింగం పిలుపునిచ్చారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ చేవెళ్ల మండల కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి మల్గారి సత్తి రెడ్డి అధ్యక్షతనలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఆగస్టు రెండవ తేదీన మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్ లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ 17వ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభ 400 మంది డెలిగేషన్తో జరుగుతుందని, ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. ఈ మహాసభలో నూతన కౌన్సిల్ కార్యవర్గం, నూతన కార్యదర్శిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో పార్టీ నిర్మాణం ప్రజా సంఘాల నిర్మాణము పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ దిశగా నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి సుభాన్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, డాక్టర్ షౌరీలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, వడ్ల మంజుల, మీనాక్షి, లలిత. పోచయ్య, ఒగ్గు సత్యనారాయణ, మల్లయ్య, పెంటయ్య తదితరులున్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ బృందం ఆకస్మిక పర్యటన

**మల్దకల్, జూలై 28 (జనంసాక్షి) :** మండల కేంద్రములో సో మవారం ఆపరేషన్ ముస్కాన్ బృందం ఆకస్మిక పర్యటన చేసి బడికి రాని బడి బయట పిల్లలను తల్లిదండ్రులు విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వినోద్ కుమార్, అంజనేయులు, వైష్ణవి, కార్తీక్, రేణుక, తిమ్మప్పల ఇండ్లను సందర్శించి వారి తల్లిదండ్రులకు విద్యార్థులను పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని సూచించడమైనది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జి సురేష్, ఆపరేషన్ ముస్కాన్ బృందం సభ్యులు ఎస్ఐ కేశవరావు,లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ టి రవి, కానిస్టేబుల్ రాజు, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ సరాగిణి, పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, నాగేశ్వరరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



## ఆగస్టు 7న జరిగే ఓబిసి మహాసభను విజయవంతం చేయాలి



**తూప్రాన్, జులై 28 (జనం సాక్షి) :** వచ్చేనెల ఆగస్టు 7న జరిగ ఉన్న అఖిలభారత జాతీయ ఓబీసీ పదం మహాసభను విజయవంతం చేయాలని ఇది సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున గౌడ్ తెలిపారు బిసి.. ఛలో గోవా అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభ పోస్టర్స్ ను ఆవిష్కరణ చేసిన మెదక్ జిల్లా బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు చిన్నలింగ్ మల్లికార్జున్ గౌడ్ ఈసందర్భంగా అయన మాట్లాడతూ ఆగష్టు 7వ తేది న జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభను విజయవంతం చేయా లని అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో నలంద విద్యా సంస్థల ఇంచార్జి పట్లూరి రవీందర్,బాయకాడి ఆంజనేయులు, రాపోల్ పర్వాతా లు, గౌటి బాలేష్, బీమరి బాలరాజ్,మనోహర్, శివకుమార్ పాల్గొన్నారు.


## ప్రైవేట్ ఆస్పత్రుల మోసాలను అరికట్టాలి



**కుత్బుల్లాపూర్, జూలై 28 (జనం సాక్షి) :** ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలను అరికట్టడంలో అధికారులు, ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నారని మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేష్ ఆరోపించారు. సోమవారం షాపూర్ నగర్ లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ ఇటీవల సికింద్రాబాద్ సృష్టి ఫర్టిలైటి సెంటర్లో జరిగిన మోసాలను కాకుండా చూడవలసిన అవసరం ఉందన్నారు. సరోగసి చికిత్స ద్వారా పిల్లలను పుట్టించడంలో సృష్టి ఆసుపత్రి వారు చేసిన మోసాలను తీవ్రంగా పరిగణించి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరచుగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, మండల కార్యదర్శులు కే. స్వామి, పి. శ్రీనివాస్, ఏఐటీయూసీ కార్యదర్శి వి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ మాయమాటలు ప్రజలు నమ్మొద్దు

- విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి
- కాంగ్రెస్‌లో 100 మంది చేరిక
- యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- కలిసి కట్టుగా కష్టపడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూలై 28 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ పార్టీ మాయ మాటలు ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో ని ఎంపిటి పంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీలోకి జైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి దోరశెట్టి సత్యమూర్తికి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కొత్త వ్యక్తులు పాత వ్యక్తులు అనే తేడా ఉండదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి నామినేషన్ వేయడానికి వ్యక్తులు కరువయ్యారని విమర్శించారు. ఐదు సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి ఆమడ దూరం అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 36వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలువాలన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ స్థానం కైవసం చేసుకుంటామన్నారు. తక్కువ సమయంలో నన్ను అశీర్వదించిన తాండూరు ప్రజలను మరువబోనని అన్నారు. రాబోయే మూడు సంవత్సరాల్లో తాండూరు నియోజక వర్గం రూపురేఖలు మారుస్తానని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తామన్నారు. బిఆర్ఎస్ కాలయాపన చేసిందన్నారు. మొరిగే కుక్క కరవదు కరిచే కుక్క మొరగదని సామెత తెలిపారు. పేరుకే శిలాపలకాలు వేసి అభివృద్ధి మరిచారు. ఐదు సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కాగితాలకే పరిమితమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధిని మరింత పరుగులు పెడతామన్నారు. బీఎస్పీ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన దోరశెట్టి సత్యమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం దొరశెట్టి సత్యమూర్తి మాట్లాడుతూ 23వ వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్‌ను గెలుపిస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. తాండూరులో ప్రదాన సమస్యలు రోడ్లు..రోడ్ల సమస్యలు పరిష్కరిస్తున్నారని పెండింగ్ పనులు పరిష్కరించాలన్నారు. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. మన ప్రాంత ముఖ్యమంత్రి ఉన్నందున అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. 23వార్డు యువతకు అండగా ఉండాలని కోరారు. 23వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని వివరించారు. విద్యుత్, నీటి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, సీనీయర్ నాయకులు డా. సంపత్ కుమార్, అబ్దుల్ రవూఫ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్, మాజీ డీపీసీ సభ్యులు పట్లోళ్ల నర్సింలు, వడ్డె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నీరజాబాల్ రెడ్డి, జుబేర్ లాల, ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు హబీబ్ లాల, మహిళ అధ్యక్షురాలు గాజుల మాధవి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బంటు వేణుగోపాల్, వార్డు ఇంచార్జ్ భరత్ రెడ్డి, నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల బలోపేతానికి సహకరిస్తాం




**కొడంగల్, జూలై 28 (జనం సాక్షి) :** ప్రభుత్వ బడుల బలోపేతానికి సహకరిస్తామని హరివిల్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు మురహరి అన్నారు.సోమవారం మండల పరిధిలోని టేకుల గడ్డ తండా ప్రాథమిక పాఠశాలలో 20 మంది బాల బాలికలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పాఠశాలలో వారి వారి అవసర నిమిత్తం విద్యార్థులకు ప్లేట్లు బ్యాగులు నోటు పుస్తకాలు ల్యాబ్ మెటీరియల్స్ ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రగతికై ఫౌండేషన్ అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమని ఇలాగే మునుముందు మరెన్నో సేవలు ఫౌండేషన్ ద్వారా అందించాలని ఆయన అన్నాడు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తమప్ప శ్రీనివాస్ పిఆర్‌టియు నాయకులు మెహరాజ్ ఉపాధ్యాయులు మోహన్, నరసింహారెడ్డి వికాస్ ఏజెన్సీ సిబ్బంది జెమినీ భాయ్,బుజ్జి బాయ్ అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
29 జూలై 2025

# స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలి

- మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి



**చిన్నంబావి, జూలై 28 (జనం సాక్షి) :** చిన్నంబావి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి, రంగినేని అభిలాష్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో చిన్నంబావి మండలంలోని అన్ని గ్రామాల్లో సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చిన్నంబావి మండలంలోని 17 గ్రామపంచాయతీలు అలాగే ఎంపీపీ, జడ్పిటిసి స్థానాలను కైవసం చేసుకుని బీఆర్ఎస్ పార్టీ ప్రజలలో బలంగా ఉందని నిరూపించాలన్నారు. అలాగే మొన్న చిన్నమారులో జరిగిన గొడవలలో రక్తం వచ్చేలా కొట్టిన స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడానికి వెళితే పట్టించుకోకపోవడం అన్యాయమని అధికారులు ప్రభుత్వానికి, నాయకులకు అండగా ఉండకుండా ప్రజల వైపు ఉండాలని లేదంటే రాబోయే రోజుల్లో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. టిఆర్ఎస్ కార్యకర్తలను బెదిరించిన లేదంటే అక్రమమైన కేసులు పెట్టిన చూస్తూ ఊరుకోమని కచ్చితంగా బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని అప్పుడు ఇంతకుమించి చేయాల్సి వస్తుందని అన్నారు. బొడ్డుపల్లి శ్రీధర్ రెడ్డి హత్య జరిగి సంవత్సరం దాటిన ఇప్పటివరకు నిందితులను పట్టుకోలేదు అంటే దీని వెనక ఎవరున్నారు అనేది ప్రజలకు తెలుసు త్వరలోనే నిందితులను పట్టుకోకుంటే బీఆర్ఎస్ పార్టీ కార్యాచరణను ప్రకటిస్తుందని తెలిపారు. మొన్న జరిగిన సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యక్తి అయిన జిల్లాకు కానీ మన కొల్లాపూర్ నియోజకవర్గానికి కానీ ఎలాంటి హామీలు ఇవ్వలేకపోవడం విడ్డూరమని, దాదాపు 40 సంవత్సరాలుగా ఉన్న 98 జీవో బాధితుల సమస్యలు తీరుస్తాడని అనుకుంటే తూతూ మంత్రంగా మాట్లాడి వెళ్లిపోయాడని అన్నారు. రంగినేని అభిలాష్ రావు మాట్లాడుతూ 6 గ్యారంటీలో ఏ ఒక్క గ్యారెంటీ అమలు చేయకుండా 420 హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి నిరుద్యోగులను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే స్థానిక ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెప్పాలని కార్యకర్తలు, నాయకులు అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాలలో సర్పంచ్ లను ఎంపీటీసీలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, జడ్పిటిసి వెంకట్రామమ్మ, వైస్ ఎంపీపీ పుష్పలత, ఉమ్మడి మండలాల వ్యవహారాల ఇంచార్జ్ గోవింద్ శ్రీధర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఈదన్న యాదవ్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు బైకులకు నిప్పంటిచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు



**నారాయణఖేడ్, జూలై 28 (జనం సాక్షి) :** నారాయణఖేడ్ పట్టణంలో దత్తాత్రేయ కాలనీలో నివసిస్తున్న రాథోడ్ సురేష్, మోహన్ చౌహన్,ల ద్విచక్ర వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నిప్పంటించారు. సురేష్‌కు చెందిన, సీట్,100, టీఎస్ 15 ఈటి 4612. మోహన్ కు చెందిన, హీరో హొండా ఫ్యాషన్,ఏపీ 09 ఏటి 1479, నెంబర్ గల ద్విచక్ర వాహనాలను ఎప్పటిలాగే ప్రతిరోజు, ఇంటి బయట నిలుపుతుండేవారు. అర్ధరాత్రి వాహనాలు తగలబడిన శబ్దాలు వినిపించడంతో ఇరుగుపొరుగు వారు లేచి చూసేసరికి వాహనాలు దగ్ధంమైపోయాయి. పోలీసు సమాచారం ఇవ్వడంతో ఎస్సై విద్యాచరన్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. దీనిపై నిందితులు ఎలాంటి వారైనా చర్య తీసుకుని తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



**వనపర్తి బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు ప్రజావాణికి మొత్తం 70 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజల ఫిర్యాదులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అధికారులను సూచించారు.

అందరు ప్రత్యేక అధికారులు జిల్లాలో తమకు కేటాయించిన మండల పరిధిలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్ని తనిఖీ చేసి అక్కడ నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు వడ్డించేలా చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆయా పాఠశాలల్లో పరిశుభ్రత ఉండేలా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నీటి ట్యాంకుల శుభ్రతకు సంబంధించి ట్యాంకుల వద్ద రిజిస్టర్లు మైంటైన్ చేయాలని సూచించారు. ఇక అన్ని మండల తహసిల్దార్లు భూభారతి రెవెన్యూ సదస్సుల అప్లికేషన్లను పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల మైదానాన్ని అప్పగించాలి

- ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు సౌమ్య డిమాండ్



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, జూలై 28 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ శ్రీపురం రోడ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాలకు చెందిన మైదాన స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా ఆక్రమించడం వల్ల కళాశాల విద్యార్థులు క్రీడా కార్యకలాపాలకు తీవ్రంగా నష్టపోతున్నారు. కళాశాల స్థలంగా ఉన్న సర్వే నంబర్లు 65/1, 65/5, 65/6, 65/7 కలిపి ఐదు ఎకరాలు 11గుంటల స్థలం కాగా, అందులో నాలుగు ఎకరాల వరకు ఇప్పటికే ఆక్రమించబడ్డాయని ఎబివిపి నేతలు తెలిపారు. కళాశాలకు మైదానం, రోడ్డు వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎబివిపి నాగర్ కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో కళాశాల ఎదురుగా రోడ్డుపై విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు సౌమ్య మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించి విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నారు. మైదానం లేకపోవడం వల్ల విద్యార్థులకు క్రీడల పరంగా, శారీరక అభివృద్ధిలో ఆటంకాలు వస్తున్నాయి. పలు వినతులు ఇచ్చినా అధికారులు స్పందించకపోవడం బాధాకరం. కళాశాలకు రహదారి కూడా లేదు. తక్షణమే మైదానాన్ని తిరిగి అప్పగించకపోతే, రహదారి నిర్మించకపోతే, కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ ముట్టడి తప్పదని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శివశంకర్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు, శంతన్, నగర సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, కళాశాల అధ్యక్షులు శివ, భాను, మార్కండేయ, కీర్తన, నిశాంత్, లావణ్య, పల్లవి, బిందు,కృష్ణవేణి, గాయత్రి, ఎబివిపి కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


## గోల్డ్ మెడలిస్టుకు సన్మానం



**నారాయణఖేడ్, జులై 28 (జనం సాక్షి) :** స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లో ఇటీవల తెలంగాణ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్న మలమంచి గురురాజ్ శర్మ సతీమణి శిల్పకు ఘనంగా సన్మానించారు. సోమవారం నారాయణఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తాలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో ఆలయ కమిటీ బాధ్యులు,పద్మశాలి సంఘం సభ్యులు శాలువ పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు మాట్లాడుతూ మహిళలు మలమంచి శిల్పను ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదువుకొని అత్యున్నత లక్ష్యాలు సాధించాలని కోరారు. పద్మశాలి సంఘం సభ్యులు చేసిన సన్మానం మమ్మల్ని ఎంతగానో ఆనందపరిచిందని గురురాజ్ శర్మ దంపతులు అన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల మన్ననలు పొందితేనే నాయకులుగా గుర్తింపు

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, జూలై 28 (జనంసాక్షి) :** ప్రజా క్షేత్రంలో ముందుండి ప్రజల సమస్యలను తీరుస్తూ, వారి మన్ననలను పొందగలిగితే నాయకులుగా గుర్తింపు లభిస్తోందని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హితవు పలికారు. వనపర్తి జిల్లా పరిధిలోని పాన్ గల్ మండల కో-కన్వీనర్‌గా ఇటీవల నియమితులైన అక్కల తిలకేశ్వర్ గౌడ్ ను మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి సోమవార తన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పార్టీపట్ల అంకితభావం, విధేయత కలిగి నిత్యం ప్రజాక్షేత్రంలో ప్రజల సమస్యల కోసం పోరాడాలని సూచించారు. అందరినీ కలుపుకొని పార్టీ పటిష్టతకు కృషి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగించాలని కోరారు .ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు నాగన్న యాదవ్, ఉంగులం తిరుమల్, బండారి కృష్ణ, శేఖర్, మాజీ సర్పంచ్ గౌడ నాయక్, చిట్యాల రాము,ఏర్వ సాయి ప్రసాద్, పురేందర్ గౌడ్, డానియల్, వెంకటేష్, సాగర్, శ్రీనివాసులు, సింగోటం నాయుడు, ఆంజనేయులు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- ప్రజావాణికి 54 దరఖాస్తులు
- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



**సంగారెడ్డి, జూలై 28 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిఆర్ఓ పద్మజరాణి లకు ఫిర్యాదులను సమర్పించారు. కాగా రెవిన్యూ-15, పౌరసరఫరాలశాఖ 09, పంచాయత్ రాజ్ 09,డి ఆర్ డి ఓ 09, వివిధ శాఖలకు సంబంధించి 12, మొత్తంగా 54 ఫిర్యాదులు అందాయి. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజరాణి, జడ్పిసిఈఓ జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఇంటింటికి ఆరోగ్య సర్వే వేగవంతం చేయాలి
- ప్రతి శుక్రవారం ఫ్రైడే- డ్రై డే పక్కాగా నిర్వహించాలి
- ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పురోగతి సాధించాలి



**టేక్మాల్, జూలై 28 (జనంసాక్షి) :** టేక్మాల్ మండలం పరిధిలోని ఎలకుర్తి ధనురా గ్రామాలలో విస్తృతంగా పర్యటించిన మెదక్ కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లు, గ్రామంలో ఫ్రైడే - డ్రై డే కార్యక్రమం నిర్వహణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగాటేక్మాల్ మండలం ఎలకుర్తి ,ధనురా గ్రామలలో పర్యటిస్తూ గ్రామ పరిసరాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గత సంవత్సరం డెంగీ, మలేరియా కేసులు ఎక్కడ ఎక్కువ నమోదయ్యాయో ఆ ఏరియాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలన్నీ నిర్మూలనకు ఫాకింగ్ చేపట్టాలన్నారు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల మందుల నిల్వలు అందుబాటులో ఉంచాలని, ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని, ఇంటింటికి ఆరోగ్య సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదవారి సంక్షేమం కోసం రూపొందించిన పథకం అన్నారు. నిరుపేదలకు సొంతింటి కల సహకారం చేయాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని క్షేత్రస్థాయిలోత్వరితగతిన ఇండ్లు నిర్మించుకోవాలని బిల్లుల ప్రభుత్వం వెంటనే మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేముల పోచమ్మ దేవాలయానికి బీడీ రోడ్డు మంజూరు చేయాలి

- చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్‌కు సిపిఐ వినతి



**చేర్యాల, జూలై 23 (జనంసాక్షి) :** ముస్త్యాల గ్రామంలో వేముల పోచమ్మ దేవాలయానికి బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతూ సిపిఐ చేర్యాల మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చేర్యాల తహసిల్దార్ దిలీప్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఈరి భూమయ్య మాట్లాడుతూ.. శక్తి మాతగా కొలిచే వేముల పోచమ్మ దేవాలయానికి నిత్యం వందలాది మంది భక్తులు దైవదర్శనానికి వస్తూ వెళ్తుంటారని, మట్టి రోడ్డు కావడంతో వర్షం పడితే అస్తవ్యస్తంగా మారి నడవాలంటే నరకయాతన పడుతున్నారని తెలిపారు. భక్తులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మూడు కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ దిలీప్ నాయక్ స్పందించి వీలైనంత త్వరగా ఆర్ అండ్ బీ, పంచాయత్ రాజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తహసిల్దార్‌కు గ్రామస్తులు, సిపిఐ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధిరాం భద్రయ్య, పొన్నబోయిన ప్రభాకర్, బింగి రాజు, పుల్ల కుమార్, నర్సిరెడ్డి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీ ఆశయాలను ముందు తీసుకెళ్లాలి

- జాతీయ కో ఆర్డినేటర్ కిరణ్ మూగబసవ




**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 28 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధి చెందినపుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని భావించి పంచాయతీ రాజ్ చట్టానికి సవరణ చేసి ముడు అంచెల విధానాన్ని ప్రవేశ పెట్టిన మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ ఆశయాన్ని అందరం ముందుకు తీసుకెళ్లాలని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కో. ఆర్డినేటర్ కిరణ్ మూగభసవా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. టిపిసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సూచన మేరకు సోమవారం నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో (సివిఆర్ భవన్)డిసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జిల్లా రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జాతీయ కో ఆర్డినేటర్ కిరణ్ మూగబసవ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలకు స్వయం పరిపాలన కల్పించి గ్రామాలను అభివృద్ధి చెందే విధంగా నాటి ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన కృషి వల్లనే నేడు గ్రామాలు అభివృద్ధి బాటలో ఉన్నాయన్నారు. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ను అనుసరించే తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం యస్సి వర్గీకరణ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీ నుండి పోటీ చేసే ప్రతి ఒక్కరికి రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ కార్యక్రమం పై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి మండలం నుండి ఇద్దరిని ఎంపిక చేసి త్వరలో సర్వోదయ సంకల్ప శిభిరం నిర్వహించి శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి. సలీం,అర్జీపిఆర్ఎస్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్, జిల్లా కో. ఆర్డినేటర్ మహేష్, వివిధ మండలాల అధ్యక్షులు సుధాకర్, వీరన్న, బాల్ రెడ్డి, ఆనంద్ గౌడ్, రాజప్ప గౌడ్, గొల్ల కృష్ణయ్య,జిల్లా ఫిషరీస్ చైర్మన్ కాంత్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ ఈదప్ప,బోయ. శరణప్ప,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి, మల్లేష్,యూసుఫ్ తాజ్, పల్ల అనిల్, కుర్వ మనోజ్, వెంకు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ నువ్వో బచ్చా గానివి.. నీ పద్ధతి మార్చుకో

**వ్యాపారాలే లేవన్న మాజీ ఎమ్మెల్యే మాటలు హాస్యాస్పదం**

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**భూపాలపల్లి, జూలై 28 (జనం సాక్షి):** 'కేటీఆర్ నువ్వో బచ్చా గానివి నీ పద్ధతి మార్చుకో కనీస రాజకీయ అవగాహన లేని వ్యక్తివి నువ్వు ప్రభుత్వాన్ని దున్నపోతు ప్రభుత్వమంటావా' అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్ర స్థాయిలో ఎద్దేవా చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి పాల్గొని మాట్లాడుతూ. పదేళ్ల అధికారంలో ఉండి వందలాది మంది ఆత్మహత్యలకు కారణమైంది మీ బీఆర్ఎస్ హయంలో కాదా అని ప్రశ్నించారు. పదేళ్ల మీ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది మీరు కాదా అని అన్నారు. మీ ప్రభుత్వ హయాంలో వేలాది ఎకరాల భూములను అప్పనంగా కొల్లగొట్టి లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. రాష్ట్రానికి దళిత ముఖ్యమంత్రి చేస్తానని మాటిచ్చి చేయలేదన్నారు. అదేవిధంగా, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం లాంటి ఎన్నో అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం మీదన్నారు. భారతదేశంలో అబద్ధాలు పుట్టిందే కేసీఆర్, కేటీఆర్ ఇంట్లోనని అన్నారు. తనకు వ్యాపారాలే లేవని మాజీ ఎమ్మెల్యే మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశాల్లో ఉన్న నీ వ్యాపారాల చిట్టా మొత్తం తీసి, పూర్తి వివరాలతో మీడియా ముందుకు త్వరలోనే వస్తానని ఎమ్మెల్యే అన్నారు. మీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు . మా నాయకులు కోటగిరి సతీష్ గౌడ్, బండ శ్రీకాంత్, కురిమిళ్ల శ్రీనివాస్ లపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించింది మీరు కాదా అని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ వాళ్లవి ఇసుక ర్యాలీలు జరుగుతున్నాయని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో వడ్డేపల్లి(హన్మకొండ) జీఎంఆర్ కట్టడాలకు ఇసుకను అక్రమంగా మొరంచపల్లి బ్రిడ్జి వద్ద డంప్ చేసి హన్మకొండ, హైదరాబాద్, భూపాలపల్లి కి లారీలల్లో తరలించింది మీరు కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. భూపాలపల్లి నియోజకవర్గానికి పదేళ్లు మీరు ఎమ్మెల్యేగా ఉండి చేసిన అభివృద్ధి ఏమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న 18 నెలల్లోనే ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తున్నందుకు అసూయ, ఈర్ష్య, కండ్లమంటతో తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాల పైన నా ఫోటోలు పెడితే, స్మశానవాటికల్లో సమాధుల పైన ఫోటోలు పెట్టుకున్నట్లు. అని మాజీ ఎమ్మెల్యే మాట్లాడిన తీరు సరైనది కాదన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు నాలుగైదు వందల కోట్ల అభివృద్ధి పనులు చేశానని, అవన్నీ పనులు త్వరలోనే పూర్తవుతాయని, ఆ పనులు పూర్తి కాకపోతే వచ్చే ఎన్నికల్లో నేను ఎమ్మెల్యేగా పోటీ చేయనని ఎమ్మెల్యే అన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నేతలు తప్పుడు మాటలు మానుకుంటే బాగుంటుంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పి, గుండు సున్నా వేసి విశ్రాంతినిచ్చారు. ఇప్పుడు త్వరలో జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూడా ప్రజలు మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో లేరని, ఆ ఎన్నికల్లో కూడా ప్రజలు మీకు పెద్ద గుండు సున్నా వేస్తారని ఎమ్మెల్యే అన్నారు.

# భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- **ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలి**
- **ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె శశంకా**



**ములుగు ప్రతినిధి, జూలై 28(జనంసాక్షి) :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద నేపథ్యంలో జిల్లా అంతటా అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె శశంకా సూచించారు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె శశంకా ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ఐటిడి ఏ, ఏటూరునాగారం సమావేశ మందిరంలో ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, ఎస్పీ శబరిష్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, ఏ ఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలసి అధికారులతో భారీ వర్షాలు, వరదల పై సంసిద్ధత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె శశంకా మాట్లాడుతూ భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద వల్ల ఎక్కడ కూడా ప్రాణనష్టం సంభవించకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా జిల్లాలో గోదావరి, జంపన్న వాగు ప్రవాహ ప్రాంతాలు ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ ఆస్కారం ఉన్నందున, ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. గోదావరి, జంపన్న వాగు, రామప్ప, లక్నవరం పరీవాహక ప్రాంతాలతో పాటు కాలువలు, చెరువులు, ఇతర జలాశయాలలో చేపలు పట్టడానికి ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహా, ఆయా శాఖలు సన్నద్ధమై ఉండాలని, క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. వరద జలాలు ప్రవహించే ప్రాంతాల మీదుగా ప్రజలు రాకపోకలు సాగించకుండా నిషేధం విధించాలన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎక్కడ కూడా చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా పరిస్థితులను పర్యవేక్షించాలని అన్నారు. అన్ని ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఔషధ నిల్వలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎక్కడ కూడా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు, అతిసారం వంటివి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసే చేయాలని, శానిటేషన్ మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్, ఐటిడిఏ కార్యాలయాలలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. అంతకముందు దొడ్ల, కొండాయి బ్రిడ్జిని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె శశంకా పరిశీలించారు. అనంతరం రామన్నగూడెం లో గోదావరి నది వరద ఉధృతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఏపీఓ వసంత రావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**

**భూపాలపల్లి, జూలై 28 (జనం సాక్షి):** ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజావాణిలో ప్రజలు 59 దరఖాస్తులను అందచేశారని తెలిపారు. దరఖాస్తులు నిశితంగా పరిశీలించి పెండింగ్ ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యలు నిమిత్తం ఎండార్స్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కల్లెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలి

**ఓపికి వచ్చే పెషేంట్ లకి పరీక్షలు చేయండి**

**యూరియా అమ్మకాలు పక్కాగా ఉండాలి**

**కొరత సృష్టిస్తే చర్యలు**

**జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జనగామ ప్రతినిధి, జూలై 28(జనంసాక్షి):** సీజనల్ వ్యాధుల నేపథ్యంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని 24 గంటలు ఆస్పత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. సోమవారం జనగాం మండలంలో ని ఓబుల్ కేశవపూర్ లోని పీహెచ్ సి ని కలెక్టర్ సందర్శించి.. ఏఎన్సీ రిజిస్ట్రేషన్స్, ఎన్సీడీ పోర్టల్ అప్డేట్, చిన్న పిల్లల సీజనల్ వ్యాధులకు సంబందించిన మెడిసిన్స్ నిల్వ లని పరిశీలించారు. అనంతరం వైద్య అధికారులతో మాట్లాడుతూ... నార్మల్ డెలివరీస్ ని ప్రోత్సహించాలని, ఓపి సేవలు పెంచాలని, టీబీ ముక్త్ భారత్ లో భాగంగా స్క్రీనింగ్, ఎక్స్ రే సేవలు అందించాలన్నారు. ఈడీడీ కేసులను ఫాలోప్ చేయలని....ఫీవర్ క్యాంప్స్ పెంచాలని....డెంగ్యు కేసులు నివారించాలన్నారు. చిన్న పిల్లలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవలన్నారు. అనంతరం పీహెచ్సి ఆవరణలో వన మహోత్సవం లో భాగంగా కలెక్టర్ మొక్కను నాటారు. అనంతరం మన గ్రోమోర్ ఫర్టిలైజర్ షాపును సందర్శించి... ఇప్పటివరకు జరిగిన యూరియా అమ్మకాల రిజిస్టర్ లను పరిశీలించి...అమ్మకాల వివరాలు సవివరంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా లో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని... అనవసరం గా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, ఎంపీడీఓ, మెడికల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, మత్తు మందులు సరఫరా

**నలుగురు అరెస్ట్**

**నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా వెల్లడి**




**నిర్మల్ బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :** నిషేధిత గంజాయి మరియు ఎటువంటి అర్హత గానీ లైసెన్సు గానీ లేకుండా ఉపయోగించే మత్తు మందులను (ఇంజక్షన్ల రూపంలో) యువతకు సరఫరా చేస్తూ, వారిని మత్తుకు బానిసలుగా మారుస్తున్న నలుగురు వ్యక్తులను నిర్మల్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అదనంగా మత్తు పదార్థాలకు అలవాటుపడిన ముగ్గురు వ్యక్తులపై బైండోవర్ చర్యలు తీసుకున్నారు. షేక్ మతినొద్దిన్, మొహమ్మద్ పర్వేజ్, షేక్ అద్నాన్, సయ్యద్ షాన్వాజ్‌లను అరెస్ట్ చేశామని తెలిపారు. నిషేధిత మత్తు మందులను వివిధ హాస్పిటల్స్ నుండి దొంగిలించి యువతలో మత్తుకు అలవాటు చేసే విధంగా సరఫరా చేస్తూ, మత్తు పదార్థాల ద్వారా డబ్బు సంపాదించేందుకు ప్రయత్నించారని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, నిర్మల్ పట్టణంలోని బైల్ బజార్ మార్కెట్ యార్డు ప్రాంతంలో నిందితులను పట్టుకొని, వారి వద్ద నుండి 100 గ్రాముల నిషేధిత గంజాయి, మత్తు మందు ఇంజక్షన్లు, సిరంజీలు, ఒక ఆటో, మొబైల్ ఫోన్లు సిజ్ చేశామని ఏఎస్పీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ అజయ్ చౌహాన్, రవి హెడ్ కానిస్టేబుల్, అవినాష్ కానిస్టేబుల్ లను నిర్మల్ ఏ.ఎస్పీ రాజేష్ మీన అభినందించారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలి**

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ బ్యూరో, జులై 28 (జనంసాక్షి) :** ప్రతిష్టాత్మక ప్రభుత్వ పథకాల అమలు పక్కాగా జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఎరువులు-విత్తనాల దుకాణాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, రేషన్ కార్డుల జారీ, వనమహోత్సవం, ఫీవర్ సర్వేలు, వెటర్నరీ క్యాంపులు, పీఎం ఆవాస్ యోజన వంటి కార్యక్రమాలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో మండలాల్లో అధికారులు సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు వైద్య, పంచాయతీ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం అవసరమని చెప్పారు. బాధితులకు వెంటనే వైద్యం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి శుక్రవారం స్కూల్ డే నిర్వహించాలని, వంటకాలు మెనూ ప్రకారం తయారవుతున్నాయా, కూరగాయల నాణ్యత, వంట సరుకుల పరిశుభ్రత వంటి అంశాలను ప్రత్యేక అధికారులు పరిశీలించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతున్నదని, గ్రౌండింగ్ ప్రక్రియను మరింత ముమ్మరంగా చేపట్టాలని సూచించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సమన్వయంతో పరిష్కరించాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య**



**మంచిర్యాల ప్రతినిధి జూలై 28 (జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జన్నారం, దండేపల్లి మండల వాసులు లక్షెట్టిపేట నుండి దండేపల్లి, జన్నారం మీదుగా నిర్మల్, ఆదిలాబాద్ రాష్ట్ర రహదారులపై పగటివేల భారీ వాహనాల రాకపోకలపై రాష్ట్ర అటవీ శాఖ విధించిన నిషేధాన్ని ఎత్తివేసేలా చర్యలు తీసుకొని మండలాల అభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కన్నెపల్లి మండలం కన్నెపల్లి గ్రామస్తులు కన్నెపల్లి, ముత్తాపూర్, అంకన్నపేట శివారులలో గల సీలింగ్, అసైన్డ్, ఇనాం, లావుని, ప్రభుత్వ భూములను పొందిన వాటికంటే ఎక్కువగా భూమి అనుభవిస్తున్న వారి భూముల కొలతలు చేయించి నిరుపేదలైన తమకు వ్యవసాయం చేసుకునేందుకు జీవనాధారం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం టేకుల బస్తీకి చెందిన తోట పోచన్న తనకు గల భూమిలో వేరొక వ్యక్తి ఇల్లు ఉన్నట్లుగా తప్పుడు సమాచారంతో ఇంటి నెంబరు పొంది పట్టా తీసుకున్నాడని, ఈ విషయమై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన బొమ్మ శ్రీనివాస్ తన తండ్రి పేరిట కాంబోజి పేట శివారులో భూమి ఉందని, ఇట్టి భూమిని తమకు తెలియకుండా వేరొకరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తన పేరిట విరాసత్ పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన ముక్కిడి మల్లయ్య, ఏనుగు జనార్దన్ రెడ్డి రాళ్లవాగు ప్రాజెక్టు క్రింద కాలువ నిర్మాణం లో తమ భూమి పోయిందని, నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తులు అందజేశారు. బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన రాదండి లావణ్య తన పేరిట చెన్నూర్ శివారులో గల భూమిలో కొందరు అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం ధర్మరావుపేట గ్రామస్తులు తమ దరఖాస్తులో తమ గ్రామ ఊర చెరువుకు చేపల పెంపకానికి వేలం పాట నిర్వహించాలని కోరారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన మొహమ్మద్ నిక్షత్ తబస్సుమ్ తాము 12 సం.ల క్రితం పెద్దపల్లి పట్టణానికి వచ్చామని, తమ రేషన్ కార్డు బదిలీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 72 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు.

# పాత్రికేయులు విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలను రాయాలి

**వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి**



**వరంగల్ ప్రతినిధి, జూలై 28 జనంసాక్షి):** పాత్రికేయులు, విశ్వసనీయతతో కూడిన విశ్లేషణాత్మక వార్తలను రాయాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. సోమవారం రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని కరీంబాద్ లో గల తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో వరంగల్ జిల్లా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజులపాటు నిర్వహించిన వృత్తి నైపుణ్యత శిక్షణ ముగింపు కార్యక్రమానికి అదనపు కలెక్టర్, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ నిజనిర్ధారణ జర్నలిజంలో ఒక ముఖ్యమైన భాగమనీ, జర్నలిస్టులు కచ్చితంగా నిజాలను నిర్ధారించుకున్న తర్వాతే నిర్భయంగా వార్తలు రాయాలన్నారు. జర్నలిస్టులు వార్తల గురించి సమగ్ర పరిశోధన చేసి మూలాలను తనిఖీ చేసి, సమాచారం యొక్క ఖచ్చితత్వాన్ని నిర్ధారించి తదుపరి వార్తలు రాయాలన్నారు. జర్నలిస్టులు వృత్తిపరమైన నియమాలను పాటించాలన్నారు. ఖచ్చితమైన నమ్మదగిన సమాచారం అందించడం ద్వారా జర్నలిస్టు సమాజానికి సేవ చేసిన వారు అవుతారు అన్నారు. నైతిక విలువలు పారదర్శకత కలిగిన వార్తలు రాసినప్పుడే జర్నలిస్టులపై ప్రజలకు గౌరవం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగంలో వార్తల సేకరణ సులభమవుతుందన్నారు. భవిష్యత్తులో పత్రికల నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించనుందన్నారు. జెడ్పి సీఈఓ రామిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు పక్షపాతం లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తూ వార్తలు సేకరించాలన్నారు. జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండాలని తెలిపారు. రెండో రోజు జరిగిన శిక్షణ తరగతుల్లో 99 టీవీ స్టేట్ బ్యూరో తోట భావనారాయణ గ్రామీణ వార్తలు, ఎలక్ట్రానిక్ మీడియాపై వివరించారు. పరిశోధనాత్మక కథనాల చీఫ్ ఎడిటర్ ఉడుముల సుధాకర్ రెడ్డి పరిశోదాత్మక కథనాలు, నేర వార్తలు, ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్ తదితర అంశాల గురించి కూలంకశంగా వివరించగా, దిశ దినపత్రిక చీఫ్ ఎడిటర్ మార్కండేయ వార్త కథనాలు, ప్రత్యేక కథనాలను రాసే సమయంలో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాల గురించి వివరంగా తెలిపారు. అనంతరం శిక్షణ తరగతులకు హాజరైన పాత్రికేయులకు ముఖ్య అతిధులు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేష్ రెడ్డి, డబ్ల్యూ జే ఐ జే యు అధ్యక్షులు శ్రీరామ్ రామచందర్, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, డి పి ఆర్ ఓ అయూబ్ అలీ, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ డాక్టర్ వరుణ్, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుని సస్పెన్షన్ ఎత్తివేయాలి

**బీఆర్ఎస్వీ రాస్తారోకో**



**చెన్నూర్, జూలై 28 (జనంసాక్షి) :** పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద టిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుని సస్పెన్షన్ ఎత్తివేయాలని రాస్తారోకో నిర్వహించారు. కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కుర్చీలు విరాళంగా అందించిన నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు సహకరించారని ఆర్కే ప్రసాద్ ను సస్పెండ్ చేసి కొంతమంది ఉపాధ్యాయులకు నోటీసు లు అందించాలని సస్పెండ్ చేసిన ఉపాధ్యాయుని విధుల్లోకి తీసుకునేంతవరకు ఆందోళన కార్యక్రమం చేపడతామని బీష్మించడంతో పోలీసులు రాస్తారోకోను అడ్డుకొని బి ఆర్ ఎస్ వి నాయకులను పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి



**నల్గొండ బ్యూరో, జూలై 28 (జనం సాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో మాట్లాడుతూ విపత్తు నిర్వహణకు సంబంధించి ఆయా శాఖలు వారి కార్యాచరణ ప్రణాళికను వారం రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. అలాగే ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని, ఒకవేళ సమస్య పరిష్కారం కానట్లయితే సంబంధిత ఫిర్యాదుదారుకి తెలియజేయాలని, డివిజన్, మండల, గ్రామస్థాయిలో సైతం ఇదేవిధంగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. కాగా ఈ సోమవారం 130 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 61, రెవెన్యూ శాఖకు 69 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

# కరీంనగర్ - జగిత్యాల విస్తరణ పనులను ప్రారంభించండి

- తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులను మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన బండి సంజయ్
- రూ.113 కోట్లతో సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను అందజేసిన బండి సంజయ్

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్ - జగిత్యాల విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజప్తి చేశారు. సోమవారం రోజు న్యూఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన బండి సంజయ్ కుమార్ కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులతోపాటు సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ (సీఆర్ఐఎఫ్) మంజూరు అంశాలపైనా చర్చించారు. కరీంనగర్ నుండి జగిత్యాల వరకు 4 లేన్ విస్తరణ కోసం గత ఎన్నికలకు ముందే కేంద్రం రూ.2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయా ప్రతిపాదనలకు ఆమోదం పొందడంతోపాటు టెండర్ ప్రక్రియను ప్రారంభిస్తామని అధికారులు నేటికీ టెండర్ ప్రక్రియ ప్రారంభం కాని విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులను పిలిపించిన గడ్కరీ అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకుల నేపథ్యంలోనే కరీంనగర్- జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం ఆయా అడ్డంకులన్నీ అధిగమించి నివేదికను కమిటీకి పంపించామని తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన వెంటనే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి అతి త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు. అనంతరం బండి సంజయ్ తెలంగాణలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్ లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) ను విడుదల చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీంతోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. మొత్తం రూ.113 కోట్లతో కూడిన సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట-ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణంతోపాటు గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి-పోతూర్ రోడ్డు విస్తరణ



పనులు వీటిలో ఉన్నాయి. దీంతోపాటు చందుర్తి నుండి మోత్కురావుపేట వరకు (కిమీ 5/0 నుండి 8/450 వరకు) వంతెనల నిర్మాణ పనుల ప్రతిపాదనలు ఉన్నాయి. అట్లాగే కిస్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణ పనులు, శంకరపట్నం మండలంలోని అర్కాండ్ల (గ్రామం) నుండి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హై లెవల్ బ్రిడ్జ నిర్మాణ ప్రతిపాదనలు సైతం వీటిలో ఉన్నాయి. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులు విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# శాంతినగర్ ఎస్టీపి లైన్ సమస్యను సత్వరమే పరిష్కరించండి

- పిఎసి చైర్మన్ అరికపూడి

**శేరిలింగంపల్లి, జూలై 28 (జనంసాక్షి) :** చందానగర్ డివిజన్ పరిధి దీప్తిశ్రీ నగర్ మరియు శాంతి నగర్ కాలనీల మధ్య గల సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్టిపి) లైన్ లో తలెత్తిన సమస్య సమస్య సత్వర పరిష్కారానికై జలమండలి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ అన్నారు. ఈ మేరకు శాంతినగర్ మరియు దీప్తి శ్రీనగర్ మధ్య ఉన్న ఎస్టిపి ప్లాంట్ వద్ద సూపర్ సక్కర్ యంత్రం తో చేపడుతున్న పునరుద్ధరణ పనులను సోమవారం సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, జలమండలి అధికారులతో కలిసి ఆరెకపూడి పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ దీప్తి శ్రీ నగర్ మరియు శాంతి నగర్ కాలనీల మధ్య సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు లైన్ లో తలెత్తిన సమస్యను సూపర్ సక్కర్ యంత్రం ద్వారా పరిష్కరించడానికి కృషి చేస్తున్నారని, ఎస్టిపి లైన్ లో పేరుకుపోయిన చెత్త చెదారం ను తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని జలమండలి అధికారులను అరికపూడి కోరారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్ గాంధీ ఆశాభవం వ్యక్తం చేశారు. సివరేజ్ ప్లాంట్ లైన్



సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరలోనే చూపుతామని, ఔట్ లెట్ సరిగ్గా లేకపోవడం వలన, కొంతమేర చెత్తాచెదారంతో కుంచించుకోపోవడం జరిగిందని, అందువల్లనే కాలనీలో మురుగు సమస్య తీవ్రమైందన్నారు. ఔట్ లెట్ ను సరి చేసి డ్రైనేజి సమస్య ను త్వరితగతిన పరిష్కరించాలని, కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనితీరు తగ్గిపోవడంతో పరిసర ప్రాంతాల, కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, శాశ్వత పరిష్కారదిశగా ఎస్టిపి లైన్‌ను పునరుద్ధరించి త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరాన్ని అరికపూడి గుర్తు చేశారు. శాంతినగర్, దీప్తి శ్రీనగర్ తో పాటు ఇతర ప్రాంతాలలో సైతం సూపర్ సక్కర్ మిషన్ ద్వారా ప్రతి మ్యాన్ హెూల్ లో చెత్తాచెదారం లేకుండా పూడిక తీసి, నీటి ప్రవాహం సాఫీగా సాగేల చూడాలని, అవసరమున్నచోట మ్యాన్ హెూల్స్ మరమ్మత్తులు చెపట్టి అందుబాటులోకి తీసుకోవాలని జలమండలి అధికారులకు గాంధీ విజ్ఞప్తి చేశారు. కాలనీ వాసులకు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని, ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ప్రతి కాలనీ లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, శేరిలింగంపల్లి నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అగ్రగామి నియోజకవర్గం గా తీర్చిదిద్దుతామని అరికపూడి భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి విభాగం జిఎం వాస సత్యనారాయణ, డిజిఎం భార్గవి, మేనేజర్ శిరీష, నాయకులు సందీప్ రెడ్డి, సాదిక్, నరేందర్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 28 (జనంసాక్షి) :** మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు.ఆదివారం రాత్రి జిల్లా కేంద్రం తాళ్లగడ్డలో కిరాణా అండ్ ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ భవన్ ఎదురుగా నరసింహ పెయింటింగ్ షాపును ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల మన్నలను పొందినప్పుడే వ్యాపార సంస్థలు అభివృద్ధి బాటలో నడుస్తాయని అన్నారు.అనంతరం నిర్వాహకులు కనుకు రేణుక మాట్లాడుతూ తమ వద్ద అన్ని రకాల పెయింటింగ్స్ లభిస్తాయని తెలిపారు.సూర్యాపేట పట్టణ,పరిసర ప్రాంత ప్రజలు తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్,మాజీ జడ్పీటీసీ జీడిబిక్షం,నాయకులు కక్కిరేణి నాగయ్య, కోటేష్, రాజు, రాంబాబు, అనిల్, సతీష్, రాజు, నాని, మహేష్, మహేందర్, గోపి, రాజు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



**అమరచింత, జూలై 28 (జనంసాక్షి) :** సోమవారం మండలంలోని పామిరెడ్డి పల్లె కేజీబీవీలో కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజేషన్‌కై జిల్లా ఉపాధ్యక్షులు సి. రాజు మాట్లాడుతూ దశాబ్దాలుగా కాలం గా పనిచేస్తున్న కనీస వేతనాలు లేకుండా ఎక్కువ పని గంటలకు చేస్తూ కేజీబీవీ వర్కర్స్ శ్రమదోపిడికి గురవుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నాడు ఇచ్చిన మాట కార్మికులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చిందని హామీ దృష్ట్యా కార్మికుల అందరిని రెగ్యులర్ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. పెన్షన్ 9000 ఇవ్వాలి, కేజీబీవీ వర్కర్స్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రమోషన్ లేకుండా మగ్గిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు,ఏ విధమైన జీవోలను నాన్ టీచింగ్ సిబ్బందికి అమలు కావడం లేదని ఇందులో తీవ్ర వివక్ష ఎదుర్కొంటున్నారన్నారు. పని భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ, పిఎఫ్, హెల్త్ స్కీములు మరియు ప్రమాద బీమా లాంటి న్యాయమైన హక్కుల సాధనకు కోసం కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న జరిగే జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కాంట్రాక్ట్ వర్కర్లు కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి,యు, సి, ఐ, జిల్లా నాయకులు ఏ, సామెలు,కేజీబీవీ వర్కర్స్ అనురాధ, శోభ, నందిని, చంద్రకళ,అంజనమ్మ, తహెరా,విమల, హాబిభ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

- ప్రజావాణి కార్యక్రమానికి 146 దరఖాస్తులు
- సీజనల్ వ్యాధులపై ప్రజలకి అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జూలై 28 (జనంసాక్షి) :** సీజనల్ వ్యాధులపై ప్రజలకి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాలలో, వార్డులలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేయాలని అన్నారు.ప్రజావాణి అర్జీలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని, ప్రతి అర్జీకి సంబంధించి కచ్చితమైన సమాధానంతో కూడిన కాపీని అర్జీదారునికి పంపాలని తెలిపారు.అలా చేయకపోతే ప్రజలు ఒకే సమస్యకి మరలా దరఖాస్తు చేయటం జరుగుతుందని తెలిపారు.ప్రజావాణి లో భూ సమస్యలకి సంబంధించి 107 దరఖాస్తులు, పంచాయతీ రాజ్ శాఖకి 11 దరఖాస్తులు,మున్సిపల్ కమిషనర్లకి 9 దరఖాస్తులు, ఇతర శాఖలకి సంబంధించి 19 దరఖాస్తులు వచ్చాయని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 146 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించుటకు సంబంధిత అధికారులకి పంపించటం జరిగిందని



తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిఈఓ అశోక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిసిఓ పద్మ, డిఎస్ఓ మోహన్ బాబు,సంక్షేమ అధికారులు దయానంద రాణి, శ్రీనివాస నాయక్, శంకర్,జగదీశ్వర రెడ్డి, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు సాయి గౌడ్,సంతోష్ కిరణ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజాధనం వృథా..

- అర్హత అనుభవం లేని కాంట్రాక్టర్లతో పని చేయిస్తే ప్రజలకు నష్టం..
- శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుంటున్న నాయకులు..

**మణుగూరు, జూలై 28 (జనం సాక్షి) :** సరైన అవగాహన లేని కాంట్రాక్టర్లచే మురికి కాలువలు డివైడర్స్, సిసి రోడ్లు, తారు రోడ్డు నిర్మించడం జరుగుతోంది. దీనివల్ల వర్షాకాలంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి దీనికి తోడు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. స్నేహభావంతో సామాజిక ప్రీతితో ఎలాంటి అర్హత లేని వారికి లక్షల్లో కాంట్రాక్టు పనులు ఒప్ప చెబుతున్నారు. అనుభవం కలిగిన అధికారులు ఉన్నప్పటికీ వారి సలహాలు సూచనలు పాటించకుండా ఇస్తారాజ్యంగా కాంట్రాక్టర్లు పనులు చేపడుతున్నారు దీంతో నిర్మించిన మూన్నాళ్లకే బీటలు పడి పోతున్నాయి. నాసిరకంగా పనులు చేయడం వల్ల ఏదైనా సమస్య వచ్చినప్పుడు తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల సమస్య ఎప్పటికీ తీరదు. ఎన్నిసార్లు సమస్యలు వచ్చినా తాత్కాలికంగా చేయటానికి మొగ్గుచూపుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం అయ్యే పరిస్థితి కనిపించడం లేదు దీనివల్ల కాంట్రాక్టర్లు లాభ పడుతున్నారు. ప్రజాధనం వృధా అవుతుంది ప్రజలు నష్టపోతున్నారు.

### మురికి కాలువల నిర్మాణం

పని విలువ పట్టి కాంట్రాక్టర్ గ్రేడ్ నిర్ణయించబడుతుంది. ఆ ప్రాంత పరిస్థితిని బట్టి కాలువ వెడల్పు ,లోతు నిర్మించాలి. ఐరన్, సిమెంటు ఏ ఏ పనికి ఏ గ్రేడ్ (సిమెంట్ 43,53, ఐరన్ ఎం ఎం)



వాడాలో తెలియాలి. దాన్నిబట్టి టెండర్ వేయగలుగుతారు. కానీ డబ్బు లేదా పలుకుబడి ఉన్న కాంట్రాక్టర్లకి పని ఇవ్వడం వల్ల పనిలో నాణ్యత లోపిస్తుంది. మురికి నీటి ప్రవాహ వేగాన్ని బట్టి కాలువ వెడల్పు లోతు వాలును(1 నుంచి 2 శాతం) నిర్ణయించాలి. రోడ్డు మీద పడిన నీరు కాలువలకు చేరే విధంగా కాలువ నిర్మాణం చేపట్టాలి. అలా చేయకపోవడం వల్ల రోడ్డుపైనే నీరు నిలుస్తోంది. తద్వారా రోడ్డు గుంతలు ఏర్పడి చెడిపోతుంది. కాలువ పైకి ఉండి రోడ్డు దిగువ ఉంటే వర్షపు నీరు కాలువక చేరదు. దీనివల్ల కాలువ నిర్మించి వృధా అవుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇలాంటి సమస్య వల్లే వర్షాకాలంలో రహదారి మీదుగా నీరు ప్రవహిస్తుంది. ఈ తప్పుకు ఎవరు బాధ్యులు ఎప్పటికీ పరిష్కారం అవుతుందో ప్రశ్నార్ధకమే...

### తారు, సీసీ రోడ్డు నిర్మాణం

రహదారి నిర్మించాలంటే సహజంగా మట్టి కంకర తారు వేస్తారు. ఇదే ప్రస్తుతం మన వాళ్ళు చేసేది.. వాస్తవంగా రహదారి పొడవు వెడల్పు ఎత్తు పల్లాలు దృష్టిలో పెట్టుకొని ముందుగా మట్టితో లెవెల్ చేయాలి. ఆ తర్వాత రోడ్డు బలంగా ఉండటానికి బేస్ కోట్ (కంకర) తో వేయాలి. దీనిపై బైండర్ కోట్ అనగా తారు ఇతర పదార్థాలతో వేయటంతో కంకరను బంధిస్తుంది. దీనివల్ల భారీ వాహనాలు వెళ్లినప్పుడు రహదారి కుంగి పోకుండా ఉంటుంది. తారుపై టాప్ కోట్ అనగా మృదువుగా ఉండటానికి పొడి లేదా పౌడర్ వేస్తారు. ఇలా తారు రోడ్డు పూర్తవుతుంది. ముందుగానే కాలువ నిర్మిస్తే రోడ్డుపైనే ఉండే నీరు కాలువకు చేరే విధంగా రహదారి నిర్మించాలి. ఒకవేళ రోడ్డు అలా నిర్మించకపోవడం వల్ల వర్షపు నీరు ఎటు వెళ్లక రహదారి పైనే నిలిచిపోతుంది. అనుభవం కలిగిన కాంట్రాక్టర్ ఇరుపక్కల చివరి భాగాన కాంక్రీట్ తో కర్బలు, గట్టర్ లను నిర్మిస్తారు. వీటివల్ల రోడ్డుకు రక్షణతో పాటు వర్షపు నీరు నేరుగా కాలువకు చేరుతుంది. మణుగూరులో ఇదే సమస్య ప్రతి ఏడాది పునరావృతం అవుతుంది. మురికి కాలువలు ఎత్తుగా ఉండి తారు రోడ్డు కిందికి ఉండడంతో రహదారిపై నీరు నిలిచిపోతుంది. అర్హత అనుభవం లేని కాంట్రాక్టర్లచే తారు రోడ్డు వేయటం వల్ల ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్య తీరాలంటే మళ్ళీ తారు రోడ్డు ఎత్తును పెంచాల్సి వస్తుంది ఇది సాధ్యమేనా..??

ఏ పనైనా పక్క ప్రణాళికతో నిబంధనలకనుగుణంగా నిర్మాణం చేస్తే ఎలాంటి నష్టం వాటిల్లదు ఒక పనికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే దానికి అనుగుణంగా కాంట్రాక్టర్లు పనిచేయాలి. పైన చెప్పిన విధంగా చేయకపోవడం వల్ల ప్రజాధనం వృధా అవుతుంది. మొదటిసారి చేపట్టే పనిలో నాణ్యత లోపం లేకుండా చేస్తే భవిష్యత్తులో ఇలాంటి సమస్య తలెత్తదు. కానీ నిబంధనలకు విరుద్ధంగా చేయటం వల్ల ఒకటే పనిని మళ్లీమళ్లీ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు అధికారులకు అవమానం ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోంది. ఈ తప్పు నాయకులదా .. అధికారులుదా కాంట్రాక్టర్లదా..? ఏది ఏమైనా చివరికి నష్టపోయేది ప్రజలే...

## జీవో నెంబర్ 25 సర్దుబాటు అశాస్త్రీయమైనది

- ఎస్.టి.యు.టి.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తహేర్



**జడ్చర్ల, జులై 28 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడున్న విద్యార్థుల సంఖ్య ప్రకారం జీవో నెంబర్ 25 సర్దుబాటు అశాస్త్రీయమైనదని ఎస్.టి.యు.టి.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తహేర్ అన్నారు. జిల్లాల వారీగా జీవో నెంబర్ 25 సర్దుబాటు ఉపసంహరించుకోవాలని కోరుతూ ఎస్.టి.యు.టి.ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తాహిర్ మాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్మెంట్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను నాశనం చేస్తున్నారని, ఇంగ్లీష్, తెలుగు మీడియం ఉన్నత పాఠశాలలో విజయవంతంగా నడుస్తున్నాయని, ప్రతి పాఠశాలలో పది సెక్షన్ల ప్రకారం విద్యార్థులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్య పరంగా కాకుండా మీడియం వైస్ గా లాంగ్వేజ్ పండితులు డబుల్ పాట్రన్ ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, డబుల్ పాట్రన్ వల్ల విద్యార్థులకు న్యాయం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వే ప్రకారం సర్వే ప్రకారం తెలంగాణ రాష్ట్రం భాషా నైపుణ్యంలో 26వ స్థానంలో ఉందని, గతంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు 40 దాటితే మూడు పోస్టులు ఉండేవి, ఇప్పుడు వన్ ఈస్ట్ 20 విధానాన్ని పాటించాలని, అందుకు వెంటనే సర్దుబాటు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిపిఆర్టియు అధ్యక్షులు శ్యాంబాబు, ఎస్ఎల్టిఈ అధ్యక్షులు సురేంద్రనాథ్, ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సలాం ఖాన్, తాహీర్ బిన్ తదితరులు పాల్గొన్నారు.




# టెస్లా బాటలోనే విన్‌ఫాస్ట్

**త్వరలో భారత్ రానున్న వియత్నాం ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ**



**జనంసాక్షి:**భారత్‌లో టెస్లా అరంగేట్రం చేసిన కొన్ని రోజుల్లోనే వియత్నాం ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియాలో తన మొదటి షోరూమ్‌ను గుజరాత్‌లోని సూరత్‌లో ప్రారంభించింది.సూరత్‌లోని పిప్లోద్‌లో 3,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ ఫెసిలిటీ ప్రొడక్ట్ ఎక్స్‌పీరియన్స్, వాహన అమ్మకాలు, సర్వీస్ సపోర్ట్‌ను అందిస్తుందని కంపెనీ తెలిపింది. ఈ షోరూమ్‌లో విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలు వీఎఫ్ 6, వీఎఫ్ 7లను ప్రదర్శిస్తుంది. విన్‌ఫాస్ట్ వీఎఫ్ 7, వీఎఫ్ 6 మోడళ్లలో రైట్‌హ్యాండ్ డ్రైవ్ వెర్షన్‌ను మొదటిసారి ఇండియాలోనే విడుదల చేస్తున్నట్లు చెప్పింది. ఈ ఏడాది చివరి నాటికి 27 నగరాల్లో 35 డీలర్‌షిప్‌లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. విన్‌ఫాస్ట్ తన ప్రీమియం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీల కోసం 2025 జులై 15న అధికారికంగా బుకింగ్‌లను ప్రారంభించింది. ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ల్లో లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా రూ.21,000 పూర్తిగా రీఫండబుల్ అమౌంట్‌తో బుక్ చేసుకోవచ్చని చెప్పింది.తమిళనాడులోని తూత్తుకుడిలో రాబోయే రోజుల్లో విన్‌ఫాస్ట్ ఏర్పాటు చేయనున్న కర్మాగారంలో ఈ వాహనాలను స్థానికంగా అసెంబుల్ చేస్తామని పేర్కొంది. విన్‌ఫాస్ట్ ఆసియా సీఈఓ ఫామ్ సాన్ చౌ మాట్లాడుతూ..'భారతీయ వినియోగదారులకు విన్‌ఫాస్ట్ డ్రైవింగ్ అనుభవాన్ని చేరువ చేయబోతున్నందుకు సంతోషిస్తున్నాం' అని చెప్పారు. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 2020లో కేవలం 5,000 యూనిట్ల నుంచి 2024 నాటికి 1,13,000 యూనిట్లకు పుంజుకుంది. ప్రస్తుతం మొత్తం కార్ల అమ్మకాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 3 శాతం కంటే తక్కువగా ఉండగా, 2030 నాటికి ఈ వాటాను 30 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఇన్వెస్టర్లను ఊరిస్తున్న సరికొత్త కొత్త ఫండ్‌లు

**జనంసాక్షి:**మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్.. స్పెషల్ అపార్చునిటీస్ ఫండ్ పేరుతో న్యూ ఫంఢ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో)ను ప్రకటించింది. ఆగస్ట్ 8తో ముగుస్తుంది.తిరిగి ఆగస్ట్ 21 నుంచి పెట్టుబడులకు అందుబాటులోకి వస్తుంది. వ్యాపార పరంగా ప్రత్యేక అవకాశాలను చూస్తున్న కంపెనీల్లో ఈ పథకం పెట్టుబడులు పెడుతుంది. కార్పొరేట్ స్థాయిలో కంపెనీ వ్యాపారాల విభజన, విలీనాలు, కొనుగోళ్లు, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, ఏదైనా రంగాల్లో కొత్తగా అవకాశాలు ఏర్పడుతుండడం, నియంత్రణపరమైన మార్పులను అవకాశాలుగా మలుచుకుని ఇన్వెస్ట్ చేస్తుంది.కనీసం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పెట్టుబడిని మొదటి మూడు నెలల్లో వెనక్కి తీసుకుంటే 1% ఎగ్జిట్ లోడ్ చార్జ్ పడుతుంది. ఆ తర్వాత ఉపసంహరణపై ఎలాంటి చార్జీలుండవు. ఈ పథకంలో రిస్క్ ఎక్కువ. నిఫ్టీ 500 టీఆర్ఐ ఈ పథకం పనితీరుకు ప్రామాణికం. అజయ్ ఖండేల్‌వాల్, అతుల్ మెహ్రా, బాలచంద్ర షిండే, రాకేశ్ శెట్టి, సునీల్ సావంత్ ఫండ్ మేనేజర్లుగా సేవలు అందించనున్నారు.జెరోధా మ్యూచువల్ ఫండ్ కొత్తగా జెరోదా మల్టీ అస్సెట్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్)ను ప్రారంభించింది. ఈక్విటీ, డెట్ ఇండెక్స్ ఫండ్స్/ఈటీఎఫ్‌లు, కమోడిటీ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఆగస్ట్ 8న ఎన్‌ఎఫ్‌వో ముగుస్తుంది. ఐదు పనిదినాల అనంతరం తిరిగి క్రయ, విక్రయాలకు అందుబాటులోకి వస్తుంది. ఈక్విటీ, డెట్, కమోడిటీల్లో పెట్టుబడులకు ఈ పథకం వీలు కల్పిస్తుంది.పోర్ట్‌ఫోలియోకి రిస్క్, అస్థిరతలు తగ్గించడం ప్రధాన ధ్యేయం. ముఖ్యంగా 50-70 శాతం పెట్టుబడులను ఈక్విటీ ఈటీఎఫ్/ఇండెక్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. 10-20 శాతం డెట్ ఈటీఎఫ్/ఇండెక్స్ ఫండ్స్, 20-30 శాతం కమోడిటీ ఈటీఎఫ్‌లకు (బంగారం, వెండి) కేటాయిస్తుంది. పెట్టుబడులను వివిధ సాధనాల మధ్య వైవిధ్యం చేసుకోవాలని చూసే వారి కోసం ఈ పథకం తీసుకొచ్చినట్టు తెలుస్తోంది.




## అమ్మకాల ఒత్తిడి.. బేర్‌మన్న మార్కెట్లు

బ్యాంకింగ్, ఐటీ, రియల్టీ కౌంటర్లలో అమ్మకాల ఒత్తిడితో బెంచ్ మార్క్ భారతీయ ఈక్విటీ సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 572.07 పాయింట్లు (0.70 శాతం) క్షీణించి 80,891 వద్ద స్థిరపడగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 50 156.10 పాయింట్లు లేదా 0.63 శాతం క్షీణించి 24,680.90 వద్ద స్థిరపడింది.సెన్సెక్స్ అనుబంధ షేర్లలో హిందుస్తాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ మాత్రమే 1.23 శాతం వరకు లాభపడగా, మిగతావి నష్టాల్లో స్థిరపడ్డాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు 1.14 శాతం నుంచి 7.31 శాతం మధ్య నష్టాల్లో ముగిశాయి.నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీలు వరుసగా 1.26 శాతం, 0.84 శాతం నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా మినహా ఎన్‌ఎస్‌ఈలోని ఇతర సెక్టోరల్ ఇండెక్స్‌లన్నీ రెడ్‌లో స్థిరపడగా, నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ 4.26 శాతం నష్టంతో ముగిసింది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 4.25 | ₹ 4.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
| --- | --- |
| ₹ 91,600 (22 క్యారెట్లు) | ₹ 99,930 (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,26,000




## 'రాజీనామాలు మాత్రం చేయొద్దు'

దేశీయ అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 12,000 మంది ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు ప్రకటించింది. ఈ తొలగింపు మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగులపై ప్రభావం చూపనుంది.ఈ ప్రకటన ఐటీ రంగంలో ప్రకంపనలు సృష్టించింది. టీసీఎస్ ఉద్యోగుల తొలగింపు ప్రకటనను ఐటీ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈటీ నివేదిక ప్రకారం.. టీసీఎస్ తొలగింపులను చట్టవిరుద్ధమని ప్రకటించిన ఐటీ ఉద్యోగ సంఘాలు ఒత్తిడికి తలొగ్గి ఎవరూ రాజీనామా చేయొద్దంటూ టీసీఎస్ సిబ్బందికి సూచించాయి. అదే సమయంలో లేఆఫ్ ప్రణాళికలను ఉపసంహరించుకోవాలని, ప్రభావిత ఉద్యోగులను పునరుద్ధరించాలని కర్ణాటక స్టేట్ ఐటీ/ఐటీఈఎస్ ఎంప్లాయిస్ యూనియన్ టీసీఎస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది.రాజీనామా చేయాలని ఉద్యోగులపై ఒత్తిడి చేయొద్దని ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయిస్ (ఎఫ్ఐటీఈ) టీసీఎస్‌ను కోరింది. బాధితులకు నోటీస్ పీరియడ్ పేమెంట్స్, సెవెరెన్స్ బెనిఫిట్స్, ఏడాది పాటు ఇన్సూరెన్స్ కవరేజీని అందించాలని డిమాండ్ చేసింది. టీసీఎస్ ఆర్థికంగా పటిష్టంగా ఉండగా, అనిశ్చితులేవీ లేనప్పటికీ ప్రకటించిన ఈ తొలగింపులు పూర్తిగా లాభాపేక్షతో తీసుకున్న నిర్ణయాలేనని ఎఫ్ఐటీఈ పేర్కొంది.

## ఐటీఆర్ ఫైల్ చేస్తున్నారా? త్వరపడితే బెటర్!




**జనంసాక్షి:**ఉద్యోగులు, ఆదాయ పరిమితులు మించినవారు చాలా మంది ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేయాలని భావిస్తారు. అయితే ఆ ఐటీఆర్‌లను ఫైల్ చేసేందుకు అవసరమైన ధ్రువపత్రాలు ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలి. ఐటీఆర్ జులై 31 వరకు ఉండే ఐటీఆర్ ఫైలింగ్ చివరి తేదీని ప్రభుత్వం సెప్టెంబర్ 15 వరకు పొడిగించింది. కాబట్టి ముందుగా కింది ధ్రువపత్రాలను సిద్ధం చేసుకొని, ఫిలింగ్‌కు త్వరగా ఐటీఆర్ దాఖలు చేయాలి. వేతనంతోపాటు, టీడీఎస్ వివరాలు ఇందులో ఉంటాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి మారితే, పాత-కొత్త యాజమాన్యాల నుంచి ఫారమ్-16ను తప్పకుండా తీసుకోవాలి. ఇందులో పార్ట్-ఏ కింద టీడీఎస్ మినహాయింపు ఆ వివరాలు నమోదవుతాయి. పార్ట్-బీ కింద జీతభత్యాలు, మినహాయింపుల క్లెయిమ్ వివరాలు ఉంటాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీపై టీడీఎస్, బీమా కంపెనీ నుంచి కమిషన్‌కు సంబంధించిన వివరాల కోసం 'ఫారమ్-16ఏ'ని తీసుకోవాలి.ప్రాపర్టీ లావాదేవీ విలువ (రిజిస్టర్డ్) రూ.50 లక్షలకు మించినప్పుడు టీడీఎస్ అమలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి 'ఫారమ్-16బీ'ని కొనుగోలుదారుడు విక్రయదారుడికి జారీ చేస్తారు. నెలవారీ ఇంటి అద్దె రూ.50,000 మించితే, అప్పుడు సైతం టీడీఎస్ అమలు చేయాలి. కిరాయిదారుడు ఇంటి యజమానికి 'ఫారమ్-16సీ'ని అందిస్తారు. ఐటీఆర్ దాఖలు చేసే సమయంలో ఈ వివరాలు ముందుగానే నింపి ఉండటం గమనించాలి. వాటిని సరిపోల్చుకుని, అవసరమైతే అదనపు వివరాలు నమోదు చేసి సమర్పించాల్సి ఉంటుంది. షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను విక్రయించినప్పుడు స్వల్ప, దీర్ఘకాల మూలధన లాభాలు వస్తుంటాయి.

## ఆకలి చావులను ఆపండి

ఆకలి చావులను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.గాజాలో సంక్షోభానికి శాశ్వత పరిష్కారం.. ఇజ్రాయెల్ బందీలను వెనక్కి తీసుకురావడం, ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలను నిలిపివేయడం జరగాలని ఒబామా పేర్కొన్నారు. ఆకలితో అక్కడి అమాయక ప్రజలు చనిపోతున్నారని, దీనిని నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఒబామా పేర్కొన్నారు. గాజా స్ట్రిప్‌లోని బాధితులకు కలుసుకునేందుకు, వారికి సహాయం చేసేందుకు అనుమతులు ఉండాలన్నారు. వారికి ఆహారం, నీటిని దూరంగా ఉంచడం సమర్థనీయం కాదన్నారు. మరోవైపు గాజాలో పోషకాహార లోపం ఆందోళనకర స్థాయికి చేరుకున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది.

# భూమ్మీద దేన్నైనా ఫోర్జరీ చేస్తారు కదా?

● ఈసీకి 'సుప్రీం కోర్టు ' ప్రశ్న



**జనంసాక్షి:**బీహార్ ఓటరు జాబితా సవరణలో.. ఆధార్ కార్డుకు పౌరసత్వ గుర్తింపుకార్డుల జాబితా నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తీవ్రంగా పరిగణించింది.ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డుని చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్ల కింద పరిగణించాల్సిందేనని కేంద్ర ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది. బీహార్ ఓటర్ లిస్ట్ రివిజన్‌లో భాగంగా ఆధారను గుర్తింపుకార్డుగా ఈసీ పరిగణించడం లేదు. తద్వారా ఓట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. సోమవారం విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత ధర్మాసనం ఈసీని ఉద్దేశించి కీలక వ్యాఖ్య చేసింది. "భూమ్మీద దేన్నైనా ఫోర్జరీ చేస్తారు కదా?" అని కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరాలపై సూటిగా ప్రశ్నను సంధించింది. ఈ క్రమంలో..ఆధార్‌ను తిరస్కరిస్తూ.. బీహార్ ఓటర్ల రివిజన్ ప్రక్రియలో ఓట్లను తొలగిస్తూ వస్తోంది ఎన్నికల సంఘం. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. జులై 10వ తేదీ నాటి విచారణ సందర్భంగా బీహార్ ఓటర్ లిస్ట్ రివిజన్ సబబేనన్న సుప్రీం ధర్మాసనం.. అదే సమయంలో ఆధార్, ఎపిక్, రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని ఈసీకి స్పష్టం చేసింది. అయితే.. ఇవాళ్టి వాదనల సందర్భంగా ఆధార్‌ను ప్రూఫ్ ఆఫ్ సిటిజన్‌షిప్‌గా పరిగణించడం కుదరదని, రేషన్ కార్డుల నకిలీవి సృష్టించే అవకాశం లేకపోలేదని.. కాబట్టి వాటి మీద ఆధారపడలేమని ఈసీ వాదనలు వినిపించింది. అలాగే ఓటర్ నమోదు ప్రక్రియలో ఆధార్‌ను కేవలం ఐడెంటిటీ ప్రూఫ్‌గా మాత్రమే పరిగణిస్తామని పేర్కొంది.దీనిపై సుప్రీం కోర్టు స్పందించింది. ఈ భూమ్మీద ఏ డాక్యుమెంట్‌ను ఫోర్జరీ చేయలేరో చెప్పాలంటూ ఈసీని ప్రశ్నించింది. ఓటర్ నమోదు సమయంలో ఆధార్ ప్రస్తావన ఉంటున్నప్పటికీ.. ఓటరు జాబితా గుర్తింపు కోసం ఎందుకు పరిగణించడం లేదని మరోసారి నిలదీసింది. ఈ క్రమంలో.. ఆధార్, ఎపిక్‌ని బీహార్ ఓటర్ రోల్ రివిజన్‌కు చేర్చాలంటూ ఆదేశించింది. ఎన్నికల సంఘం జాబితాలోని ఏ నిర్ధయాత్మక పత్రం కాదు కదా. ఆధార్, ఎపిక్ విషయాల్లో మీరు ఎత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటే గనుక రేపు మీరు అంగీకరించిన ఇతర పత్రాలు కూడా ఫోర్జరీ జరిగితే.. దాన్ని నిరోధించే వ్యవస్థ ఎక్కడ? అని ఈసీకి ప్రశ్న ఎదురైంది.అదే సమయంలో.. ఆగస్టు 1వ తేదీన ఈసీ ప్రచురించబోయే బీహార్ ఓటర్ల డ్రాఫ్ట్ లిస్ట్‌పై మధ్యంతర స్టే విధించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ కోరారు. అయితే.. రేపటి విచారణలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని బెంచ్ స్పష్టం చేసింది.



## జర్మనీలో రైలు ప్రమాదం

ముగ్గురు మృతి

బెర్లిన్: జర్మనీలో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. 100 మందితో వెళ్తున్న రైలు పట్టాలు తప్పడంతో ముగ్గురు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. జర్మనీలోని సిగ్మరింగెన్ పట్టణం నుండి ఉల్మ్ నగరానికి వెళుతున్న ప్యాసింజర్ రైలు అటవీ ప్రాంతంలో పట్టాలు తప్పింది.ఆదివారం(అక్కడి కాలమానం ప్రకారం) నైరుతి జర్మనీలోని బాడెన్-వుర్టెంబర్గ్ పరిధిలోని రీడ్లింగెన్ పట్టణానికి సమీపంలో సాయంత్రం 6:10 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు మృతిచెందారని పోలీసులు తెలిపారు. 50 మంది గాయపడ్డారని భావిస్తున్నారు. అయితే వీరి సంఖ్య ఎంతనేది చెప్పేందుకు అధికారులు నిరాకరించారు. రెండు రైలు బోగీలు పట్టాలు తప్పాయని, దీనికిగల కారణం తెలియరాలేదని అధికారులు పేర్కొన్నారు.రైల్వే అధికారులు ప్రస్తుతం ప్రమాద తీరుతెన్నులను పరిశీలిస్తున్నారని ఆపరేటర్ తెలిపారు. ఈ మార్గంలో 40 కిలోమీటర్ల (25-మైళ్ల) పొడవునా రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. మరోవైపు స్థానిక వాతావరణశాఖ ఈ ప్రాంతంలో తీవ్రమైన తుఫాను గాలులు వీస్తున్నందున కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. రవాణా మంత్రులతో మాట్లాడుతున్నాను, అత్యవసర సేవలు అందించాలని కోరానని ఆయన తెలిపారు. స్థానిక టీవీ స్టేషన్ ఎస్‌డబ్ల్యూఆర్ తెలిపిన వివరాల ప్రకారం గాయపడిన వారిని ఆ ప్రాంతంలోని వివిధ ఆస్పత్రులకు తరలించేందుకు హెలికాప్టర్లు సేవలు అందించాయి..

## సొంత దేశాన్నే ఏర్పాటు చేయొచ్చు..

**జనంసాక్షి:**ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఉంటూ, రెండంతస్తుల భవనంలో వెస్ట్ ఆర్కిటికా, సబోర్గా, పౌల్వియా, లాడోనియా తదితర నకిలీ దేశాల రాయబార కార్యాలయాలను నిర్వహిస్తున్న హర్ష వర్ధన్ జైన్‌ను ఐటీఎఫ్ ఉత్తర ప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ అరెస్టు చేసిం ది.ఈ నేపథ్యంలో ఆయన సాగించిన అనేక బాగోతాలు వెలుగులోకి వస్తున్నాయి.47 ఏళ్ల ఈ మోసగాడు దౌత్యపరమైన ప్లేట్లు కలిగిన లగ్జరీ కార్లలో తిరిగాడు. దశాబ్ద కాలంలో 162 విదేశీ పర్యటనలు చేశాడు. రూ. 300 కోట్ల ఆర్థిక కుంభకోణాన్ని నడిపాడని ఉత్తర ప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ దర్యాప్తులో వెల్లడైంది. అయితే ఇంతకీ కొత్త దేశాన్ని ఎలా సృష్టిస్తారు? ఇందుకు ఏ విధమైన రూపకల్పన చేస్తారు? దేశ జెండాలు, పాస్‌పోర్టులు, రా జ్యాంగాలు, జాతీయ గుర్తింపులను ఎలా సృష్టిస్తారు.. అనే వివరాల్లోకి వెళ్లే ముందు ఒక స్వతంత్ర దేశాన్ని ఎలా ఏర్పాటు చేయాలనే విషయంలోకి వెళదాం..మోంటెవీడియో కన్వెన్షన్ ప్రకారం ఒక దేశానికి నాలుగు లక్షణాలు అవసరం. ఎవరూ హక్కుదారులుకాని భూభాగం, శాశ్వత జనాభా, అధికార ప్రభుత్వం, దౌత్యంలో పాల్గొనే సామర్థ్యం అనేవి తప్పనిసరి. అయితే ఐక్యరాజ్య సమితి గుర్తింపు లేకపోతే ఆ దేశానికి గుర్తింపు దక్కదు. అయినప్పటికీ ఇటువంటి దేశాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. 2019లో భారత్ విడిచి పారిపోయిన అత్యాచార నిందితుడు నిత్యానంద కొంతకాలానికి తెరపైకి వచ్చి, తాను ఒక కొత్త దేశాన్ని స్థాపించానని, దానికి యునైటెడ్ స్టేట్ ఆఫ్ కైలాస అని పేరు పెట్టానని తెలిపాడు. ఈ దీవిని ఆస్ట్రేలియాకు తన అనుచరులు ఈక్వెడార్ సమీపంలో భూమిని కొనుగోలు చేశారని నిత్యానంద తెలిపారు. అయితే అది వాస్తవానికి ఎక్కడ ఉందో ఎవరికీ ఖచ్చితంగా తెలియదు.నిత్యానంద వాదనను ఈక్వెడార్ తిరస్కరించింది. తమ గడ్డపై లేదా సమీపంలో అలాంటి దేశం ఏదీ లేదని స్పష్టం చేసింది.

# లేటు వయసులో తీరిన కోరిక

● 100 ఏళ్లకు పెళ్లి, 103వ బర్త్‌డేకి తీరనున్న డ్రీమ్ : లైఫ్ సీక్రెట్ అదేనట!

● 13 ఏళ్ల వయసులోని కోరిక,103 ఏళ్లకు తీర్చుకోబోతున్న తాతగారు

**జనంసాక్షి:**అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన రెండవ ప్రపంచ యుద్ధంలోని పాల్గొన్న హెరాల్డ్ టెరెన్స్ ఈ ఏడాది ఆగస్టు 103 ఏట అడుగు పెట్టబోతున్నాడు.ఈ సందర్భంగా పెంటగాన్‌లో తన బార్ మిట్జ్వాను జరుపుకోవడానికి సిద్దమవుతున్నాడు. తద్వారా 13 ఏళ్ల నాటి డ్రీమ్‌ను పూర్తి చేయాలని భావిస్తున్నాడు. అసలేంటీ బార్ మిట్జ్వా? అసలు కోరిక ఏంటి? తెలుసుకుందాం ఈ కథనంలో. తన 102వ పుట్టిన రోజు సందర్భంగా తాతగారు ఈ విషయాన్ని ప్రకటించారు. యుక్త వయస్సులో స్వీకరించాలని కలలుగన్న బార్ మిట్జ్వా (యూదుల ఆచారం)ను తన తదుపరి పుట్టినరోజు సందర్భంగా స్వీకరించాలని భావిస్తున్నట్లు చెప్పారు. యూదు మతాన్ని అనుసరించే తల్లి పోలాండ్‌కు చెందిన వారు కాగా, రష్యాకు చెందిన చెండికి మతాలంటే ఇష్టం ఉండదు. ఈ దంపతులకు రెండో సంతానంగా పుట్టాడుహెరాల్డ్ టెరెన్స్. బార్ మిట్జ్వా అనేది యూదు సంప్రదాయంలో ఒక ముఖ్యమైన ఆచారం. ఇది 13 ఏళ్ల వయసు వచ్చిన యూదు బాలుడు తన మతపరమైన నైతిక బాధ్యతలను స్వీకరించే సందర్భాన్ని బార్‌మిట్జ్వా అంటారు. 'మిట్జ్వోత్' అంటే 'మత ఆజ్ఞలు' అని, 'బార్' అనే హీబ్రూ అంటే 'కుమారుడు' అని అర్థం. సాధారణంగా బార్ మిట్జ్వా వేడుకలో బాలుడు సినగాగ్‌లో తోరా (యూదు మత గ్రంథం) నుండి ఒక భాగాన్ని చదువుతాడు లేదా హాఫ్తారా పఠిస్తాడు. ఈ సందర్భం బాలుడు సమాజంలో పెద్దవాడిగా గుర్తింపు పొందే సందర్భంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలోనే తాను కూడా బార్‌మిట్జ్వా స్వీకరించాలని భావిస్తున్నానని తెలిపారు. ఇప్పటికే హెరాల్డ్ సోదరుడు తల్లి మతవిశ్వాసాలను అనుసరిస్తూ యుక్త వయస్సులోనే బార్ మిట్జ్వాను స్వీకరించాడు. తల్లి తండ్రుల విశ్వాసాల కారణంగా అప్పుడు నెరవేర్చుకోలేకపోయిన కలను,ఇన్నాళ్ల తర్వాత తన 103 ఏట బార్ మిట్జ్వా పొందాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ ఏడాది ఆగస్టు 6న వాషింగ్టన్ డీసీలోని పెంటగాన్ లో అతడి బార్ మిట్జ్వా జరగనుంది. గత ఏడాది 100 ఏళ్ల వయసులో 97 ఏళ్ల జీన్ స్వెర్లిన్‌ను వివాహం చేసుకుని ఈయన వార్తల్లో నిలిచాడు. నార్మాండీలో జరిగిన వివాహం, తన జీవితంలో అత్యంత ముఖ్యమైన సంఘటన అని గుర్తు చేసుకున్నారు. నీ లైఫ్‌లో అదే మధురమైనక్షణం అని చెప్పారు. లైఫ్ ఒక అందమైన కథ లాంటిది. తన జీవితాన్ని పూర్తిగా జీవించాలి అంటే ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలో నేర్చు?కుంటే చాలు తిరుగు ఉండదు. కనీసం పదేళ్లఆయుష్షు జోడించుకున్నట్లే అంటారాయన. ఒత్తిడి లేని జీవితం నంబర్ వన్ అయితే, రెండోది 90 శాతం అదృష్టం అంటూ తన లైఫ్ రహస్యాన్ని పంచుకున్నాడు. అంతేకాదు రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కూడా టెరెన్స్ చాలా సార్లు మృత్యువు నుంచి బయటపడ్డాడు. ఇరాన్‌లో ఒక రహస్య మిషన్‌లో ఒకసారి, లండన్ పబ్‌లో జర్మన్ రాకెట్ నుండి తప్పించుకున్నాడు. తన జీవితం "ఒక పెద్ద అద్భుత కథ" అని అతను పేర్కొన్నాడు మరియు తన జీవితాన్ని పూర్తిగా జీవించాలని అనుకున్నాడు. "ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలో మీరు నేర్చుకోగలిగితే, మీరు చాలా దూరం వెళ్తారని నేను అనుకుంటున్నాను. మీరు మీ జీవితానికి కనీసం 10 సంవత్సరాలు జోడిస్తారు. కాబట్టి అది నంబర్ వన్. అదృష్టం," అని అతను చెప్పాడు, సుదీర్ఘమైన, సంతోషకరమైన జీవితానికి తన రహస్యాన్ని పంచుకున్నాడు.కాగా హెరాల్డ్ టెరెన్స్ 1942లో ఆర్మీ ఎయిర్ ఫోర్స్‌లో చేరాడు . థండర్‌బోల్ట్ ఫైటర్ స్క్వాడ్రన్‌కు రేడియో రిపేర్ టెక్నీషియన్‌గా పనిచేశాడు. 1944లో %ఇ%-డే నాడు, అతను ఫ్రాన్స్ నుండి తిరిగి వచ్చే విమానాలను మరమ్మతు చేయడంలో సహాయం చేశాడు. ఆ తరువాత నార్మాండీ నుండి విముక్తి పొందిన యుద్ధ ఖైదీలను ఇంగ్లాండ్‌కు రవాణా చేయడంలో సహాయం చేశాడు. జూన్ 2024లో, నాజీ ఆక్రమణ నుండి దేశం విముక్తి పొందిన 80వ వార్షికోత్సవం సందర్భంగా ఫ్రెంచ్ ప్రభుత్వం అతన్ని సత్కరించింది.



## థరూర్ మౌన వ్రత్.. తప్పించారా? తప్పుకున్నారా?

**జనంసాక్షి:**పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అంశంపై ఇవాళ పార్లమెంట్ లోక్‌సభలో చర్చ జరగాల్సి ఉంది. ఈ తరుణంలో పార్లమెంట్ ఆవరణలో ఆసక్తికరమైన సంఘటన చోటు చేసుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి మీడియాతో మాట్లాడుతున్న వేళ.. శశిథరూర్ కారు దిగి పార్లమెంట్ లోపలికి వడివడిగా అడుగేశారు. ఆ సమయంలో మీ పార్టీ తరఫున మాట్లాడే అవకాశం మీకు ఇస్తారా? అనే ప్రశ్న ఆయనకు ఎదురైంది. దానికి ఆయన 'మౌన వ్రత్.. మౌన వ్రత్' అంటూ ముందుకు వెళ్లారు. అయితే కాస్త ముందుకు వెళ్లగానే ఆయన రేణుకా చౌదరిని గమనించారు. వెనక్కి వచ్చి మీడియాతో మాట్లాడుతున్న ఆమెను ఆప్యాయంగా పలకరించారు. వారిద్దరి మధ్య జరిగిన సరదా సంభాషణ తాలూకా వీడియో వైరల్ అవుతోంది. ఆ సమయంలోనే రేణుకా చౌదరి.. ఆయనకు అన్ని విధాల ఆ అర్హత ఉందని వ్యాఖ్యానించడం గమనార్హం. ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు మొత్తం 16 గంటల సమయం కేటాయించారు. ఇందులో కాంగ్రెస్‌కు 2గంటల సమయమే ఉంది. అయితే కాంగ్రెస్ తరఫున ఈ చర్చలో పాల్గొనబోయే లిస్ట్‌లో థరూర్ పేరు లేదు.ఇదిలా ఉంటే.. పాకిస్తాన్ ఉగ్రవాదంపై ప్రపంచానికి వివరించేందుకు ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత ప్రభుత్వం ఎంపీల బృందాలను వివిధ దేశాలకు విశేషాలకు పంపించింది. అమెరికాకు వెళ్లిన ఎంపీల బృందానికి కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నాయకత్వం వహించారు. అటువంటి శశిథరూర్ పేరు డిబేట్‌లో మాట్లాడే వారి జాబితాలో లేకపోవడం రాజకీయంగా చర్చకు దారి తీసింది.

## పారమిత హెరిటేజ్ పాఠశాలలో నమూనా ఎన్నికలు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 28 (జనంసాక్షి) :**
స్థానిక కొత్తపల్లి మండలం, పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో విద్యార్థి మంత్రి మండలిని ఎన్నుకోవడానికి ఎన్నికలను నిర్వహించారు. దానిలో భాగంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్, క్రీడా రంగానికి, క్రమశిక్షణ రంగానికి సాంస్కృతిక రంగానికి లీడర్లను, డిప్యూటీ లీడర్లను ఇ-బ్యాలెట్ విధానంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి ఓటుహక్కును వినియోగించుకొని ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే బూత్ అధికారులుగా, ఎలక్షన్ అధికారులుగా ప్రిసైడింగ్ అధికారిగా పలు విధులను విద్యార్థులు నిర్వహించడం జరిగింది. విద్యార్థులందరూ ఆసక్తిగా వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాఠశాల అధినేత డా. ఇ. ప్రసాద్ రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకుని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఉపాధ్యాయులను విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే సమాజంలో ఓటుకు ఉన్న పాధాన్యత ను విలువను తెలుపుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని భవిష్యత్తు లో ఈ విద్యార్థులే రాష్ట్ర, దేశ రాజకీయాలలో కీలక బాధ్యతలు నిర్వహించినా ఆశ్చర్య పోనవసరం లేదని అన్నారు. విద్యార్థుల నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించే దిశగా, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే దిశగా ఈ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, టి.యస్.వి.రమణ, వినోద్ రావు,హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను శనివారం లోగా పరిష్కరించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 28 (జనం సాక్షి) :** ప్రజావాణి ద్వారా వచ్చిన అర్జీలను తక్షణమే పరిశీలించి, శనివారంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో, ఐడిఓసి సమావేశ మందిరంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్‌లతో కలిసి ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చిన 124 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి ముఖ్యమైన వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. వచ్చిన ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం కలిగించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవోతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## యువకుడి ప్రాణాలు కాపాడిన
## హైడ్రా హీరోలకు కమిషనర్ సన్మానం

**హైదరాబాద్, జులై 24 (జనంసాక్షి):** దుర్గం చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని చాకచక్యంగా కాపాడిన హైడ్రా డీఆర్ఎఫ్ సిబ్బంది తిరుపతి యాదవ్, సంతోష్ చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. ఈ నెల 25న రామిరెడ్డి అనే యువకుడు తీగల వంతెన అంచున నిలబడి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా.. అక్కడ విధుల్లో ఉన్న డీఆర్ ఎఫ్ సిబ్బంది కాపాడిన విషయం అందరికీ విధితమే. రామిరెడ్డిని మాటల్లో పెట్టి.., దృష్టి మరల్చి.. క్షణాల్లో కాపాడిన తిరుపతి యాదవ్‌ను కమిషనర్ అభినందించారు. అలాగే అక్కడ విధుల్లో ఉండి.. యువకుడిని కాపాడేందుకు సహకరించిన సంతోష్ చారి, మహ్మద్ ఇమ్రాన్‌లను కూడా శాలువ కప్పి సన్మానించారు. దుర్గం చెరువు వంతెనపై నీరు నిలబడకుండా.. రంధ్రాలను శుభ్రం చేస్తున్నప్పుడు ఓ యువకుడు దూకేందుకు యత్నిస్తున్న దృశ్యాలను చూశామని.. ఒకవైపు అతడిని దూకవద్దు అని మాటల్లో పెట్టి... మరో వైపునుంచి వచ్చి కాపాడినట్టు ఆ ముగ్గురు డీఆర్ఎఫ్ ఉద్యోగులు కమిషనర్‌కు వివరించారు.

## ముస్లింలను ముందటేసుకోకపోతే బండికి పూట గడవదు

- పార్లమెంట్‌లో బిల్లు పెట్టలేక బండి తొండి మాటలు మాట్లాడుతుండు
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వార్తల్లో ఉండడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చౌకబారు విమర్శలు చేస్తుండు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్




**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 27 (జనంసాక్షి) :**
రాష్ట్ర ప్రభుత్వం బిసి లకు 42 శాతం రిజర్వేషన్ కోసం చిత్త శుద్ధితో ముందుకు వెళ్తుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్ లో బిల్లు పెట్టకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ తొండి మాటలు మాట్లాడుతున్నాడని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బిజెపి నాయకులకు ప్రజలను తప్పుదారి పట్టించడం వెన్నతో పెట్టిన విద్య అని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల బిసి సంఘాలు ఒకవైపు హర్షం వ్యక్తం చేస్తుంటే బండి సంజయ్ బిసి సంఘాలను తప్పుబడుతున్నాడనీ రెండు పర్యాయాలు ఎంపీగా బిసి సంఘాల మద్దతు లేనిదే గెలిచారా అని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. ఓసీలుగా చలామణి అయిన ప్రధాని మోడీ కులాన్ని కూడా 40 ఏళ్ల క్రితం బిసిలలో చేర్చిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీదే అని నరేందర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వార్తలలో ఉండడం కోసం నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చౌకబారు ఆరోపణలు చేస్తున్నాడనీ ఇప్పటికైనా కౌశిక్ రెడ్డి పద్దతి మార్చుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు కలిసి తరిమికొట్టే రోజు వస్తుందని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ విలేఖరుల సమావేశంలో కొరివి అరుణ్ కుమార్, బానోతు శ్రవణ్ నాయక్, సమద్ నవాబ్, దండి రవీందర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కీర్తి కుమార్, పెద్దిగారి తిరుపతి, అస్తపురం రమేష్, నెల్లి నరేష్, మిరాజ్, కొట్టె ప్రభాకర్, మాసుం ఖాన్, అంజయ్య పాల్గొన్నారు.

## బిజెపి నేతలు పేదల కోసం సొంత డబ్బులతో ఒక్క స్కూల్ నిర్మించారా?

- ఎంఐఎం నాయకులు చేసిన సైకిళ్ల పంపిణీ చూసి బండి సంజయ్ కాపీ కొట్టారు
- ఎంఐఎం పార్టీ విధి విధానాలకు ఆకర్షితులై యువకులు, పెద్దలు చేరుతున్నారు
- ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 28 (జనంసాక్షి) :**
సెక్యులర్ వాదుల దేశభక్తిని నిత్యం శంకించే బిజెపి, ఆర్ఎస్ఎస్, సంఘపరివార్ నాయకులు, ముస్లింలను బూచిగా చూపిస్తూ, హిందువులను ఓటు బ్యాంకుగా మాత్రమే మార్చుకొని రాజకీయ లబ్ధి పొందుతున్నారని, స్వాతంత్రం వచ్చిన నాటి నుండి, నేటి వరకు పేదల కోసం తమ సొంత డబ్బులతో ఒక్క స్కూల్ కట్టించి, నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన దాఖలాలు కనిపించవని, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ విమర్శించా రు. ఎంఐఎం అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, ఆదివారం రాత్రి నగరంలోని కశ్మీర్ గడ్డలోని ఓఫంక్షన్ హాల్లో 43, 61వ డివిజన్ల బాధ్యులు బర్కత్ అలీ, ఆతిన ఆధ్వర్యంలో 200 మంది యువకులు, పెద్దలు ఎంఐఎంలో చేరారు. పార్టీలో చేరిన యువకులకు కండువాలు కప్పి గులాం అహ్మద్ ఎంఐఎంలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన రెండు డివిజన్ల స్థాయి సదస్సులో గులాం అహ్మద్ మాట్లాడుతూ... ఎంఐఎం పార్టీ శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ నిరుపేదల కోసం విద్యాసంస్థ లను స్థాపించి, ఉచితంగా ప్రతి ఏడాదికి 22000 మంది విద్యార్థులను చదివిస్తున్నారని చెప్పారు. ఇలాంటి మంచి పనులను నాటి జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మొదలుకొని, నేటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా, బండి సంజయ్ వరకు పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు, తమ సొంత డబ్బులతో ఒక్క స్కూల్ ను నిర్మించారా అని ప్రశ్నించారు. గోదాం గడ్డలో గత రెండేళ్ల క్రితం ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ కుటుంబ సభ్యులు విద్యార్థుల కోసం ఉచితంగా సైకిళ్లను తమ సొంత డబ్బులతో పంపిణీ చేస్తే, అట్టి కార్యక్రమాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ కాపీ కొట్టారన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల నుండి వచ్చే సీఎస్ఆర్ నిధుల (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ద్వారా మాత్రమే బండి సంజయ్ సైకిళ్లను పంపిణీ చేశారన్నారు. ఈసైకిళ్లు మోడీ గిఫ్ట్ అని చెప్పడం, వాళ్లు పంపిణీ చేసే సైకిళ్లకు కాషాయపురంగు పులమడం ఎంత వరకు సమంజసమో సభ్య సమాజం ఆలోచించాలన్నారు. ఎంఐఎం పార్టీ చొరవతో నగరంలోని దళిత, ముస్లిం డివిజన్లలో స్మార్ట్ సిటీ ద్వారా వందల కోట్ల అభివృద్ధి పనులు జరగాయని పేర్కొన్నారు. కాశ్మీర్ గడ్డలో మోడల్ రైతు బజార్ నిర్మాణంతో పాటు గోదాం గడ్డలో మోడల్ దోబీ ఘాట్ నిర్మాణం ఎంఐఎం కృషి వల్లనే జరుగుతుందన్నారు. 2005-2006లో కాలంలో శాసహబ్ మొహల్లా నుంచి నగరంలోనే అత్యధికంగా 1280 పైచిలుకు ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పట్టాలు ఇప్పించిన ఘనత ఎంఐఎం కార్పొరేటర్ రాఫీయాసుల్తానా కే దక్కిందన్నారు. జగిత్యాలలో ఎంఐఎం కౌన్సిలర్ రజియుద్దీన్ కృషి ఫలితంగా 900 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ముస్లింలకు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ఎంఐఎం పార్టీ విధి విధానాలకు ఆకర్షితులై యువకులు, సీనియర్ సిటిజన్స్ పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నార న్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం, విస్తరణ కోసం బారిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు చేరికలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నాయకులు బర్కత్ అలీ, ఆతిన, ఖమరొద్దీన్, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, అలిబాబా, అజర్ దబీర్, అన్నెమల్ల సురేశ్, మొహసీన్, సాజిద్, అన్వర్ ఖాన్, ఖాజా మజహరొద్దీన్, అజ్మత్ అలీ, ఖాలీద్, నసీం ఖాన్, అశు పాల్గొన్నారు.

### టాటా పవర్ ఆధ్వర్యంలో 'తన్వి ది గ్రేట్'

**హైదరాబాద్, జూలై 27:** టాటా పవర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ట్రస్ట్ , అనుపమ్ ఖేర్ స్టూడియోస్ కలిసి 'తన్వి ది గ్రేట్' చిత్రాన్ని హైదరాబాద్‌లోని పీవీఆర్ ఆర్కే సినీ ప్లెక్స్‌లో ఏర్పాటు చేసింది. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, విస్తృత న్యూరోడైవర్సిటీ స్పెక్ట్రమ్‌పై అవగాహన పెంపొందించడానికి టాటా పవర్ చేపట్టిన 'పే అటెన్షన్ ' కార్యక్రమంలో భాగంగా ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ స్క్రీనింగ్‌కు టాటా పవర్ సీహెచ్‌ఆర్‌వో, చీఫ్ సస్టైనబిలిటీ, సీఎస్‌ఆర్ అధికారి హిమాల్ తివారి హాజరయ్యారు. న్యూరోడైవర్స్ పిల్లలు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులు, స్పెషలిస్టులు, పే అటెన్షన్ ఎన్జీవో భాగస్వాములు మరియు టాటా గ్రూప్ సంస్థల ప్రతినిధులు సహా మొత్తం 350 మందిపైగా ఈ స్క్రీనింగ్‌కు హాజరయ్యారు. ఈ ప్రదర్శనకు 'పే అటెన్షన్ సెన్సరీ ఎక్స్‌పీరియన్స్ జోన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ జోన్‌ను సెన్సరీ ఆల్ అనే స్టార్టప్ సహకారంతో రూపొందించారు.

## డబుల్ బెడ్ రూమ్ బిల్లులు మంజూరు చేయండి

### జిల్లా కలెక్టర్‌కు పెగడపల్లి వాసుల వినతి



**బోధన్, జూలై 28 ( జనంసాక్షి ) :** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన 22 మంది డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో 2022 సంవత్సరములో పెగడాపల్లి గ్రామంలోని 22 మంది డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో భాగంగా డబుల్ బెడ్రూమ్ రూమ్ ఇండ్లు కట్టుకున్నారు. వారికి రెండు లక్షల పదివేల రూపాయలు మాత్రమే మూడు విడుదలగా ఇవ్వడం జరిగిందని మిగతా రావాల్సిన బకాయి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. వీరు ఇండ్లను పూర్తి చేసినప్పటికీ కాంట్రాక్టర్ జాప్యం వల్ల నిధులు సుమారు రెండు లక్షల ఇరవై వేల రూపాయలను అందించాలన్నారు. ఇండ్లను నిర్మించుకున్నప్పటికీ బిల్లులు రాకపోవడంతో ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉందని తక్షణమే మాకు బిల్లు ఇప్పించాలని 22 మంది లబ్ధిదారులు కలెక్టర్‌కు విన్నవించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ వీడిసి చైర్మన్ మేడి రవి, ఇండ్ల లబ్ధిదారులు టేకుల బీరయ్య, కృష్ణ, దేవ్రాజ్, సురేష్, రసూల్, పోశెట్టి, గోపి, అడెల్లి, గోంటి రాజు, అనంత్, సంజీవ్, సైదాగౌడ్ పాల్గొన్నారు.



## దివ్య దేశ్‌ముఖ్ చారిత్రాత్మక విజయం

### భారతదేశానికి గర్వకారణం

**మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని, (జనంసాక్షి) :**
మహిళల ప్రపంచ కప్‌లో దివ్య దేశ్‌ముఖ్ చారిత్రాత్మక విజయం భారతదేశానికి గర్వకారణం అని తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల మంత్రి శ్రీధర్ బాబు ఎక్స్ వేదికగా అభినందించారు. ఈ టైటిల్‌ను గెలుచుకున్న, కేవలం 19 సంవత్సరాల వయసు లో గ్రాండ్‌మాస్టర్ కిరీటాన్ని గెలుచుకున్న మొదటి భారతీయ మహిళ కావడం స్ఫూర్తి దాయకం. దశాబ్దాలుగా మార్గదర్శకు రాలిగా, ఐకాన్‌గా ఉన్న కోనేరు హంపి వంటి దిగ్గజంతో ఆడటం ఈ విజయాన్ని మరింత ప్రత్యేకంగా చేస్తుంది. వారు చదరంగంలో భారతీయ మహిళల బలాన్ని ప్రదర్శించారు. కొత్త తరాన్ని నిర్భయంగా కలలు కనడానికి, ధైర్యంగా ఆడటానికి ప్రేరేపించారు. మీ విజయం తరతరాలుగా యువ మనస్సులు పెద్ద కలలు కనడానికి, నిర్భయంగా జయించడానికి ప్రేరేపిస్తుంది.. అని తన ఎక్స్ ఖాతాలో చెప్పుకొచ్చారు.

## చేప,రొయ్య పిల్లల కొనుగోలు కోసం సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలి

### మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లేల బాలకృష్ణ డిమాండ్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 28 (జనం సాక్షి)**
మత్స్య కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం మహా ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మత్స్య సొసైటీ జల వనరులకు సరిపడెంతా ఉచిత చేప,రొయ్య పిల్లలను మత్స్య సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని మత్స్యకారుల కామారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం ధర్నాకు తెలంగాణ మత్స్య కారులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథిగా హాజరైన లెల్లేల బాలకృష్ణ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఉచిత చేప రొయ్య పిల్లల విషయంలో నిర్దిష్టమైన ప్రకటన చేయకపోవడం రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారని తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎలాంటి టెండర్లు లేకుండా మత్స్య సొసైటీ ఖాతాలో నగదు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో భూముల రేట్లు విపరీతంగా పెరగడంతో భూస్వాములు దళారీ లో పెద్ద ఎత్తున చెరువులు కుంటలు కబ్జాలు చేస్తున్నారని దీంతో మత్స్యకారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రభుత్వం చెరువులు కుంటలు సాటిలైట్ ద్వారా సర్వే చేయించి ఫెన్సింగ్ వేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ వెంకట్ గౌడ్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా అధ్యక్షులు దుర్కి గంగారాం, జిల్లా కార్యదర్శి మదుసుధన్, సాయిలు, నర్సింహులు, మామిండ్ల జగదీష్, మత్స్య మహిళా తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని, జులై 28, (జనంసాక్షి) :**
టైమ్ న్యూరో కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ విక్రాంత్ సింగ్ ఎండీ స్వయంగా అగస్టు 3న కరీంనగర్‌లో నిర్వహించే ఉచిత హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కోరారు. నరాల బలహీనతతో బాధపడేవారికి ఈ క్యాంపు ద్వారా లైఫ్‌లాంగ్ హెల్త్ కార్డు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. హెల్త్ కార్డు ద్వారా వచ్చే వారికి ఫీజులో రాయితీతో పాటు డాక్టర్ స్వయంగా వైద్యసేవలు అందిస్తారని, అలాగే వైద్యపరీక్షలు, మందుల్లో రాయితీ ఉంటుందన్నారు. డాక్టర్ విక్రాంత్ సింగ్ తాత మహావీర్ సింగ్ ముత్తారం మండలం పారుపల్లిలో ఉపాధ్యాయుడిగా పని చేశారని, ఈక్రమంలో ఈ ప్రాంతం ఉన్న మమకారంతో ఈ హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఈ హెల్త్ క్యాంపులో పాల్గొని ఉచితంగా పరీక్షలతో పాటు మందులు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



## పై వాళ్లనడగండి..!

### అది మా పరిధి కాదు

- దాటవేత ధోరణిలో తహసిల్ సిబ్బంది
- చిన్న పనికీ ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లండంటూ ఉచిత సలహా
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం..
- తీవ్ర ఇబ్బందుల పాలవుతున్న ప్రజానీకం

**వేములవాడ గ్రామీణం, జూలై 28 (జనంసాక్షి):** వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది దాటవేత ధోరణితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపికగా సమస్యలు విని పరిష్కరించాల్సిన అధికారులు.. సరైన సమాధానం ఇవ్వకపోవడమే కాక, "ఇది మా పరిధిలో లేదు" అంటూ పై స్థాయి అధికారుల వద్దకు పంపుతున్నారు. సమస్య ఏదైనా ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాలంటూ ఉచిత సలహా ఇచ్చి తప్పించుకుంటుండడంతో ఏం చేయాలో తెలియక సామాన్యులు మరింత అందోళన చెందుతు న్నారు. ముఖ్యంగా భూ సమస్యలపై నాన్చుతుండడంతో బాధితులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**ప్రజావాణి.. నామ్‌కే వస్తే**
ప్రజలు ప్రజావాణి ద్వారా తమ సమస్యలు చెప్పుకొంటున్నా, స్పందన మాత్రం ఉండటం లేదు. ఈ కార్యక్రమం కేవలం నామమాత్రంగా నడుస్తోందని ప్రజలు వాపోతున్నారు. వారి పనుల పురోగతిపై స్పష్టత లేక, కార్యాలయంలో అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్ల బాధితులు గందర గోళంలో ఉన్నారు. ఉన్నతాధికారులు సత్వరం స్పందించి విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకొని, తమకు సేవలు మెరుగు పడేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం

### ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ వెల్లడి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 28 (జనం సాక్షి) :**
ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తూ.చ తప్పకుండా అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన కొత్త రేషన్ కార్డులను సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అదనపు కలెక్టర్ అంకిత్ లబ్దిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ గడిచిన 13 సంవత్సరాల తరువాత ప్రజల కొత్త రేషన్ కార్డుల కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసిందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా అందించలేదని ఆక్షేపించారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ, తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్డులు అందిస్తోందని గుర్తు చేశారు. ఇది నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఇంకనూ అర్హులైన వారు మిగిలి ఉంటే, దరఖాస్తులు చేసుకోవాలని, కార్డులు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని భరోసా కల్పించారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 11,852 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, మరో 84,232 మంది సభ్యుల పేర్లను కొత్తగా రేషన్ కార్డుల జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని నార్త్, సౌత్ మండలాల పరిధిలోని 3174 కుటుంబాలకు కొత్త కార్డులు, 16,687 మంది సభ్యుల పేర్లను కొత్తగా నమోదు చేయడం జరిగిందని వివరించారు. గత ప్రభుత్వ అసంబద్ధ పాలనా విధానాల వల్ల రూ.7.80 లక్షల కోట్ల అప్పుల భారం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యతాక్రమంలో అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు 22వేల కోట్ల రూపాయల రుణ మాఫీ, 9వేల కోట్ల రైతుబంధు నిధులు ఖాతాలలో జమ, రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల అమలు తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని స్పష్టం చేశారు. సన్న బియ్యం పంపిణీ బీజేపీ పాలిత రాష్ట్రాలు సహా దేశంలోనే మరెక్కడా లేదని, కేవలం తెలంగాణలో అమలవుతోందని అన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు మంజూరు చేశామని, ఒక్కో లబ్ధిదారుకు రూ. 5 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. ఈ నిధులను తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని సూచించారు. ఎవరైనా లబ్దిదారుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని షబ్బీర్ అలీ హెచ్చరించారు. అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పూర్తి పారదర్శకంగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అర్హులైన వారికి మాత్రమే కార్డులు మంజూరు అయ్యేలా పకడ్బందీ పరిశీలన జరుపుతున్నా మని అన్నారు. ఇంకనూ దరఖాస్తుల వెరిఫికేషన్ జరుగుతోందని, అర్హత కలిగిన కుటుంబాలకు కార్డులు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా ఛైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సౌత్, నార్త్ తహసీల్దార్లు బాల రాజు, విజయ్ కాంత్, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# కొత్త కోచ్ రేసులో ముగ్గురు

భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టుకు కొత్త కోచ్ ఎవరనేది త్వరలోనే తేలిపోనుంది. హెడ్‌కోచ్ మనోలో మర్కెజ్‌పై వేటు అనంతరం ఏర్పడిన అనిశ్చితికి ఆగస్టు 1న తెరదించనుంది ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య. ఇప్పటికే ముగ్గురిని షార్ట్ లిస్ట చేసిన ఏఐఎఫ్ఎఫ్ వీళ్లలో ఒకరి పేరును ఆగస్ట్ 1న వెల్లడించనుంది. అయితే.. జాబితాలోని త్రయంలో మాజీ ఆటగాడైన ఖలీద్ జమిల్ కోచ్ పదవి రేసులో అందరికంటే ముందున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. 'ఆగస్టు 1న ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం కానుంది. బ్లూ టైగర్స్‌కు తదుపరి కోచ్ ఎవరు? అనే అంశనే ప్రధాన ఎజెండాగా ఈ మీటింగ్ జరుగనుంది. ఇప్పటికే ఆశావహులు తమ వివరాలను పంపించారు. వీళ్లలో ముగ్గురిని తుది జాబితాకు ఎంపిక చేశాం. అదే రోజున కొత్త కోచ్ పేరును వెల్లడిస్తాం' అని ఏఐఎఫ్ఎఫ్ వర్గాలు వెల్లడించాయి. షార్ట్ లిస్ట్‌లోని స్టెఫాన్ టర్కోవిక్, మాజీ కోచ్ స్టీఫెన్ కాన్స్టాంటినే నుంచి జమిల్‌కు పోటీ ఎదురయ్యే అవకాశముంది.

# హెడ్‌కోచ్‌గా శ్రీలంక మాజీ ఓపెనర్

2025 ఆసియా కప్‌లో తొలిసారి అర్హత సాధించిన హాంకాంగ్ క్రికెట్ జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. మెగా టోర్నమెంట్‌లో పెద్ద జట్లకు సవాల్ విసరాలనే లక్ష్యంతో, శ్రీలంక మాజీ ఓపెనర్ కౌశల్ సిల్వాను హాంకాంగ్ క్రికెట్ బోర్డు ప్రధాన కోచ్‌గా నియమించింది. 39 ఏళ్ల సిల్వా, తన తొలి అంతర్జాతీయ కోచింగ్ బాధ్యతలను ఈ ఆసియా కప్‌తో ప్రారంభించనున్నాడు. హాంకాంగ్ క్రికెట్ చైర్‌పర్సన్ బుర్జి ష్రాఫ్ మాట్లాడుతూ, "సిల్వా అంకితభావం, ప్రతిభను రాటుదేల్చే నైపుణ్యం హాంకాంగ్ క్రికెట్ భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అతని మార్గదర్శనంలో మా జట్టు గొప్పగా రాణిస్తుందని, దేశంలో క్రికెట్ వ్యాప్తి కూడా జరుగుతుందని నమ్ముతున్నాం" అని పేర్కొన్నాడు. సిల్వా స్పందిస్తూ, "క్రమశిక్షణ, గెలవాలనే కసిని ఆటగాళ్లలో నింపడం, యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం నా లక్ష్యం" అని తెలిపాడు. సెప్టెంబర్ 9న ఆసియా కప్‌లో హాంకాంగ్ తమ తొలి మ్యాచ్‌లో అఫ్గనిస్తాన్‌తో తలపడనుంది. గ్రూప్ బిలో శ్రీలంక, బంగ్లాదేశ్‌లతోనూ ఆడనుంది. కుడిచేతి వికెట్ కీపర్-ఓపెనర్‌గా శ్రీలంకకు 2011 నుంచి 2018 వరకు 39 టెస్టులు ఆడిన సిల్వా, 2,099 రన్స్‌తో మూడు శతకాలు, 12 అర్ధశతకాలు సాధించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 209 మ్యాచ్‌లలో 41 శతకాలతో 13,932 రన్స్ చేశాడు. 2019 నుంచి శ్రీలంక, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలో కోచింగ్ చేసిన అతను, ఇప్పుడు హాంకాంగ్‌తో తన తొలి అంతర్జాతీయ కోచింగ్ సవాల్‌ను స్వీకరించాడు. ఇటీవల సింగపూర్‌లో జరిగిన ఆసియా పసిఫిక్ క్రికెట్ ఛాంపియన్స్ ట్రోఫీలో హాంకాంగ్ మలేషియాతో ఫైనల్‌లో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. సిల్వా నాయకత్వంలో ఈ జట్టు ఆసియా కప్‌లో సంచలనాలు సృష్టించేందుకు సిద్ధమవుతోంది.

## మెడిసిన్ కల నుంచి చదరంగ రాణిగా..

19 ఏళ్ల దివ్య దేశముఖ్ ఫిడే మహిళల ప్రపంచ చెస్ కప్ 2025లో ఛాంపియన్‌గా నిలిచి, భారత చెస్‌ను గర్వకారణమైన కీర్తిమంతంగా మార్చింది. నాగ్‌పూర్‌కు చెందిన ఈ యువతి, వైద్యురాలు కావాలన్న కలను వీడి, చదరంగంలో అసాధారణ ప్రతిభతో ప్రపంచాన్ని ఆకర్షించింది. జార్జియాలోని బాటమీలో జరిగిన ఫైనల్‌లో అనుభవజ్ఞురాలైన కోనేరు హంపీని టైబ్రేక్‌లో ఓడించి, 75 ఎత్తుల్లో విజయం సాధించి, 1.5-0.5 స్కోరుతో టైటిల్ కైవసం చేసుకుంది. ఈ విజయంతో దివ్య భారతదేశం యొక్క 88వ గ్రాండ్‌మాస్టర్‌గా, నాల్గవ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా చరిత్ర సృష్టించింది. ఆమె తల్లిదండ్రులు జితేంద్ర, నమ్రతా దేశముఖ్‌లు వైద్యులు కాగా, దివ్య కూడా మెడిసిన్ చదవాలనుకుంది. కానీ, నాలుగేళ్ల వయసులో భవాన్స్ భగవాన్‌దాస్ పురోహిత్ విద్యా మందిర్‌లో చెస్‌తో పరిచయం ఆమె జీవితాన్ని మార్చేసింది. బ్యాడ్మింటన్ క్లాస్‌కు వెళ్లిన రోజు, తన ఎత్తు నెట్‌కు సరిపోకపోవడంతో, చెస్ క్లాస్‌లో చేరిన దివ్య, అక్కడి నుంచి చదరంగంతో ప్రేమలో పడిపోయింది. "ఆ రోజు నుంచి చెస్ నా సర్వస్వం అయింది. అమ్మానాన్న ప్రోత్సాహం నా అభిరుచికి బలం చేకూర్చింది" అని దివ్య ఒక సందర్భంలో చెప్పింది.

# చెస్ క్వీన్ దివ్య దేశ్‌ముఖ్



## ఫిడే మహిళల ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్

### ఫైనల్లో కోనేరు హంపి ఓటమి

*భారత చెస్ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం లిఖించబడింది! కేవలం 19 ఏళ్ల దివ్య దేశముఖ్, ఫిడే మహిళల ప్రపంచ చెస్ కప్ 2025లో అనుభవజ్ఞురాలైన కోనేరు హంపీని ఓడించి ఛాంపియన్‌గా నిలిచి, ప్రపంచాన్ని విస్మయపరిచింది. జార్జియాలోని బాటమీలో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో, రెండు క్లాసికల్ గేమ్‌లు డ్రాగా ముగిసిన తర్వాత, టైబ్రేక్‌లో దివ్య తన దూకుడైన ఆటతీరుతో 75 ఎత్తుల్లో విజయ జెండా ఎగురవేసింది. ఈ విజయంతో ఆమె భారతదేశం యొక్క 88వ గ్రాండ్‌మాస్టర్‌గా, నాల్గవ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా చరిత్రలో నిలిచింది. నాగ్‌పూర్‌కు చెందిన ఈ యువతి, తన వ్యూహాత్మక ప్రతిభతో హారిక ద్రోణవల్లి, జు జినర్, జాంగ్ యి వంటి దిగ్గజాలను మట్టికరిపించి, భారత చెస్‌కు సంబరాలను తెచ్చింది. దివ్య ఈ విజయం యువతరానికి స్ఫూర్తిని, దేశానికి గర్వాన్ని పంచుతూ, చెస్ ప్రపంచంలో ఉజ్వల భవిష్యత్తును వాగ్దానం చేస్తోంది.*

ఫిడే మహిళల ప్రపంచ చెస్ కప్ 2025లో భారత యువ క్రీడాకారిణి దివ్య దేశముఖ్ (19) సంచలన విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. జార్జియాలోని బాటమీలో జరిగిన ఈ టోర్నమెంట్ ఫైనల్లో దివ్య, అనుభవజ్ఞురాలైన కోనేరు హంపీని ఓడించింది. రెండు క్లాసికల్ గేమ్‌లు డ్రాగా ముగిసిన తర్వాత, టైబ్రేక్‌లో దివ్య తన దూకుడైన ఆటతీరుతో హంపీని చిత్తు చేసింది. తొలి ర్యాపిడ్ టైబ్రేకర్ డ్రాగా ముగియగా, రెండో గేమ్‌లో 75 ఎత్తుల్లో దివ్య తెల్ల పావులతో విజయం సాధించింది, మొత్తం 1.5-0.5 స్కోరుతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో దివ్య భారతదేశం యొక్క 88వ గ్రాండ్‌మాస్టర్‌గా, నాల్గవ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా (కోనేరు హంపీ, హారిక ద్రోణవల్లి, ఆర్. వైశాలి తర్వాత) నిలిచింది. ఫిడే నిబంధనల ప్రకారం గ్రాండ్ మాస్టర్ టైటిల్ కోసం మూడు నార్మ్‌లు, 2500 ఎలో రేటింగ్ అవసరమై నప్పటికీ, ప్రపంచ కప్ విజేతగా నిలవడం ద్వారా దివ్య ఈ టైటిల్‌ను సులభంగా సాధించింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన దివ్య, ఫైనల్స్‌కు చేరిన తొలి భారత క్రీడాకారిణిగా, ఇప్పుడు విజేతగా కూడా చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హంపీ తీవ్ర పోటీ ఇచ్చినప్పటికీ, దివ్య దూకుడైన ఆటతీరుతో ఒత్తిడి సృష్టించి, టైబ్రేకర్‌లో విజయం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో ఆమె హారిక ద్రోణవల్లి (క్వార్టర్ ఫైనల్), జు జినర్ (ప్రీ-క్వార్టర్స్), మాజీ ప్రపంచ ఛాంపియన్ జాంగ్ యి (సెమీస్)లను ఓడించి తన సామర్థ్యాన్ని నిరూపించింది. 2021లో ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించిన దివ్య, 2023లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. చెస్ ఒలింపియాడ్‌లో మూడు స్వర్ణ పతకాలు, 2024లో వరల్డ్ జూనియర్ గర్ల్స్ టైటిల్‌ను గెలుచుకున్న ఆమె, గత ఏడాది తొలిసారి 2500 ఎలో రేటింగ్ సాధించింది. హంపీతో పోలిస్తే సీనియర్ విభాగంలో తక్కువ అనుభవం ఉన్న దివ్య, తన ఆక్రమణాత్మక ఆటతీరుతో గ్రాండ్‌మాస్టర్లను కంగుతినిపించింది.

ఈ విజయం దివ్యను 2026 క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించేలా చేసింది, ఇక్కడ ఆమె ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం జు వెంజున్‌తో పోటీపడే అవకాశం ఉంది. మాజీ ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ దివ్యను అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు, "ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన దివ్యకు అభినందనలు. ఉత్కంఠభరితమైన పోరులో హంపీ కూడా అద్భుత ఆటతీరు, పోరాట స్ఫూర్తిని చూపించింది. భారత చెస్‌కు సంబరాలు తెచ్చిన విజయం ఇది." దివ్య దేశముఖ్ పేరు గత మూడు రోజులుగా గూగుల్ ట్రెండ్స్‌లో ట్రెండ్ అవుతోంది, ఈ రోజు ఆమె విజయంతో మరింత ప్రముఖ్యత సంతరించుకుంది.

### ఏడేళ్ల వయసులోనే..

చిన్న వయసు నుంచే ప్రకంపనలు సృష్టించడం తన నైజంగా మార్చుకుంది దివ్య. ఏడేళ్ల వయసులోనే నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో విజయంతో అందరి దృష్టిలో పడింది దివ్య. 2021లో ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్ గెలుపొందిన ఆమె.. అదే ఏడాది ఇంటర్నేషనల్ మాస్టర్స్ విజేతగా నిలిచింది. అదే జోరు చూపిస్తూ.. 2022లో ఇండియన్ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్ కైవసం చేసుకున్న దివ్య.. బోర్డు ముందు ప్రశాంతంగా ఉంటూనే వ్యూహాత్మక ఆటతో ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నంలా మారింది. ఈ ఏడాది 'ఫిడే చెస్ ఒలింపియాడ్'లో భారత బృందం విజయంలో కీలక పాత్ర పోషించిందీ యంగ్‌స్టర్.

# నేనే కెప్టెన్‌గా ఉంటే బెన్ స్టోక్స్ తిక్క కుదుర్చేవాడిని

### మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం

ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆదివారం ముగిసిన నాలుగో టెస్ట్ చివర్లో బెన్ స్టోక్స్ వ్యవహరించిన తీరుపై అశ్విన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ ప్రవర్తన సరికాదని మండిపడ్డాడు. తానే టీమిండియా కెప్టెన్‌గా ఉండి ఉంటే బెన్ స్టోక్స్ తిక్క కుదుర్చేవాడినని తెలిపాడు. డ్రాకు అస్సలు ఒప్పుకోకపోయేవాడినని, ఆఖరి 15 ఓవర్లు కూడా ఆడించేవాడినని తెలిపాడు. ఈ మ్యాచ్‌లో వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా అసాధారణ ప్రదర్శనతో టీమిండియా ఓటమి నుంచి గట్టెక్కింది. అద్వితీయమైన బ్యాటింగ్‌తో రాణించిన జడేజా, సుందర్‌ల సెంచరీలను అడ్డుకోవాలనే దురుద్దేశంతో బెన్ స్టోక్స్ నిర్ణీత సమయం కన్నా ముందే డ్రాకు ప్రతిపాదించాడు. అయితే ఈ విజ్ఞప్తికి భారత ఆటగాళ్లు నిరాకరించారు. దాంతో సహనం కోల్పోయిన బెన్ స్టోక్స్.. భారత ఆటగాళ్లను అవమానపర్చేలా మాట్లాడాడు. హ్యారీ బ్రూక్, బెన్ డకెట్ బౌలింగ్‌లో సెంచరీలు చేస్తారా? అని హేళన చేశాడు. ఈ మాటలు స్టంప్ మైక్‌లో రికార్డ్ అయ్యాయి. ఇంత హేళన చేసినా.. సహనం కోల్పోని జడేజా.. డ్రా అనేది తమ చేతుల్లో లేదని చెప్పాడు. ఇద్దరు సెంచరీలు పూర్తి చేసుకున్న అనంతరం భారత్‌కు డ్రాకు అంగీకరించడంతో మ్యాచ్ ముగిసింది. అయితే జడేజాపై కోపంతో బెన్ స్టోక్స్ అతనికి షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. అసహనం వ్యక్తం చేస్తూ షేక్ హ్యాండ్ ఇవ్వకుండా వెళ్లిపోయాడు. బెన్ స్టోక్స్ తీరుపై ఓ జర్నలిస్ట్‌తో మాట్లాడిన అశ్విన్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.'ద్వంద వైఖరి అనే పదాన్ని ఎప్పుడైనా విన్నారా? ఆ పదం అర్థం కావాలంటే నాలుగో టెస్ట్ ఆఖరి పది నిమిషాల ఆటను చూడాలి.

## బాలాజీ రాధాకృష్ణ దేవాలయ

# భూముల లీజు రద్దు చేయాలి



**అల్వాల్, జూలై 28 (జనంసాక్షి):** మచ్చ బొల్లారం బాలాజీ రాధాకృష్ణ దేవాలయం భూములను లీజుకు ఇవ్వకుండా రద్దు చేయాలని కోరుతూ స్థానిక ప్రజలు చేస్తున్న విజ్ఞప్తులకు అనుగుణంగా ఎండోమెంట్ అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించామని బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సహాయంతో ఎండోమెంట్ కమిషనర్‌తో పాటు ఎండోమెంట్ మంత్రిని కలిసి భూముల లీజు ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరామని తెలిపారు.దీనికి సానుకూలంగా స్పందించిన అధికారులు రద్దు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పటివరకు మచ్చ బొల్లారంలో ఉన్న సామరస్య వాతావరణం దెబ్బతినకూడదని, మార్కెట్ ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించి లీజ్ రద్దు చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డోలి రమేష్, సురేందర్ రెడ్డి, డప్పు రాజు, శోభన్ బాబు, నల్ల సురేష్, రేవంత్ రెడ్డి, భాస్కర్ గౌడ్, శంకర్ రెడ్డి, కాంతి దాస్, తుల్జా దేవి, లక్ష్మి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వడ్డించే భోజనం విషయంలో

# నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్వో

**బొంరాస్ పేట,జూలై 28 (జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని బొట్లవాని తండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను వికారాబాద్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ రవీంద్ర యాదవ్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని నాణ్యత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత ప్రమాణాలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.హెపటైటిస్ అనేది కాలేయంకి సంబంధించి ఉండే వాపు అని, ఇది వివిధ రకాల వైరస్ వల్ల ఏర్పడు తుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి హేమంత్ కుమార్, వైద్య సిబ్బంది, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పంత్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే

### టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌ను డ్రా చేసుకోవడంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ సంతోషం వ్యక్తం చేశాడు. భారత జట్టు అద్వితీయమైన పోరాటంతోనే ఇది సాధ్యమైందని కొనియాడాడు. గాయంతో బ్యాటింగ్ చేసిన రిషభ్ పంత్‌ను ఎంత పొగిడినా తక్కువేనన్నాడు. ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అజేయ శతకాలతో చెలరేగి టీమిండియాను గట్టెక్కించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గౌతం గంభీర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. తమ ఆటగాళ్ల సెంచరీల ముందు డ్రా కోసం ప్రయత్నించిన బెన్ స్టోక్స్ తీరును తప్పుబట్టాడు. 'ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడం గర్వంగా ఉంది. చాలా మంది మా జట్టును తక్కువ అంచనా వేసారు. కానీ మా ఆటగాళ్లు అద్భుతమైన పోరాటంతో ఓటమి నుంచి గట్టెక్కించారు. దేశం కోసం మా ఆటగాళ్లు పోరాడుతారు. శుభ్‌మన్ గిల్ ప్రతిభపై ఎలాంటి సందేహం అవసరం లేదు. క్రికెట్ గురించి తెలియని వారికే అతనిపై సందేహాలు ఉంటాయి. శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ ఏ మాత్రం భారం కాదు. రిషభ్ పంత్ కాలికి గాయమవ్వడంతో ఆఖరి టెస్ట్‌కు దూరమయ్యాడు. విరిగిన కాలుతో బ్యాటింగ్ చేసిన రిషభ్ పంత్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే. అతని పోరాటం రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుంది.'అని గంభీర్ తెలిపాడు.ఈ మ్యాచ్‌ను ముందుగానే డ్రా చేయాలని బెన్ స్టోక్స్ కోరడాన్ని గంభీర్ తప్పుబట్టాడు. ఇది సరైన చర్య కాదని, ఇంగ్లండ్ ఆటగాళ్లు కూడా సెంచరీలకు చేరువగా ఉంటే స్టోక్స్ డ్రాకు అంగీకరించేవాడా? అని ప్రశ్నించాడు.

# ఎన్నికల్లో ఫార్మా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే ఇంటి వద్ద ఫార్మ రైతుల ధర్నా

**యాచారం, జులై 28 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, రైతుల భూములు రైతులకు ఇప్పిస్తామని ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారని ఫార్మా భూ బాధిత రైతులు అన్నారు. నానక్ నగర్, తాడిపర్తి మేడిపల్లి కురుమిద్ద ఫార్మాసిటీ రైతులు. నగరంలోని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఇంటి వద్ద ఫార్మా సిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కవుల సరస్వతి, కానమోని గణేష్ ఆధ్వర్యంలో సోమవారం ఏకంగా ధర్నాకు దిగారు. ఫార్మా బాధిత రైతులంతా ట్రాక్టర్లు క్రూజర్లతో ఉదయమే ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకున్నారు. రైతులంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఫార్మాసిటీని రద్దు చేసి, భూములు తిరిగి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలోని భూముల్ని ఆన్లైన్లో నమోదు చేసి రైతు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. రైతులకు సమాధానం చెప్పలేక ఇంట్లో నుంచి ఎమ్మెల్యే బయటకు రావడం లేదని ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల వద్ద నుంచి కుంట భూమి తీసుకోలేదని గత ప్రభుత్వం సేకరించిన భూములతో రైతులకు ఎలా మేలు చేయాలని ఆలోచిస్తున్నామని అన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రభుత్వం కన్నా రైతుల సంక్షేమమే తనకు ముఖ్యమన్నారు. కలెక్టర్, ఆర్డీఓ, ఎంఆర్ఓ ద్వారా రైతులందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన రైతులు నాయకులు ఉన్నారు.









# మిత్రుల ఇంటికి మంత్రులు

- తేనేటి విందు మధ్యాహ్నం భోజనం
- మిత్రులతో అపూర్వ కలయిక

**వికారాబాద్ జిల్లా బ్యూరో జులై 28 (జనం సాక్షి):** చిన్ననాటి స్నేహితులు కలిస్తే వారి పరిస్థితిని చూసి పలకరించలేని ఈ రోజుల్లో చిన్ననాటి మిత్రులను కలుసుకోవడానికి మంత్రులు వారి ఇంటికి వెళ్లనున్నారు. ఈ అపూర్వ మిత్రుల కలయిక మంగళవారం చోటు చేసుకోనుంది. వికారాబాద్ జిల్లా యాలాల మండలం లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మంత్రి శ్రీధర్ బాబు, తెలంగాణ శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తో కలిసి పర్యటించనున్నారు. ముందుగా జుంటిపల్లి శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి తరువాత జుంటిపల్లి గ్రామం లో ఉప ముఖ్యమంత్రి బట్టి మల్లు విక్రమార్క తన బాల్య స్నేహితులైన డాక్టర్ రవీందర్ రావు, శ్యాంసుందర్రావు రాఘవేందర్ రావుల ఇంటికి వెళ్లి వారిని పలకరించి ముచ్చటించనున్నారు. వాడు ఆదిత్యాన్ని స్వీకరిస్తారు. హైస్కూల్ కాలేజీ యూనివర్సిటీలో వీరంతా కలిసి చదువుకున్నారు. ఇప్పటికీ ప్రతి దీపావళి పండుగ రోజున అర్ధగంట పాటు తమతో చరవాణిలో సంభాషిస్తారని మంత్రి మిత్రుడు శ్యామ్ రావు గుర్తు చేశారు. తరువాత దౌలాపూర్ లో 220 కోట్లతో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేయనున్నారు. దౌలాపూర్ గ్రామం సమీపానా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మరియు 6 విద్యుత్ సబ్ స్టేషన్ లకు శంఖు స్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా బట్టి విక్రమార్క స్నేహితుడు శ్యామ్ సుందర్ రావు మాట్లాడుతూ బట్టి విక్రమార్క మా స్వగ్రామమైన జుంటుపల్లి కి రావడం చాలా సంతోషమని అతని రాజకీయంగా ఎదిగిన గాని స్నేహితులు సరదాగా ఉంటాడని అందరిని ప్రేమతో పలకరిస్తాడని ఇంతకు ముందు ఉన్నట్టుగానే ఇప్పుడు కూడా ఉన్నాడని ఇది చాలా సంతోష కరమైన విషయం అని శ్యామ్ సుందర్ రావు అన్నాడు. అలాగే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పెద్దముల్ మండల్‌లో ఉన్న తన స్నేహితుని ఇంటికి వెళ్లారు. తాండూర్ నియోజకవర్గం లో వివిధ కార్యక్రమాలు ముగించుకున్న అనంతరం మంత్రులు మధ్యాహ్న భోజనం కోసం అక్కడికి వెళ్ళమన్నారు.

# సిరిసిల్లలో జాతీయస్థాయి విద్యాసంస్థ ఏర్పాటు

- జులై 29న ప్రారంభం కానున్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ
- ఆన్ లైన్ ద్వారా కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించనున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి శ్రీధర్మేంద్ర ప్రధాన్.
- అప్పటి ఎంపీ, ప్రస్తుత బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ విశేష కృషితో ఏర్పాటు
- స్థలం, నిధులు మంజూరు, ఉపాధ్యాయులు సిబ్బంది కేటాయింపు




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 28(జనంసాక్షి) :** సిరిసిల్ల ప్రాంత విద్యార్థులకు జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలు అందించేలా, పోటీ పరీక్షల్లో రాణించే సామర్థ్యం కలిగిన కేంద్రీయ విద్యాలయం ఏర్పాటై, గత పుష్కర కాలంగా విజయవంతంగా కొనసాగుతోంది. ఈ విద్యాసంస్థలో సిరిసిల్ల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ, జాతీయ స్థాయి ప్రమాణాలతో పాటు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సిరిసిల్లలో 2013లో అప్పటి కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేశారు. ఈ కృషి ఫలితంగా 2015లో కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. సిరిసిల్లలోని నేత కార్మికులు, ఇతర స్థానిక పరిస్థితుల నేపథ్యంలో పొన్నం ప్రభాకర్ విశేష కృషితో కేంద్రీయ విద్యాలయం స్థాపనకు మార్గం సుగమమైంది. దీని ఫలితంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం సిరిసిల్లలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు ప్రతి తరగతిలో 50 సీట్లు కేటాయించి, అవసరమైన ఉపాధ్యాయులు, సిబ్బంది, ఫర్నిచర్‌ను అందించింది. తంగళ్ళపల్లిలో ఈ విద్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించగా, 2015 నుండి ఈ సంస్థ విజయవంతంగా నడుస్తోంది. 2025 ఏప్రిల్ నుండి తంగళ్ళపల్లి పరిధిలో సొంత భవనంలో కేంద్రీయ విద్యాలయం అందుబాటులోకి వచ్చింది. ఈ సంస్థ మంజూరుకు పొన్నం ప్రభాకర్ చేసిన విశేష కృషిని విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పటికే దాదాపు ఒక బ్యాచ్ విద్యార్థులు ఈ విద్యాలయం నుండి బయటికి రానున్నారు.

ఈ కేంద్రీయ విద్యాలయం, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంగా జూలై 29న ఉదయం 9 గంటలకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆన్‌లైన్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుకంతా మజుందర్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర ఇంచార్జి) జయంత్ చౌదరి హాజరవుతారు. ఈ విద్యాలయం సిరిసిల్ల ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలను అందించడమే కాక, జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించేందుకు బలమైన పునాదిని వేస్తుంది.

# పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- గతేడాది పోలిస్తే పెరిగిన వినియోగం
- సరఫరాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్



హైదరాబాద్, జులై28 (జనంసాక్షి) : గతేడాదితో పోల్చుకుంటే ఈ వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నదని, రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశమున్నందున విద్యుత్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ అధికారులతో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మిట్టల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి విద్యుత్ శాఖకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాలతో పాటు గృహ రంగంలో కూడా భారీ వినియోగం నమోదవుతుంది. దీనికి తోడు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండటంతో లక్షలాది మోటర్లు నిరంతరం నడుస్తున్నాయి. ఫలితంగా వర్షాల సీజన్‌లో కూడా భారీగా డిమాండ్ నమోదవుతున్నది. గతేడాదిజులై 31 న 13541 మెగావాట్లుగా నమోదయిన గరిష్ట డిమాండ్ ఈ ఏడాది జులై 16న 14.05 శాతం పెరుగుదలతో 15443 మెగావాట్లు-గా నమోదయ్యిందన్నారు. పుష్కలంగా వర్షాలు పడుతుండటంతో నీటి లభ్యత బాగా పెరిగింది. వరి నాట్లు జోరందుకోవడంతో రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో సీఎండీ స్థాయి నుండి కింది స్థాయి సిబ్బంది వరకు అప్రమత్తంగా వుంటూ ఎలాంటి అవాంతరాలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ వర్షాల సీజన్ లో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వుంటూ, వర్షాలు కురిసేటప్పుడు తప్పనిసరిగా తమ కార్యాలయాల్లో అందుబాటులో వుంటూ సరఫరా పర్యవేక్షించాలని నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్లు డా. నర్సింహులు, చక్రపాణి, కృష్ణా రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# దేవుడి పేరుతో కబ్జాల పర్వం

- ప్రజావాణి ఫిర్యాదుల్లో అవే అగ్రభాగం
- హైడ్రా ప్రజావాణికి మొత్తం 51 ఫిర్యాదులు



హైదరాబాద్, జులై 28 (జనంసాక్షి) : సోమవారం హైడ్రా ప్రజావాణిలో మొత్తం 51 ఫిర్యాదులందగా.. అందులో అధిక భాగం రహదారులు, నాలాలు ఆక్రమణలే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని ఆంజనేయ నగర్లో దాదాపు ఎకరం పార్కులో జెండా పాతి కొంతమంది కబ్జాకు పాల్పడుతుంటే.. సికింద్రాబాద్ చికోటీ గార్డెన్స్ పరిసరాల్లో గుడికి అనుసంధానంగా షెడ్డులు వేసి రోడ్డును ఆక్రమిస్తున్నవారు మరికొందరు. పటాన్ చెరు ప్రాంతంలో 500ల విల్లాలున్న ఏపీఆర్ ప్రవీణ్ లగ్జీరియాలో కూడా ఎకరం పార్కు స్థలంలో కొంతమేర గుడి కట్టి కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించారు. గూగుల్ మ్యాప్స్ద్వారా పరిస్థితిని ఫిర్యాదుదారులకు వివరించి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘాలు, సొసైటీలు ఖాళీ స్థలాలను ప్లాట్లుగా అమ్ముకుంటే వారిపైన చర్యలు తీసుకోవాలని పలువురు అసెట్ ప్రొటెక్షన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

# రాష్ట్రంలో మీనాక్షి పాదయాత్రలు

- జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు పర్యటనలు

హైదరాబాద్, జులై28 (జనంసాక్షి) : తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా పాదయాత్రలను ప్రారంభించబో తున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు వివిధ నియోజ కవర్గాల్లో పాదయాత్రలు, శ్రమదానం కార్యక్రమాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పాదయాత్రల షెడ్యూల్ ప్రకారం, జూలై 31న పరిగి పట్టణంలో సాయంత్రం పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర అనంతరం పరిగి లో రాత్రి బస చేయనున్నారు. ఆగస్టు 1న ఉదయం శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం ఆందోల్ నియోజక వర్గంలో పాదయాత్ర చేస్తారు.ఆగస్టు 2న శ్రమదానం కార్యక్రమంతోపాటు- కార్యకర్తల సమావేశం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఆర్మూరు లో పాదయాత్ర చేపడతారు. ఆగస్టు 3న ఉదయం శ్రమదానం నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఖానాపూర్ లో పాదయాత్ర ఉంటు-ంది.ఆగస్టు 4న ఉదయం శ్రమదానం అనంతరం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం చొప్పదండిలో పాదయాత్ర చేసి రాత్రి బస చేస్తారు. ఆగస్టు 5న ఉదయం శ్రమదానం అనంతరం సమావేశం నిర్వహించి, సాయంత్రం వర్ధన్నపేట లో పాదయాత్ర చేపడతారు. చివరిగా ఆగస్టు 6న శ్రమదానం, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పాదయాత్రలను ముగిస్తారు.

# మహిళా రైతు తలపగిలితే కేసెందుకు కట్టలేదు?

- కంపెనీ పిటిషన్ ఆధారంగా ఆగమేఘాలపై రైతులపై కేసులు
- దాడి జరిగిన బాధితులు పిటిషన్ ఇస్తే పోలీసులు పట్టించుకోలేదు
- ఎన్‌హెచ్ఆర్సీ ముందు వాదనలు వినిపించిన అడ్వొకేట్ రామారావు
- కాలుష్య పరిశ్రమలు జీవించే హక్కును కాలరాస్తున్నాయి
- పర్యావరణానికి ప్రమాదకర పరిశ్రమల ఏర్పాటు మానవ హక్కుల ఉల్లంఘనే..
- వాదనలు వినిపించిన ప్రముఖ శాస్త్రవేత్త బాబురావు



హైదరాబాద్, జూలై 28 (జనంసాక్షి) : పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన ఘటనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) విచారణ చేపట్టింది. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో సోమవారం విచారణ ప్రారంభం కాగా ఎన్‌హెచ్ఆర్సీ చైర్‌పర్సన్ జస్టిస్ రామ సుబ్రహ్మణ్యం వాదనలు విన్నారు. రైతుల పక్షాన పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది రామారావు ఇమ్మానేని రైతులపై పెట్టిన కేసు విషయాలను వివరించారు. పర్యావరణానికి హానికలించేదిగా ఫ్యాక్టరీ ఉన్నందునే రైతులు వ్యతిరేకించారని, ఈ క్రమంలో ఫ్యాక్టరీ యాజమాన్యం తరపు బౌన్సర్లు రైతులను గాయపరచగా ఓ మహిళ తల కూడా పగిలిందన్నారు. కంపెనీ యాజమాన్యం ఇచ్చిన పిటిషన్‌పై ఆగమేఘాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. బాధిత రైతులు ఇచ్చిన రెండు పిటిషన్లపై మాత్రం కేసులు పెట్టలేదన్నారు. ప్రజలు వ్యతిరేకిస్తున్న ఈ పరిశ్రమను జనావాసం లేనిచోటుకు తరలించాలని న్యాయవాది రామారావు విజ్ఞప్తి చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బీఎన్ సంతోష్ బీఎం సంతోష్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీకి ప్రభుత్వ అనుమతులున్నాయని, ప్రజలు మాత్రం వ్యతిరేకిస్తున్నారని ఎన్‌హెచ్ఆర్సీకి తెలియజేశారు. ఇరువర్గాల వాదనలు విన్న జస్టిస్ దీనిపై ఎన్జీటీకి ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించగా.. శాస్త్రవేత్త బాబురావు స్పందించారు. అనుమతులు వచ్చిన ఏడాది తర్వాత ఫ్యాక్టరీ పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారని, అప్పటివరకు ఎవరికీ ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. రైతులు పనులన్నీ వదిలేసుకుని ఇక్కడిదాకా రావడమే ఎంతో ఇబ్బంది అని, ఫ్యాక్టరీ దుష్పరిణామాలపై ఎలాంటి అవగాహన లేని అమాయక రైతులు ఎక్కడిదాకా వెళ్లగలరని అన్నారు. తదనంతరం ఇరువైపులకు చెందిన పూర్తి ఆధారాలను నాలుగు వారాల్లోపు సమర్పించాలని జస్టిస్ ఆదేశించారు. ఈ విచారణకు జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి శ్రీనివాసరావు, డీఎస్పీ మొగుల య్య, శాంతినగర్ సీఐ టాటాబాబు హాజరయ్యారు.

### ప్రజలకు సరైన వివరాలు చెప్పడం లేదు : శాస్త్రవేత్త బాబురావు

ఇథనాల్ ఫ్యాక్టరీలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతుంటే స్థానిక ప్రజలకు అధికారుల నుంచి సరైన వివరాలు చెప్పడం లేదని, కంపెనీ వాళ్లకే న్యాయం చేసేలా వారి తీరు ఉన్నదని ప్రముఖ శాస్త్రవేత్త బాబురావు అన్నారు. ప్రజల తిరుగుబాటు పరిస్థితి ఎందుకొచ్చిందో పరిశీలించకుండా అపోహల పేరిట వారి పోరాటాన్ని చిన్నచూపు చూస్తున్నారని అన్నారు. 15 నిమిషాల విచారణలో సమస్య తీవ్రతను ఎలా తెలుపగలమని, కనీసం డీపీఆర్‌ను సమగ్రంగా పరిశీలించేవారు లేరని అన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఎన్నిసార్లు లేఖలు రాసినా ఇప్పటికీ సరైన సమాధానం రావడం లేదన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల పర్యావరణానికి పెనుముప్పు ఉందని, అందుకే ప్రజలు తీవ్రంగా పోరాడుతున్నారని చెప్పారు. నీరు, గాలి, నేల, జీవిత భద్రత గురించి ఆందోళన ఉన్నందునే చుట్టుపక్కల గ్రామాలన్నీ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తున్నాయన్నారు. శాస్త్రీయంగా వివరించకుండా, ప్రజల ఆమోదం తీసుకోకుండా రైతులపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉండి పోరాడితేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అనేకవిధాలుగా గ్రామస్తులను మభ్యపెడతారని, రాజకీయ నాయకుల ప్రలోభాలకు తలొగ్గకుండా ప్రజల తరపున స్థానిక నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. మున్ముందు జరగబోయే ఉద్యమంలోనూ ఏ పార్టీ జెండా లేకుండా చూసుకోవాలన్నారు. ఎన్‌హెచ్ఆర్సీ విచారణ సందర్భంగా తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ కన్నెగంటి రవి, పెద్దధన్వాడ, చిన్నధన్వాడ, మాన్‌దొడ్డి, ననసూరు సహా 12 గ్రామాల రైతులు పాల్గొన్నారు.




# ఈగిల్ టీమ్ దాడులు

### 5కోట్ల విలువైన గంజాయి స్వాధీనం



హైదరాబాద్, జులై28 (జనంసాక్షి) : ఈగల్ టీమ్ దాడుల్లో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి, డ్రగ్స్ రవాణాకు పాల్పడుతున్న వారి పట్ల ఉక్కుపాదం మోపుతోంది. హైదరాబాద్‌లో ఈగల్ టీమ్ భారీగా గంజాయిని పట్టుకుంది. ఏకంగా రూ. 5 కోట్లు- విలువైన 935 కిలోల గంజాయిని సీజ్ చేసింది. బాటసింగరం ఫ్రూట్ మార్కెట్ సమీపంలో ఈగల్ టీమ్ దీనిని పట్టుకుంది. ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టు-కుంది. 35 సంచుల్లోని 455 గంజాయి ప్యాకెట్లు సీజ్ చేశారు. తెలంగాణ 2025లో అతి పెద్ద గంజాయి పట్టివేత ఇదే. గంజాయి ముఠాను గుట్టు రట్టు చేసింది ఈగల్ టీమ్. ఖమ్మం-రాచకొండ నార్కోటిక్ పోలీసుల జాయింట్ ఆపరేషన్. టాటా ఐచ్చర్ వాహనంలో ఫలమండీ ట్రే క్రింద దాచిన గంజాయి.. గంజా రవాణాకు ఎస్కార్ట్ చేసిన టయోటా ఇన్నోవా.. మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న ముఠా పట్టుబడింది.. ముఠా సారధి పవార్ కుమార్ బాడు అరెస్ట్ అయ్యాడు.. సమాధాన్ భిస్, వినాయక్ పవార్ అరెస్ట్.. మొత్తం 455 ప్యాకెట్ల గంజా, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ ఫైనాన్సింగ్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఛేదించిన ఈగల్ టీ-మ్.. పరారిలోనే సప్లేయర్స్ సచిన్ గంగారాం చౌహాన్, విక్కీ సేథ్ లు.

# షటిల్ ఆడుతూ కుప్పకూలిన యువకుడు




హైదరాబాద్, జూలై28 (జనంసాక్షి) : షటిల్ ఆడుతుండగా నాగోల్‌లో గుండెపోటుతో యువకుడు మృతి చెందాడు. ఖమ్మం జిల్లాలో తల్లాడకు చెందిన గుండ్ల రాకేష్ (25) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తూ నాగోల్ నివసిస్తున్నాడు. నాగోల్ లోని ఇండోర్ స్టేడియంలో రాకేష్ షటిల్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. రాకేష్ ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయాడని వెల్లడించారు. గుండెపోటుతోనే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

## బీసీ సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడాలి

### బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు



హైదరాబాద్ (జనంసాక్షి) : బీసీ సంఘాలన్నీ జేఏసీగా ఏర్పడి ఉద్యమించాలని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు అన్నారు. బీసీ రిజర్వేషన్ల పై బిజేపీ ప్రభుత్వం బీజేపీ పార్టీ బిసి రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ 40 ఏండ్లు వెనకకు పోయిందని, 1984 నుండి బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ వస్తున్న బీజేపీ చివరకు తన నిజ స్వరూపాన్ని ప్రదర్శించిందని, బీసీ వ్యతిరేక ఉద్యమాలకు సమాయత్తమవుతున్నారని, ఇక బీసీలు చిన్న చిన్న మీటింగులు సదస్సులు ధర్నాలతో పని కాదని, బృహత్తర ఉద్యమంగా ఓట్ల రాజకీయ, బలాబలాల ఉద్యమంగా మలుపు తిరగాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులను మంజూరు చేయండి


- కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులను ప్రారంభించండి
- కేంద్ర మంత్రి గడ్కరీని కోరిన బండి సంజయ్
- ప్రజల అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకులన్నీ అధిగమించామన్న గడ్కరీ
- కమిటీ నివేదిక వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ
- త్వరలోనే సీఆర్ఐఎఫ్ నిధుల విడుదలపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడి



కరీంనగర్ (జనంసాక్షి) : తెలంగాణలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్ లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నిధులను విడుదల చేయాలని కోరుతూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. న్యూఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన బండి సంజయ్ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అందులో భాగంగా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. మొత్తం రూ.113 కోట్లతో కూడిన సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట-ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణంతోపాటు గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి-పోతూర్ రోడ్డు విస్తరణ పనులు వీటిలో ఉన్నాయి. దీంతోపాటు చందుర్తి నుండి మోత్కురావుపేట వరకు (కిమీ 5/0 నుండి 8/450 వరకు) వంతెనల నిర్మాణ పనుల ప్రతిపాదనలు ఉన్నాయి. అట్లాగే కిస్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణ పనులు, శంకరపట్నం మండలంలోని అర్కాండ్ల (గ్రామం) నుండి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రతిపాదనలు సైతం వీటిలో ఉన్నాయి. దీంతోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులు విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కరీంనగర్-జగిత్యాల విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. గత ఎన్నికలకు ముందే కరీంనగర్ నుండి జగిత్యాల వరకు 4 లేన్ విస్తరణ కోసం కేంద్రం రూ.2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయా ప్రతిపాదనలకు ఆమోదం పొందడంతోపాటు టెండర్ ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చి నెలలు దాటుతున్నా నేటికీ టెండర్ ప్రక్రియ ప్రారంభం కాని విషయాన్ని గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులను పిలిపించిన గడ్కరీ అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకుల నేపథ్యంలోనే కరీంనగర్- జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం ఆయా అడ్డంకులన్నీ అధిగమించి నివేదికను కమిటీకి పంపించామని తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన వెంటనే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి అతి త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు.

# గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులు

- సింగపూర్ నుంచి మరింత సహకారాన్ని ఆశిస్తున్నాం
- గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులల్లో సహకరించండి
- సింగపూర్ వాణిజ్యమంత్రి టాన్ సీ లాంగ్‌తో చంద్రబాబు చర్చలు



అమరావతి, జూలై28 (జనంసాక్షి) : గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రాజెక్టులను చేపట్టిందని ఇందులో సింగపూర్ నుంచి మరింత సహకారాన్ని ఆశిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సింగపూర్ లో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య పరిశ్రమల శాఖలోని మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక విభాగం మంత్రి టాన్ సీ లాంగ్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం భేటీ అయ్యింది. అలాగే గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులు తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి కోరారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన అంశంలోనూ సింగపూర్ భాగస్వామ్యం అవసరమని సీఎం చంద్రబాబు అన్నారు. లాజిస్టిక్ రంగంలో సింగపూర్ బలంగా ఉందని.. ప్రస్తుతం ఏపీలోనూ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని సింగపూర్ మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. పోర్టులు, లాజిస్టిక్స్ రంగంలో ఉత్తమ విధానాలను అనుసరించటంలో సింగపూర్ ఏపీకి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. మానవ వనరులు, సైన్స్ అండ్ -టె-క్నాలజీ, ట్రేడ్ రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వం హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని పరిష్కరించే అంశంపై సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ తో సీఎం చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు- పునరావృతం కాకుండా రికార్డులు సరి చేసేందుకే సింగపూర్ వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సింగపూర్ పై ఉన్న అభిమానంతో గతంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించామని చంద్రబాబు గుర్తు చేశారు. సింగపూర్ ను చూసే గతంలో హైదరాబాద్ లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మరోవైపు ఏపీలో నవంబరు నెలలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ను సీఎం ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ లో గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ రంగంలో సింగపూర్ ఏపీ కలిసి పని చేస్తామని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ, గృహనిర్మాణం లాంటి అంశాల్లో ప్రపంచ బ్యాంకుతో కలిసి పని చేస్తున్నామని సింగపూర్ మంత్రి ఏపీ సీఎంకు వివరించారు. గతంలో హైదరాబాద్ వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిశానని సింగపూర్ మంత్రి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, నారాయణ, టీజీ భరత్ సహా ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370